ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 01.11.2025 | సంపుటి : 12 సంచిక : 101 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# అన్నదాతకు అండగా ఉంటాం

వరంగల్‌లో కబ్జాలను తొలగిస్తాం

ఎకరాకు రూ.10 వేల పరిహారం • మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు

ఇల్లు మునిగితే రూ.15 వేలు - ఆవులు, గేదెలు మృతి చెందితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు

## తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ ఏరియల్ సర్వే..

హుస్నాబాద్, వరంగల్, హనుమకొండలో పరిశీలించిన ముఖ్యమంత్రి ..

**వరంగల్ ప్రతినిధి,హుస్నాబాద్(జనంసాక్షి):** మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. హెలికాప్టర్ నుంచి హుస్నాబాద్,ఉమ్మడి వరంగల్, హనుమకొండ ముంపుకు గురైన ప్రాంతాలు హెలిక్యాప్టర్ నుండి పరిశీలించారు. తుఫాన్ మిగతా 2లో..

**ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదలబోము. తాత్కాలిక చర్యలపై కాకుండా శాశ్వత చర్యలపై అధికారులు దృష్టి సారించాలి. వరదల్లో చనిపోయిన వారి వివరాలు సేకరించాలి. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు, ఇళ్లు మునిగిన వారికి రూ.15 వేలు చొప్పున పరిహారం చెల్లించాలి. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల కింద పరిగణించాలి." - ముఖ్యమంత్రి రేవంత్**



- మొంథా తుఫాన్‌తో 12జిల్లాల్లో ప్రభావం
- పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు ఇవ్వాలి
- ఇసుకమేటలు తొలగించేందుకు ప్రణాళికలు
- అధికారుల్లో సమన్వయ లోపం వరంగల్ వరదల్లో స్పష్టంగా కనిపించింది
- ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- కలెక్టరేట్‌లో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష

**హనుమకొండప్రతినిధి(జనంసాక్షి):** 'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని మిగతా 2లో..



## మంత్రిగా అజార్ భాయ్ ప్రమాణం

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్
సీఎం రేవంత్, మంత్రులు తదితరుల హాజరు

నాపై వచ్చినవన్నీ ఆరోపణలే.. • భారాస, బీజేపీలకు నా గురించి తెలియదు
ఏ శాఖ ఇచ్చినా సంతోషమే.. • ప్రమాణస్వీకారం అనంతరం మీడియాతో మంత్రి అజహరుద్దీన్

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అం తరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినం దనలు తెలియచేశారు. మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం మిగతా 2లో..

అజారుద్దీన్‌పై ఏం కేసులు ఉన్నాయో

## కిషన్ రెడ్డి చెప్పాలి

- భారత జట్టు కెప్టెన్‌గా ఆయన ఎన్నో విజయాలు అందించారు
- ఎంపీగా ప్రజలకు సేవలు చేశారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

2లో..

## ఐఏఎస్‌ల బదిలీ

ఎనిమిది మంది అధికారులకు స్థానచలనం
ఉత్తర్వులు జారీచేసిన సీఎస్

2లో..

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్..

## మరింత సమయం కావాలి


సుప్రీంను గడువుకోరిన స్పీకర్ కార్యాలయం

2లో..

భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు

## హైకోర్టులో ఊరట

సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవరించిన డివిజన్ బెంచ్



2లో..

ఇంటర్ పరీక్షలు

## ఫిబ్రవరి 25 నుంచి

- ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 2 నుంచి
- షెడ్యూల్ విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు

## ఉద్యోగుల పెండింగ్ బకాయిలు విడుదల

అక్టోబర్ నెలకు సంబంధించి
రూ.1,031 కోట్లను విడుదల చేసిన ఆర్థిక శాఖ



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఉద్యోగుల బకాయిలతోపాటు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అక్టోబర్ నెల పెండింగ్ బిల్లులు సుమారు రూ.1,031 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఏకకాలంలో నిధులను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను కాంగ్రెస్ సర్కార్ దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోంది. అందులో భాగంగా అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను విడుదల చేశారు. రూ.10లక్షల లోపు పెండింగ్ బిల్లులను సైతం క్లియర్ చేయాలన్న మిగతా 2లో..

## ఇద్దరు ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా

- పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- ప్రభుత్వ సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి
- కేబినెట్ సమావేశాలకు



**హైదరాబాద్(జనంసాక్షి):**సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీకృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కొరాల మిగతా 2లో..



## మన కష్టం తెలిసిన వ్యక్తినే గెలిపించుకోండి

నవీన్‌కు మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షో

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెహమత్ నగర్‌లోని పీజేఆర్ విగ్రహం వద్ద నుంచి సీఎం రోడ్‌షోలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు."రాజకీయల్లో అవకాశం అందరికీ అన్నిసార్లు రాకపో వచ్చు. అవకాశం వస్తే మన కోసం కష్టపడే వ్యక్తిని నెగ్గించుకోవాలి. అలా చేయకపోతే చారిత్రక తప్పిదమే. సెంటిమెంట్ పేరుతో ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ముందుకొచ్చింది. పీజేఆర్ అకాల మరణం చెందితే ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేశారు. ఆనాడు పీజేఆర్ గౌరవార్థం రాజకీయ వైరుధ్యాన్ని చంద్రబాబు పక్కనపెట్టారు. ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేయడానికి చంద్రబాబు సహకరించారు. బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టింది" అని రేవంత్ మండిపడ్డారు. మిగతా 2లో..

## మీకు అండగా నేనుంటా.. భారాసను గెలిపించండి

అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ : కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో పలువురు ఎంఐఎం నాయకులకు కండువా కప్పి గులాబీ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎలా మిగతా 2లో..





## వామ్మో.. గెలిస్తే కోటి ఉద్యోగాలట!

- కోటి మంది మహిళలను లక్షాధికారులను చేస్తాం
- బీహార్‌లో ఎన్డీయే మేనిఫెస్టో విడుదల

**పాట్నా(జనంసాక్షి):** బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార ఎన్డీయే కూటమి మేనిఫెస్టో విడుదల చేసింది. కోటి ఉద్యోగాల హామీతో పాటు కోటి మంది మహిళలను లక్షాధికారులుగా చేయడమే తమ లక్ష్యంగా అందులో ప్రకటించుకుంది. శుక్రవారం పాట్నాలోని మౌర్య హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్డీయే జాయింట్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం నితీశ్‌కుమార్‌తో పాటు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మిగతా 2లో..

## ఖమ్మం జిల్లాలో సీపీఎం నేత దారుణ హత్య

- ఇంట్లో మార్నింగ్ వాక్ చేస్తున్న సామినేని రామారావుని కత్తులతో పొడిచి, గొంతు కోసి చంపిన దుండగులు
- దోషులకు కఠినశిక్ష విధిస్తాం : భట్టి
- ఖండించిన మాజీ ఎంపీ నామ



**చింతకాని(జనంసాక్షి):** చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో దారుణం జరిగింది. సీపీఎం సీనియర్ నేత సామినేని రామారావుని తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్యచేశారు. ఇంట్లో మార్నింగ్ చేస్తుండగా.. కత్తులతో పొడిచి, గొంతు కోసి చంపేశారు. సామినేని రామారావు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, మిగతా 2లో..

## సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను మరిచిపోయారు

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శ
దేశ సమగ్రత, ఐక్యత మనందరికీ చాలా ముఖ్యమైనదని వెల్లడి



**అహ్మదాబాద్(జనంసాక్షి):** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి నేడు. ఈ సంద ర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. గుజరాత్ కెవాడియాలోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగాయి.పటేల్ భారీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం. పరేడ్‌ను ప్రారంబించి జాతీయ ఏకతా ప్రతిజ్ఞను చేయించారాయన. అంతకు ముందు..తన ఎక్స్ ఖాతాలో ఆయన ఒక పోస్ట్ ఉంచారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశం నివాళులు అర్పిస్తోంది. ఆయన భారత ఏకతకు ప్రేరణగా నిలిచారు. ఆయన చూపిన మార్గంలో దేశాన్ని బలంగా, స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దే సంకల్పాన్ని మళ్లీ గుర్తుచేసుకుంటున్నాం అని సందేశం ఉంచారు. స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద జరిగిన పరేడ్‌లో వివిధ దళాల గౌరవ వందనాన్ని ప్రధాని మోదీ స్వీకరించారు. ఫ్లాగ్ మార్చ్, మిగతా 2లో..

## హెచ్1బీ వీసాలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయి

- లబ్ధిపొందుతున్న వారిలో అత్యధికులు భారతీయులే..
- ప్రత్యేక వీడియో విడుదల చేసిన అమెరికా కార్మిక శాఖ



**వాషింగ్టన్(జనంసాక్షి):** హెచ్-1బీ వీసాల దుర్వినియోగంపై ట్రంప్ సర్కారు గత కొంతకాలంగా ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో అక్కడి లేబర్ డిపార్ట్‌మెంట్ 'ఎక్స్' వేదికగా ఓ వీడియో యాడ్‌ను విడుదల చేసింది. హెచ్1బీ వీసాలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని అందులో పేర్కొంది. ఇలా వీసాలు పొందుతున్నవారిలో అత్యధికులు భారతీయులు కూడా ఉన్నారని సదరు వీడియోలో పేర్కొంది."హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తున్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అమెరికా కలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ మా యువత విషయంలో అలా జరగడం లేదు" అని యాడ్‌లో ప్రస్తావించారు. మిగతా 2లో..

## భారత్-అమెరికాల మధ్య కుదిరిన కీలక రక్షణ ఒప్పందం

9లో..

## మీకు అండగా నేనుంటా

దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయా లన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టిన ఈ బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని.. వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని ధైర్యం చెప్పారు. ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే.

## సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను మరిచిపోయారు

బ్యాండ్ బృందాలు, గుర్రాలు, ఒంటెలు, శునకాలతో కూడిన మౌంటెడ్ యూనిట్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నాయి. మహిళా బలగాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చివరగా ఎయిర్ షో నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో ఈ పరేడ్‌ను నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

మోదీ మాట్లాడుతూ.. . దేశ సమగ్రత, ఐక్యత మనందరికీ చాలా ముఖ్యమైనది. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ విస్మరించింది. కానీ మా ప్రభుత్వం వల్లభాయ్ పటేల్ ఆశయాలను నెరవేరుస్తోంది. కశ్మీర్ సమస్యను కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు. ఆర్టికల్ 370 ని తొలగించి కశ్మీర్ ను భారత్ అభివృద్ధిలో భాగం చేశాం. భారత్ సరిహద్దులలో జనాభాను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ దీనిపై చర్యలు తీసుకోకుండా కళ్ళు మూసుకుంది. తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అంతర్గత భద్రతను గాలికి వదిలేసింది. భారత్ పై కన్నెత్తి చూస్తే ఇంట్లోకి చొరబడి దాడి చేస్తాం. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్ సహా ఉగ్రవాదులందరికీ భారత్ సత్తా తెలిసి వచ్చింది. అర్బన్ నక్సలైట్లు, వారికి మద్దతు ఇచ్చే వారిని వదిలిపెట్టం . భారత్ అంతర్గత భద్రతకు నక్సలైట్లు ముప్పుగా మారారు. దేశానికి ముప్పు ఏర్పడితే ప్రతి ఒక్కరికి భద్రత ప్రమాదంలో పడుతుంది" అని అన్నారు.ఇదిలా ఉంటే.. పటేల్ జయంతి వేళ ప్రధాని మోదీ ఆయన కుటుంబ సభ్యులను కలిశారు. గురువారం ఏకతా నగర్‌లోని పటేల్ మనవడు గౌతమ్ పటేల్, ఆయన భార్య నందిత, కుమారుడు కేదార్, కోడలు రీనా, మనవరాలు కరీనాతో కాసేపు ముచ్చటించారు. పటేల్ కుటుంబాన్ని కలవడం ఆనందంగా ఉంది. ఆయన దేశానికి చేసిన అపార సేవలను గుర్తుచేసుకున్నాం అని ఆ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు.

## ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి, సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. అలాగే, సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్‌గానూ ఆయన కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. రవాణాశాఖ కమిషనర్‌గా కె.ఇలంబర్తిని నియమించిన ప్రభుత్వం.. పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ఆయనకు అప్పగించింది.మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలు సీఎస్ వద్దే ఉంచింది. జీఏడీ కార్యదర్శిగా ఇ.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చింది. టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించిన సర్కార్.. ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా జి.జితేందర్‌రెడ్డిని నియమించింది. అలాగే, ఎస్సీ సహకార సంస్థ ఎండీగా ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించింది. అభివృద్ధి సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక కార్యదర్శిగా సైదులుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

## మరింత సమయం కావాలి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును గడువు కోరింది. గతంలో సుప్రీంకోర్టు విధించిన మూడు నెలల గడువు నేటితో పూర్తికావడంతో రెండు నెలల గడువు ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ కార్యాలయం కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని సుప్రీంకోర్టుకు తెలిపింది.

## భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట

### సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవరించిన డివిజన్ బెంచ్

హైదరాబాద్(జనంసాక్షి): భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అక్టోబర్ 17న సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సవరించింది. నాగారం సర్వే నెంబర్ 194, 195లో ఐఏఎస్, ఐపీఎస్‌లు కొనుగోలు చేసిన భూములను నిషేధిత జాబితాలో ఉంచాలంటూ సింగిల్ బెంచ్ గతంలో తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు ఐపీఎస్‌లను డివిజన్ బెంచ ్‌లో అప్పీల్ చేశారు. ఆధారాలను పరిశీలించిన డివిజన్ బెంచ్.. అవి భూదాన్ భూములు కానప్పుడు నిషేధిత జాబితాలో ఎందుకు ఉంచాలని వ్యాఖ్యానించింది. సర్వే నెంబర్ 194, 195లోని భూములు పట్టా భూములేనని కలెక్టర్ కూడా నివేదిక ఇచ్చారు. సర్వే నెంబర్ 181, 182లలో ఉన్న భూములపై మాత్రం యథాతథ స్థితి కొనసాగుతుందని డివిజన్ బెంచ్ పేర్కొంది.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బతుకమ్మ కుంట ప్రైవేట్ స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని సుధాకర్ అనే వ్యక్తి ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని రంగనాథ్‌ను ప్రశ్నించింది.

## ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి

### ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 2 నుంచి

### షెడ్యూల్ విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఈ పరీక్షలు జరగనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై ఫిబ్రవరి 21వ తేదీ నాటికి పూర్తవుతాయని పేర్కొంది. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు కేవలం సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు జరిగేవి. ఈసారి వీరితో పాటు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకూ ల్యాబ్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో జనవరి 21వ తేదీన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, జనవరి 23వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 24వ తేదీన ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

# అన్నదాతలకు అండగా ఉంటాం



అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులకునే ప్రసక్తే లేదన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్ సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టం అంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు.నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని వార్నింగ్ ఇచ్చారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేయాలని సూచించారు. ఇండ్లు కోల్పోయిన వాళ్ల లిస్ట్ సిద్ధం చేసి ఇండ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ముంపు తీవ్రత పెరిగిందని చెప్పుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకోవాలని, వరద ప్రభావంపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విజిట్ చేయాలని హుకుం జారీ చేశారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు కూడా తెచ్చుకుందామని తెలిపారు. గతంలో కేంద్ర నిధులు వాడుకోలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఇండ్లు, పంటలు, పశువుల నష్టంపై పూర్తి నివేదిక కావాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని ఆజ్ఞాపించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నా రు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సిఎం వెంట మంత్రి పొంగులేటి, మేయర్ గుండుసుధారాణి తదితరులు ఉన్నారు.

## తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ ఏరియల్ సర్వే..

ప్రభావం వల్ల నీట మునిగిన ప్రాంతాలను ఆయన వీక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఏరియల్ సర్వేకు వెళ్లారు. అనంతరం హనుమ కొండలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం.. సమ్మయ్యనగర్ లో వరద ప్రాంతాలను, దెబ్బతిన్న నాలాలను పరిశీలించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఎంపీ బలరాం నాయక్ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధి కారులు ముంపు హనుమకొండలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం.. సమ్మయ్యనగర్‌లో వరద ప్రాంతాలను, దెబ్బతిన్న నాలాలను పరిశీలించారు.మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలమైన విషయం తెలిసిందే.

## హెచ్1బీ వీసాలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయి

హెచ్-1బీల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని వీడియోలో భాగంగా ఓ గ్రాఫ్‌లో చూపించారు. ఈ వీసాల విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా..? అని గుర్తించేందుకు 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ యువతతో భర్తీ చేయకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం.

## వామ్మో.. గెలిస్తే కోటి ఉద్యోగాలట!

మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు సరిగ్గా వారం ఉంది(నవంబర్ 6న). ఈలోపు.. నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ వికసిత్ బీహార్ కోసమంటూ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. వలస కార్మికుల సంఖ్య అధికంగా ఉన్న రాష్ట్రంలో కోటి ఉద్యోగాల హామీ కీలక ప్రకటనగా మారే అవకాశం కల్పిస్తోంది. అలాగే.. మహిళా సాధికారత పేరిట లక్షపతి దీదీల హామీపైనా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. అంతేకాదు.. అధికారంలోకి మళ్లీ వస్తే, నైపుణ్య గణాంక సర్వే నిర్వహిస్తామని హామీ చేర్చింది. ఇప్పటికే..బీహార్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విపక్ష మహాగట్‌బంధన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. బీహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర అనే టైటిల్‌తో ఆర్జేడీ నేత, కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా సమక్షంలో మేనిఫెస్టోను విడుదల చేశారు. అందులో. .రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టో వాగ్దానం చేసింది. 20 రోజుల్లో ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తెలిపింది. జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని ప్రకటించింది. కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పెర్మనెంట్ చేస్తామని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తీసుకువస్తామని తెలిపింది..

## ఉద్యోగుల పెండింగ్ బకాయిలు విడుదల

సర్కార్ నిర్ణయంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అధికారులు రిలీజ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన రూ.10లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచా యతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లనూ అధికారులు రిలీజ్ చేశారు.

## ఇద్దరు ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా

ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ఖమ్మం జిల్లాలో సీపీఎం నేత దారుణ హత్య

తెలంగాణ రైతు సంఘం మాజీ ప్రధాన కార్యదర్శిగా పనిచే శారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే గుండాలు అత్యంత కిరాతకంగా కాపు కాసి హత్య చేశారని సీపీఎం ఆరో పించింది. సామినేని రామారావు హత్యను సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జగ్గుల జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుద ర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు తీవ్రంగా ఖండించారు. హంతకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని ఖమ్మం సీపీ సునీల్ దత్ తదితరులు సందర్శించారు.

**దోషులను వెంటాడి వేటాడి పట్టుకుంటం: భట్టి**

సీపీఎం నేత సామినేని రామారావు హత్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిగ్భ్రాంతికి గురయ్యారు. హంతకులు ఎవరైనా పట్టుకొని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారు లను ఆదేశించారు. 'దోషులను వెంటాడి, వేటాడి చట్టపరంగా శిక్షిస్తం. కలుషిత హింసరాజకీయాలకు తావు లేదు. క్లూస్ టీం, శ్రీ ఫర్ డాగ్స్, సైబర్ టీం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అన్ని మార్గాలను ఉపయోగిస్తం.రామారావు కుటుంబాని కి అన్ని విధాలుగా అండగా ఉంటా 'అని భరోసా ఇచ్చా

**'నామ( ఖండన**

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో సీపీఎం సీనియర్ నేత సామినేని రామారావు హత్యకు గురికావడం పట్ల బిఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ప్రశాంతంగా ఉంటున్న ఖమ్మం లో హత్య రాజకీయాలు సరికావు అని తెలిపారు ఈ ఘటనకు బాధ్యులైన దోషుల ను త్వరితగతిన పట్టుకొని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రామారావు మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు

# మంత్రిగా అజార్ భాయ్ ప్రమాణం

చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు.



మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

నా గురించి కిషన్‌రెడ్డికి అవగాహన లేదు: మంత్రి అజారుద్దీన్

మంత్రిగా తనకు అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని అజారుద్దీన్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మీడియాతో అజారుద్దీన్ మాట్లాడారు. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు తనపై చేస్తున్న విమర్శలపై స్పందించారు. నాపై వచ్చినవన్నీ ఆరోపణలు మాత్రమే. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతల విమర్శలు సరైనవి కావు. నా గురించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పూర్తిస్థాయి అవగాహన లేదు. నాపై ఉన్న ఒక్క కేసులోనూ నేరం రుజువు కాలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. మంత్రిగా నాకు అవకాశం కల్పించారు.. నాకు ఏ శాఖ ఇచ్చినా ఇబ్బంది లేదని అజారుద్దీన్ అన్నారు.తెలంగాణ మంత్రిగా కాంగ్రెస్ నేత అజారుద్దీన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు అజారుద్దీన్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హాజరయ్యారు. మంత్రివర్గంలో అజారుద్దీన్ చేరికతో తెలంగాణ కేబినెట్ మంత్రుల సంఖ్య 16కి చేరింది. అయినా తెలంగాణ కేబినెట్‌లో ఇంకా 2 బెర్తులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే.. ఈ సందర్భంగా నూతన మంత్రి అజారుద్దీన్‌కి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి మంత్రివర్గంలోకి ఆహ్వానం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. తన మంత్రి పదవికి, జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముడి పెట్టొద్దని పేర్కొన్నారు. రెండింటినీ వేర్వురుగా చూడాలని కోరారు. తానేంటో ప్రజలందరికీ తెలుసని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తానని అజారుద్దీన్ స్పష్టం చేశారు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే.. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో స్థానం కల్పించింది.

## కోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా అధికారులు నిద్రపోతున్నారు

### వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై శుక్రవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది కోర్టు తీర్పును గౌరవించడం లేదంటూ అసహనం వ్యక్తంచేసింది. ఈ కేసులో నవంబర్ 3న కోర్టు ముందు వర్చువల్‌గా హాజరయ్యేందుకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు అనుమతి కోరగా నిరాకరించింది. "అధికారులు కోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా నిద్ర పోతున్నారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా వారు అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వ్యక్తిగతంగా వచ్చి వివరించాలి. కోర్టు సమయం ఇచ్చినా ఎలాంటి చర్యలు లేకపోవడం దురదృష్టకరం" అని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా మందలించింది తమ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని బిహార్ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన అభ్యర్థనను తోసిపుచ్చింది. "రాష్ట్రంలో అంతా ఎన్నికల సంఘం చూసుకుంటుంది. మీరు చింతించకండి. కోర్టుకు రండి" అని తేల్చిచెప్పింది. అసలు ఏం జరిగిందంటే..? వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్



ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న ఆదేశించింది. దానిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ కేసును విచారించింది. ఆ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడినుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంటూ.. ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది. ఈ క్రమంలోనే ఆ ఆదేశాల అమలుపై తీసుకుంటున్న చర్యలను తెలియజేసేలా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది అయితే తెలంగాణ, పశ్చిమబెంగాల్, దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే వాటిని దాఖలు చేశాయి. అలాగే ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వీధి కుక్కల దాడులు నమోదవుతుండటాన్ని గత విచారణలో తీవ్రంగా పరిగణించింది. ఆ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. తాజాగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరగా ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.

## అజారుద్దీన్‌పై ఏం కేసులు ఉన్నాయో కిషన్ రెడ్డి చెప్పాలి


**భారత జట్టు కెప్టెన్‌గా**

**ఆయన ఎన్నో విజయాలు అందించారు**

**- ఎంపీగా ప్రజలకు సేవలు చేశారు**

**- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. అజారుద్దీన్‌పై ఏం కేసులు ఉన్నాయో సమాధానం చెప్పాలన్నారు. భారత



జట్టు కెప్టెన్‌గా ఆయన ఎన్నో విజయాలు అందించారని చెప్పారు. ఎంపీగా ప్రజలకు సేవలు చేశారని తెలిపారు. అజారుద్దీన్ మంత్రి పదవిపై భాజపా నేతలకు ఎందుకంత అక్కసు అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి పదవిపై 3 నెలల ముందే నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

# కరీంనగర్ కాంగ్రెస్‌లో 'అర్బన్' కుంపటి




- అర్బన్ బ్యాంక్ ఎన్నికల వేళ భగ్గుమన్న వర్గ విభేదాలు..
- మంత్రుల అండదండలు తమకేనంటూ నేతల వేర్వేరు ప్యానెళ్లు..
- అధికారిక ప్యానెల్ లేదంటూ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి ప్రకటన
- వెలిచాల రాజేందర్‌రావు తీరుపై అధిష్టానం గుర్రు
- 35 ఏండ్లుగా కాంగ్రెస్ కోసం పనిచేస్తున్న గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్ జిల్లా బ్యూరో, (బుర్ర పరశురాం) అక్టోబర్ 31 (జనంసాక్షి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. నేడు జరగనున్న కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఈ పోరుకు కొత్త వేదికగా మారాయి. మంత్రులు, ఎమ్మెల్యేల ఆశీస్సులు తమకే ఉన్నాయంటూ పలువురు ముఖ్య నేతలు వేర్వేరు ప్యానెళ్లను ప్రకటించడం పార్టీలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. పరిస్థితి చేయిదాటుతుండటంతో, కాంగ్రెస్ పార్టీకి అధికారిక ప్యానెల్ ఏదీ లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ స్వయంగా ప్రకటన విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ఒకే గూటిలో.. వేర్వేరు ప్యానెళ్లు!

కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలను కాంగ్రెస్ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే, ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేయాల్సింది పోయి, నేతలు వేర్వేరు వర్గాలుగా విడిపోయారు. కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు ఇటీవల మీడియా సమావేశం నిర్వహించి, అర్బన్ బ్యాంక్‌పై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ప్రకటించారు. మంత్రులు, ఎమ్మెల్యేల అండదండలతోనే తాను ప్యానెల్‌ను ఏర్పాటు చేశానని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి తానే అసలైన అభ్యర్థినంటున్నారు. 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్న తనకే అధిష్టానం, మంత్రుల మద్దతు ఉందని, భారీ మెజార్టీతో గెలుస్తామని ఆయన కూడా సొంతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇద్దరు నేతలు మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లను బహిరంగంగా ప్రస్తావించడం పార్టీలో కలకలం రేపింది.

### అధికారిక ప్యానెల్ లేదు: డీసీసీ అధ్యక్షుడు

ఇద్దరు నేతలు మంత్రుల పేర్లను వాడుకోవడంతో, పార్టీ అధికారికంగా జోక్యం చేసుకుంది. డీసీసీ అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ముఖ్య నేతలతో చర్చించిన మీదట ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "కాంగ్రెస్ పార్టీ పక్షాన అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు ఎలాంటి ప్యానెల్‌ను ప్రకటించలేదు. మంత్రులు, ఎమ్మెల్యేల అండదండలు మాకే ఉన్నాయంటూ జరుగుతున్న అసత్య ప్రచారాలను కార్యకర్తలు, ప్రజలు నమ్మవద్దు" అని ఆయన ఆ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

### ఉమ్మడి జిల్లాలో వరుస వివాదాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు బహిర్గతం కావడం ఇది మొదటిసారి కాదు. గత కొద్ది నెలలుగా పలు సంఘటనలు ప్రభుత్వానికి, పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. గతంలో ఒక మంత్రిని విమర్శించారన్న ఆరోపణలపై కరీంనగర్ కాంగ్రెస్ నేతను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. జగిత్యాలలో ఓ మాజీ మంత్రి.. సీనియర్లకు ప్రాధాన్యత దక్కడం లేదంటూ మరో మంత్రితో తన ఆవేదన వ్యక్తం చేసిన సంభాషణ వైరల్ అయింది. సిరిసిల్లలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఓ కాంగ్రెస్ నేత.. అధికారికి ఆదేశాలిచ్చిన ఆడియో లీక్ కావడం చర్చనీయాంశమైంది. తాజాగా అర్బన్ బ్యాంక్ ఎన్నికల రూపంలో ఈ వర్గపోరు మరోసారి వీధికెక్కడం పార్టీ శ్రేణుల్లో అయోమయానికి కారణమవుతోంది. వేర్వేరు నేతలు అధిష్టానం, మంత్రుల పేర్లను వాడుకుంటూ ప్రచారం చేస్తుండటంతో, ఎవరికి మద్దతివ్వాలో తెలియక కార్యకర్తలు, ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు. ఈ అంతర్గత విభేదాలకు అధిష్టానం ఎలా ముగింపు పలుకుతుందోనన్న అంశం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

## సీఎం ప్రజావాణి చొరవతో
# సౌమ్యకు పునర్జన్మ



- రూ. 9 లక్షల ఆర్థిక సహాయం అందించిన సీఎం ప్రజావాణి
- సీఎం రేవంత్ రెడ్డి, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డి, నోడల్ ఆఫీసర్ దివ్య లకు ధన్యవాదాలు తెలిపిన బాలిక తల్లిదండ్రులు

హైదరాబాద్ (జనంసాక్షి) : ముఖ్యమంత్రి ప్రజావాణి చొరవతో బాలిక సౌమ్యకు పునర్జన్మ లభించింది. ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న సౌమ్యకు సీఎం ప్రజావాణి కొండంత అండగా నిలిచి ఆ బాలిక చికిత్సకు అవసరమైన రూ. 9 లక్షలు ఆర్థిక సాయం సమకూర్చి ఆ బాలిక నిండు ఆరోగ్యంతో ఉండేందుకు సహకారాన్ని అందించింది. శుక్రవారం ప్రజాభవన్ లో నిర్వహించిన సీఎం ప్రజావాణికి సౌమ్య తన తండ్రి తల్లిదండ్రులతో కలిసి వచ్చి సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చల్లని దీవెనలు తన ఆయుష్షును పెంచిందని సౌమ్య సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణిలో సౌమ్యకు రూ. 4 లక్షల సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కును చిన్నారెడ్డి, దివ్య అందించారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ( సెర్ప్ ) నుంచి మరో రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని సౌమ్యకు అందించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు ఆసుపత్రిలో శస్త్రచికిత్స విజయవంతమైంది. జనగాం జిల్లా వెంకిర్యాల గ్రామానికి చెందిన ఈర్ల శ్రీనివాస్, అనురాధ తమ కుమార్తె సౌమ్య అనారోగ్య సమస్యను రెండు నెలల క్రితం సీఎం ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చారు. తల్లి అనురాధ స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు కాగా తండ్రి ఈర్ల శ్రీనివాస్ సన్నకారు రైతు. సౌమ్య దీనస్థితి గమనించి సీఎం ప్రజావాణి అండగా నిలిచింది.

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలి
- బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అనేక రకాల డ్రామాలకు మోసాలకు తెరలేపిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర కోరారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు ఉన్నప్పటికీ బిల్లుల పేరుతో ఆర్డినెన్స్ పేరుతో జీవోల పేరుతో గవర్నర్ దగ్గర రాష్ట్రపతి దగ్గర బిల్లులను పంపించి జంతర్మంతర్లో ధర్నా చేసి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితనే రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడిస్తేనే బీసీల యొక్క సత్తా ఏమిటో తెలుస్తుందని ఉపేంద్ర అన్నారు రిజర్వేషన్లు పెంచాలంటే రాజ్యాంగం సవరణ అవసరమని ఇది తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో లేకపోయినప్పటికీ తప్పుడు వాగ్దానాలతో మోసం చేసిందని ఆయన అన్నారు. కానీ రాజ్యాంగ సవరణలు అవసరం లేకుండా ఈ పార్టీ చేయాల్సిన పనులు చేయకుండా బీసీలను వంచిస్తున్నదని బీసీ కులాలకు సంబంధించిన కార్పొరేషన్లు ఫెడరేషన్లు ఎందుకు నింపడం లేదని పాలకమండల్లు ఎందుకు వేయడం లేదని దీనికి రాహుల్ గాంధీ రాజ్యాంగం అవసరం లేదని ఆయన అన్నారు కాబట్టి ముఖ్యమంత్రి ఒక్క సంతకంతో 20 కి పైగా ఫెడరేషన్ కులాల యొక్క కార్పొరేషన్ల చైర్మన్లను డైరెక్టర్లను నియమించవచ్చని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఎదుగుదల బీసీలు రాజకీయ నాయకులుగా ఎదగటం ఇష్టం లేని కాంగ్రెస్ పార్టీ ఈనాడు ఈ పోస్టులను నింపడం లేదని ఆయన అన్నారు. బీసీ బంధు పథకాన్ని అమలు చేయడం లేదని మహాత్మ జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్షిప్‌ను అమలు చేయడం లేదని ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వడం లేదని ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలకు ఒక్క పైసా కేటాయించడం లేదని గొర్రెల పంపిణీ చేప పిల్లల పంపిణీ పథకాలు అమలు పరచకుండా బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందకుండా రాజకీయంగా ఎదగకుండా కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తున్నదని బీసీ గురుకుల పాఠశాలను నిర్వీర్యం చేస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వకుండా సరైన విద్య బోధన లేకుండా గురుకులాలలో రక్షణ లేకుండా విద్యార్థులను ఎలుకలు కరుస్తున్న ఫుడ్ పాయిజన్ అవుతున్న విద్యార్థులు చనిపోతున్న ఈ ప్రభుత్వం పట్టించుకోకుండా బీసీలను అణగదొక్కుతున్నదని ఇలాంటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీసీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు దానికి సరైన గుణపాఠం జూబ్లీహిల్స్ నుంచే మొదలవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుచిత్తుగా ఓడించి బీసీల ఆకాంక్షలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసే విధంగా ప్రతి కుల సంఘ నాయకుడు బిసి నాయకులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్నమోసాలను, వంచన దగాలను ఎండగడుతూ గడప గడపకు ప్రచారం చేసి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు.

## బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా టీమ్
# జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం






హైదరాబాద్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారాన్ని వినూత్నంగా ముమ్మరం చేస్తోంది. 'మాట-ముచ్చట' కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతూ, కేసీఆర్ నాయకత్వం ఎంత అవసరమో వివరిస్తోంది. పార్టీ డివిజన్ ఇన్‌చార్జీలు, సీనియర్ నాయకుల నేతృత్వంలో అన్ని డివిజన్లు, బూత్‌లలో ప్రచార బృందాలు తమ కేటాయింపు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా టీమ్ కూడా బీఆర్ఎస్ పార్టీ మార్గదర్శకత్వంలో పాల్గొంటోంది. అధ్యక్షులు గుర్రాల నాగరాజు ఆదేశాల మేరకు సౌత్ ఆఫ్రికా టీమ్ బృందం శేక్‌పేట్ ప్రాంతంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించింది. ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా టీమ్ మాట్లాడుతూ నాలుగు లక్షల మంది ఇచ్చే తీర్పు తెలంగాణలో నాలుగుకోట్ల మంది భవిష్యత్‌ను నిర్ణయిస్తుందనే విషయాన్ని ప్రజలకు కుప్లంగా వివరించనున్నారు. ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా టీమ్ బైఎలక్షన్ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు ఈ ప్రచారములో నరేందర్ రెడ్డి మేడసాని , జైవిష్ణు గుండ , నరేష్ తేజ యాదారి , శ్రీనివాస్ రేపల శేక్‌పేట్ లో డోర్ టు డోర్ ప్రచారములో పాల్గొని అందరికి గత ప్రభుత్వములో తెలంగాణాని ఎంత ముందుకు తీసుకెళ్లారో వివరంగా చెప్పి అందరిని ఇప్పుడు జరిగే ఎన్నికలలో కార్ గుర్తుకు ఓటు వెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఆఫ్రికా టీమ్ నాయకులు, కార్యకర్తలు హొటళ్లు, కిరాణా షాపులు, టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, పార్కులు వంటి జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలతో సన్నిహితంగా మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను చేరుస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో షేక్‌పేట్ నాలా, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సౌత్ ఆఫ్రికా టీమ్ కమిటీ సభ్యులు పాల్గొని సునీతకు మద్దతు తెలిపారు.



# అబ్‌ట్యూస్ యాంగిల్ బుక్ ఆవిష్కరణ




హైదరాబాద్ (జనంసాక్షి) : సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బిపి ఆచార్య రాసిన "ఆబ్ట్యూస్ యాంగిల్" అనే కార్టూన్ పుస్తకం కొత్త ఎడిషన్‌ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైష్ణవ్ బండారు ఫౌండేషన్ ఎఫ్‌టీసీసీఐలో సివిల్ సర్వీసెస్, జాతీయ సమైక్యతపై ఒక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రముఖ మాజీ సివిల్ సర్వెంట్లు, మాజీ డిజిపిలు, సి ఆంజనేయ రెడ్డి, ఎకె మొహంతి, అరుణ బహుగుణ, రాజేంద్ర కుమార్, మాజీ ఐఏఎస్ అధికారులు బిపి ఆచార్య, అజయ్ మిశ్రా, నిర్మల గోనెల, ఇతరులు హాజరయ్యారు. జాతీయ సమైక్యత, అఖిల భారత సేవలను సృష్టించడంలో సర్దార్ పటేల్ పాత్రకు ఘనమైన నివాళులు అర్పించారు.

### వరదలో కొట్టుకుపోయిన యువతి మృతదేహం లభ్యం

#### కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

జనగామ, అక్టోబర్31 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. కుండపోత వర్షాలతో రాష్ట్రం తడిసి ముద్దయింది. భారీ వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. కుంటలు, చెరువులు నిండిపోయి ఉధృతంగా ప్రవహించాయి. ఈ క్రమంలోనే జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తిమ్మంపేట శివారులో వరదల్లో గురువారం ప్రేమ జంట గల్లంతయ్యింది. బోళ్లమత్తడి వద్ద ప్రేమికులు బరిగెల శివకుమార్, బక్క శ్రావ్య బైక్‌తో సహా నీటిలో కొట్టుకుపోయారు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న శివకుమార్ చెట్టు కొమ్మను పట్టుకుని బయటపడగా.. శ్రావ్య గల్లంతయ్యింది. వరదల్లో గల్లంతైన యువతి మృతదేహం శుక్రవారం లభ్యమయింది. జిల్లాలోని శంకర్ తండా సమీపంలోని కుంటలో శ్రావ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసు అధికారులు.. మృతదేహాన్ని స్వగ్రామం దమన్నపేటకు తరలించారు. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రియురాలి మృతితో ప్రియుడి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు

# పత్తి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- దళారుల పత్తిని కొనుగోలు కేంద్రాలలోనికి అనుమతించకూడదు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 31, (జనంసాక్షి) : జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుండి పత్తి కొనుగోలు చేపట్టనున్న నేపథ్యంలో పత్తి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని తాండూర్ మండలంలోని మహేశ్వరి కాటన్స్, శ్రీరామా జిన్నింగ్-ప్రెస్సింగ్ యూనిట్ లను మండల తహసిల్దార్ జ్యోత్స్న తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సి సి ఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. 2025- 26 సంవత్సరంలో మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని తెలిపారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోనికి అనుమతించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మొంత తుఫాన్ ప్రభావంతో
# కోలుకోలేని రైతన్నలు

- నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విన్నపం
- 1500 ఎకరాల్లో వరి పంటలు నష్టపోయినట్లు గుర్తించిన వ్యవసాయ అధికారులు...

చెన్నారావుపేట, అక్టోబర్ 31 (జనం సాక్షి): మొంత తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షంతో రైతన్నలు ఇంకా కోలుకోవడం లేదు. గత రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో గ్రామాలలోని రైతన్నలు పంటలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. చెరువు కొమ్ము తండా గ్రామానికి చెందిన వాంకుడోత్ శ్రీను, జగన్, బోడ సదర్ లాల్ అనే రైతులు తమ 7 ఎకరాల్లో సాగుచేసిన వరి పంటలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. అంతేకాక ఉప్పరపల్లి, కోనాపురం, పాపయ్యపేట, జల్లి, ఎల్లయ్యగూడెం, భోజేరువు, చెన్నారావుపేట, ఖాదర్ పేట, లింగగిరి, అమీనాబాద్ తదితర గ్రామాలలో తుఫాన్ దాటికి చేతికి అంది వచ్చిన వరి పంటలు నేలమట్టమై వరి గింజలు మొత్తం రాలిపోయి తీవ్రంగా నష్టపోయామని గ్రామాలలోని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలోని 30 గ్రామాలలో 1500 ఎకరాలలో వరి పంటలను రైతులు నష్టపోయినట్లు గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి తెలిపారు.

# మానసిక ఆరోగ్యమూ మహాభాగ్యమే!



దేశాభివృద్ధిలో ఆ దేశ ప్రజల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందనేది నిస్సందేహం. ఆరోగ్యం అంటే " కేవలం ఏదైనా ఒక వ్యాధి లేకపోవడమే కాదని, శారీరక, మానసిక, సాంఘిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచించింది. ఆరోగ్యంలో మానసిక ఆరోగ్యం ఒక ముఖ్యమైన భాగం. ఇది మానవ శ్రేయస్సులో ప్రధాన అంశం. ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి ఇది దోహదపడుతుంది, అందుకే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యం. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం.

మంచి మానసిక ఆరోగ్యం లేకపోతే, రోజువారీ ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కోవడం కష్టంతో కూడుకున్న పని.

జీవితంలో ప్రతికూల పరిణామాలు దూరం కావాలంటే మానసిక ఆరోగ్యం ప్రధానమైనది. ఇది వ్యక్తి మానసిక శ్రేయస్సుకు పునాదిలాంటిది. జ్ఞానం, అవగాహన, ప్రవర్తనలను ఇది ప్రభావితం చేస్తుంది. సామాజికంగా ఒక వ్యక్తి సవాళ్లను ఎదుర్కోవడానికి, జీవన వృద్ధికి, సానుకూల సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి మానసిక ఆరోగ్యం అత్యంత ఆవశ్యకం.

**మానసిక అనారోగ్యానికి కారణాలు:**

అంతర్జాతీయ పరిశోధనల ప్రకారం, తొంభై శాతం మానసిక అనారోగ్యాలకు ఒత్తిడే ప్రధాన కారణం. ఒత్తిడికి దారితీసే పరిస్థితులు అనేకం ఉన్నాయి, ఇవి వ్యక్తిగత స్థాయి నుండి సామాజిక, ప్రపంచ స్థాయి వరకు విస్తరించి ఉంటాయి. సామాజిక అంశాలను పరిశీలిస్తే, అన్యాయం, హింస, చీత్కారాలకు గురికావడం, పేదరికం, అసమానతలు, వివక్ష, లింగ వివక్ష వంటివి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. వీటితో పాటు, ఆస్తుల దురాక్రమణ, బెదిరింపులు, ఆర్థికమాంద్యం, వ్యాధుల వ్యాప్తి, బలవంతపు వలసలు, వాతావరణ సంక్షోభాలు, పట్టణీకరణ వంటి ప్రపంచ పరిస్థితులు కూడా ఒత్తిడిని, తద్వారా మానసిక అనారోగ్యాన్ని పెంచుతాయి. వ్యక్తిగత కుటుంబ సంబంధిత కారణాలలో శారీరక దండన, దీర్ఘకాలిక అనారోగ్యాలు, వ్యాపార నష్టాలు, అప్పులు, కుటుంబ నిర్లక్ష్యం, అధిక పని ఒత్తిడి వంటివి ఉన్నాయి. ఈ కారకాలన్నీ కలసి లేదా విడిగా పనిచేస్తూ, వ్యక్తి యొక్క మానసిక శ్రేయస్సును దెబ్బతీసి, అనారోగ్యానికి దారితీస్తాయి.

**మానసిక అనారోగ్య ఫలితాలు:**

మానసిక అనారోగ్యం గుండె, నాడీ సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. అలాగే వ్యాధినిరోధక శక్తిని క్షీణింపజేస్తుంది. ఇది సాంఘిక సమస్యలతో పాటుగా ఒత్తిడి, నిరాశ, నిస్పృహ, ఆందోళనలకు కూడా కారణమవుతుంది. తాజా జాతీయ నేర గణాంక రికార్డు బ్యూరో ప్రకారం, మనదేశంలో 2023లో 1,71,418 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇంతకు ముందు ఏడాది ఇవి 170,924 గా ఉన్నాయి. అంటే ఆత్మహత్యలు పెరుగుతున్నాయనే సంకేతాలు కనబడుతున్నాయి. ఆత్మహత్యల ద్వారా మరణించే వ్యక్తులలో 50 నుండి 90 శాతం మంది ఆందోళన, నిరాశకు, ఒత్తిడికి గురైన వారే ఉండడం మనం గుర్తించవలసిన విషయం.

మానసిక అనారోగ్యం పనిచేసే వ్యక్తి సామర్థ్యానికి తీవ్రంగా ఆటంకం కలిగిస్తుంది. ఇది మానవ సంబంధాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. బాధితులు ఇతరులకు హాని కలిగించే పరిస్థితులు కలిగి ఉంటారు. ఇక విద్యార్థులలో అయితే జ్ఞాపకశక్తి లోపిస్తుంది, నేర ప్రవృత్తి పెరుగుతుంది, మత్తు మందులకు బానిసలవుతారు. మానసిక ఆరోగ్య సమస్యలున్న వారు వ్యక్తిగతంగా నష్టపోవడమే కాకుండా, దాని ప్రభావం సమాజం మీద కూడా పడుతుంది. వారి పనితీరు తగ్గడం వలన గణనీయమైన ఉత్పాదకత నష్టాలకు దారితీస్తుంది. ఇది దేశ జిడిపి తగ్గడానికి అవకాశం ఉంటుంది. ఇంకా కుటుంబ ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరిగి పేదరికంలోకి నెట్టబడతారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. అత్యంత తీవ్రమైన స్థితిలో ఆత్మహత్యలకు కూడా పాల్పడతారు, జీవితకాలం తగ్గుతుంది.

**పరిష్కారాలు:**

రోజువారీ జీవితంలో చిన్న చిన్న విజయాలను ఆస్వాదించాలి. మన నియంత్రణలో లేని విషయాల గురించి ఆలోచించకూడదు. అపరాధ భావన లేకుండా కొంతమందికి "నో" చెప్పడం నేర్చుకోవాలి. శారీరక వ్యాయామాలతో పాటు యోగా, ధ్యానం వంటి మానసిక వ్యాయామాలు కూడా చేయాలి. అధిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. మద్యం, డ్రగ్స్ వాటి జోలికి వెళ్ళకూడదు. కుటుంబంతో కొంత సమయం గడపాలి. సరైన నిద్ర, తగినంత విశ్రాంతి తీసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకోవాలి. ఇక ఉద్యోగం లేదా పనిచేసే ప్రదేశంలో ముఖ్యంగా మహిళలు వివక్షత, వేధింపులకు గురికాకుండా సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణం కల్పించాలి. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలపై ఉంది. ఆరోగ్యకరమైన పని వాతావరణం ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేసే అవకాశాన్ని కల్పిస్తుంది. ఇలా చేయడం వలన మొత్తం కుటుంబంలో మానసిక అశాంతులు ఉండవు.

అందరీ సహకారం అవసరం:

ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు వివిధ మానసిక ఆరోగ్య పరిస్థితులు, వాటి నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ప్రజలకు తెలియజేయాలి. మానసిక రుగ్మతలతో బాధ పడుతున్న వారిపై వివక్ష చూపకుండా తగిన వైద్యాన్ని అందించాలి. వీటన్నింటికీ సమాజం, కుటుంబం సహకరించాలి.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

## రైతు ఆవేదనలు...
# తుఫాను దెబ్బతో భారీ నష్టాలు

తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశెనగ పంటలకు తీవ్ర దెబ్బ తీసుకొచ్చాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, 12 జిల్లాల్లో 4.48 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయాయి, 2.53 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారు. వరంగల్‌లో 1.3 లక్షల ఎకరాలు, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండలో భారీ నష్టాలు జరిగాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామంలోని కౌలు రైతు పేరాల తిరుపతిరావు 15 ఎకరాల వరి పంట పూర్తిగా మొలకెత్తడంతో లక్షల అప్పుల్లో చిక్కుకున్నారు. "కోతకు రెండు రోజుల ముందు వర్షం... పిల్లల భవిష్యత్తు ఏమవుతుంది?" అంటూ ఆయన దంపతులు కన్నీరు పెట్టారు. ఇలాంటి ఆవేదనలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పరిహారాలు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

**మొంథా తుఫాను ప్రభావం... 4.48 లక్షల ఎకరాల పంటలు నాశనం**

మొంథా తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాలు కలిగించాయి. మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్‌లో మండల వ్యవసాయ అధికారులు సూర్యతండా, వెల్టూరు, లక్ష్మాపూర్ గ్రామాల్లో పంటలు పరిశీలించి నష్టాలు నమోదు చేస్తున్నారు. వరి, మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దవడంతో కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తాయి. రాయపోల్ మండలం మంతర్ గ్రామంలో వ్యవసాయ అధికారులు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, ఆరబెట్టాలని, టార్పాలిన్‌లతో కప్పాలని రైతులకు సూచించారు. భీమారం మండలం దేశాయిపేటలో ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి, మొక్కజొన్నను కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించి, మొలకలు వచ్చినా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. అయితే, కోతలు పూర్తయినా కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల, కరీంనగర్‌లో భారీ నష్టాలు జరిగాయి.

**అప్పులు, ఆరోగ్య సమస్యలు... రైతుల జీవితాలు కష్టాల్లో**

రైతు సమస్యలు పంట నష్టాలతో మాత్రమే పరిమితం కాదు. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, ఎరువులు, విత్తనాలు, కూలీల ధరలు రైతులను అప్పుల ముదిరిలో ముంచుతున్నాయి. వరి సాగులో ఎకరానికి రూ.35 వేల నుంచి 45 వేల వరకు ఖర్చు అవుతోంది, కానీ పంట ధరలు తక్కువగా ఉండటంతో నష్టాలు మాత్రమే. పత్తి, ఉల్లి, మిరపకాయల సాగుల్లో కూడా ధరల పతనం రైతులను ప్రతిపత్తి మొదలెట్టించింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొతపల్లి రైతు (63) ఆర్థిక ఇబ్బందులతో విషప్రయోగం చేసుకుని మరణించారు. నిర్మల్ జిల్లా మొహాల గ్రామంలో దండే గంగన్న (53) అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల ICMR-NIN, ఒస్మానియా యూనివర్సిటీ అధ్యయనంలో వెలుగుచూసినట్లు, పురుగుమందుల వాడకంతో రైతులకు శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు, ఆస్తమా, ఆల్జైమర్స్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు తలెత్తుతున్నాయి. 493 మంది రైతుల్లో 341 మంది ప్రభావితులుగా గుర్తించబడ్డారు. యూరియా లోపం వల్ల రబీ సీజన్‌లో రైతులు దీర్ఘకాలం క్యూల్లో నిలబడ్డారు.

**రైతు భరోసా మార్గదర్శకాలు... ఎకరానికి రూ.12 వేల సాయం**

ప్రభుత్వం రైతు భరోసా పథకం మార్గదర్శకాలు విడుదల చేసింది. భూ భరత్‌లో నమోదైన వ్యవసాయ భూములకు మాత్రమే సాయం అందుతుంది. జనవరి 26 నుంచి ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి సాయం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో కలిపి రైతులకు మద్దతు. అయితే, కౌలు రైతులు, కూలీలు ఈ పథకం నుంచి మినహాయించబడ్డారని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శనరావు విమర్శించారు. రైతుబంధు పథకంలో భూములు కోల్పోయినవారు సాయం పొందారని, కానీ ఇప్పుడు ఆలస్యం కలగడంతో రైతులు నిరాశలో మునిగారు. రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ పూర్తి అమలు కాకపోవడంతో రైతులు నిరసనలు చేస్తున్నారు.

**పరిహారాలు, ప్రతిపత్తి కోరిక... ప్రభుత్వ చర్యలు ఎలా?**

కల్వకుంట్ల కవిత ఎకరానికి రూ.50 వేల పరిహారం డిమాండ్ చేశారు. తుఫాను దెబ్బతిన్న ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించి సహాయాలు ప్రకటించారు. అయితే, విద్యుత్ సరఫరా అంతరాయాలు, రుణ మాఫీలో ఆలస్యాలు, పెరిగిన ధరలు రైతులను మరింత కష్టాల్లోకి నెట్టాయి. బీఆర్ఎస్ నాయకులు "కిసాన్ సర్కార్ లేకపోవడంతో రైతులు కష్టాల్లో" అని విమర్శిస్తున్నారు. రైతులు ప్రతిపత్తి మొదలుపెట్టి, న్యాయం కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే సర్వేలు, పరిహారాలు, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్. రైతుల భవిష్యత్తు కోసం సమగ్ర చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

డా. ఇక్బాల్ పాషా
9440775732.

## రాలిపోతున్న రైతు నక్షత్రాలు..!

మార్పు మొదలైందంటే
మంచి ఘడియలు
వస్తున్నయనుకుంటిమి..!
అర్ధాంతరంగా రాలిపోతున్న
మట్టిపూల ఆత్మహత్యల వెనుక
ఎంత కన్నీటి సంద్రపు
విస్ఫోటనముందో...!
ప్రతీ సారీ యూరియా కప్
జీవిత పరుగు పందెంలో
ఎవుసం మైదానంలో
ఓడిపోతూనే వున్నాడు..!
కొన ఊపిరితో మళ్ళీ ...
కొత్త చిగురాశతో మళ్ళీ...
యుద్ధం చేస్తూనే వున్నాడు
అలసిపోతున్న గుండె సాక్షిగా..!

మేఘాలు జాలి చూపక
ప్రభుత్వాలు దారి వేయక
దొందు దొందే అయితే
ప్రకృతి పరిహాసం
ప్రభుత్వ నిర్లక్ష్యం
కర్షని చావుకు వంద
కారణాల లెక్క..!
అప్పుల ఊబిలో
మన రైతన్న గుండె జ్వాలలు..!
కర్షకుని కన్నీటి అలల మధ్య
ఎన్నో ప్రభుత్వాల మార్పు
తలరాతలే మారాయి..!
రైతు బంధు
రైతు రుణమాఫీలు
రాజకీయ రంగులు
పులుముకున్నాక...
వ్యవ"సాయపు" రంగవల్లికలు
మళ్లీ ఆత్మహత్యల ఆకాశాన
తారలుగా మారాల్సి వస్తుంది..!
ఆనాటి దశాబ్దపు
ఆకుపచ్చని తెలంగాణ
నేటి బతుకు కోతల మధ్య
రాబడి ధరలు పొందలేక
తెలం"గానం"మారిపోతుంది..!
చనిపోయిన రైతుల తనువుల్ని
మోస్తున్న పాడెలు...
రైతు జీవన గేయాల
గాయాల ఖాతాలను
పాడటం మొదలెట్టాయి..!
కన్నీటి ధారలుగా..!!

రైతు మోముపై
చిరునవ్వుల
పంటల పదనిసలే
మనందరి బతుకుదెరువు
ఆశీర్వాదాలు..!
రైతు గుండెలపై
ఆందోళన ఉద్యమ చిహ్నాలు
మానవ ప్రగతి పథాన
ప్రళయ తాలుకూ విపత్తులు..!
నా మౌనపు శిలాక్షరాలు
నన్ను ప్రశ్నిస్తుంటే...
తలెత్తుకొని సగర్వంగా
రైతు పక్షమై కవిత్వం రాస్తున్నా..!
బడుల్లో పాఠాల
ఉదయాలు ప్రకాశించాలి
పొలాల్లో పంటల
పసిడి కాంతి పండాలి..!
ఆకలి తీర్చే
అన్నదాతల కుటుంబాల్లో
ఆత్మహత్యలు ఆగిపోవాలి..!
ప్రజా ప్రతినిధుల
పార్టీల మార్పు కాదు..!
పాలన తీరులో
మార్పు రావాలి..!

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

# శుక్రవారం..షుక్రియా



శుక్రవారం...ముస్లింలకు పవిత్రమైన రోజు. మంత్రి మండలిలో మైనారిటీ మినిస్టర్ లేని లోటు సరిగ్గా నమాజ్ కు కొద్దిసేపు ముందు తీరింది. అంతేనా! మరో 10 రోజుల్లో జూబ్లీహి ల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ఉండగా, అక్కడి ఓటర్లలో 30 శాతం ప్రాబల్యం గల ముస్లింల దృష్టిని అకస్మాత్తుగా ఆకర్షించింది. మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ ను తన క్యాబినెట్ లోకి తీసుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టైమింగ్ ముచ్చటేస్తోంది. నిశ్శబ్దంగా ఉండీ ఉండీ ఒక్కసారిగా గుంప గుత్త ఓట్లపై గురిపెట్టారన్నది సమయం, సందర్భం, నేపథ్యం చెప్పకనే చెబుతున్నాయి. తన మంత్రి వర్గం పాక్షిక విస్తరణ ముహూర్తంలోనూ ముస్లింల మనోభావాలను గొప్పగా పాటించారు.

శుక్రవారం ప్రమాణ స్వీకారం. మధ్యలో ఒక శుక్రవారం. తదుపరి శుక్రవారం (నవంబర్ 14, బాలల దినోత్సవం కూడా) ఓట్ల లెక్కింపు. మొత్తానికి శుక్రవారం షుక్రియాగా ఈ ఈవెంట్ ప్రక్రియ నమోదైంది. జూబ్లీహిల్స్ లో 4 లక్షల మంది ఓటర్లలో లక్షా ఇరవై వేల మంది ముస్లింలే. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్ తక్షణ కర్తవ్యం ఏమిటో ఈరోజు నుంచే చూస్తున్నాం! ఏఐసీసీ, సీఎం మధ్య సమన్వయం భాసిల్లుతోందని మంత్రి వర్గం స్వల్ప విస్తరణ రుజువు చేసింది. మూడు ఖాళీల భర్తీ కోసం వేచి చూసి విసిగిపోతున్నారు ఆశావహులు. ఎందుకు నాన్చుతూ రెండేళ్ళు వెళ్ళదీశారో వారికి ఎరుకలోకి వచ్చినట్టయింది. మనకు గుర్తుండే ఉంటుంది. వైఎస్సార్ రెండోసారి ముఖ్యమంత్రి అవడానికి ముందు ఆంధ్రాలో ప్రచారానికి బయల్దేరారు. తెలంగాణలో పోలింగ్ సమయం ముగిసిందని తన చేతి గడియారం వంక చూసి, నిర్ధారించుకొన్నారు. హైదరాబాద్ పోవాలంటే మనకు వీసా కావాలా? అంటూ కోస్తాంధ్ర రాయలసీమ ఓట్లను ఒక్క వాక్యంతో బుట్టలో వేసుకున్నారు. జూబ్లీహిల్స్ లో ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అలానే సైలెంట్ వ్యూహాన్ని అమలు చేసే దాకా లోకానికి తెలియలేదు. ఇప్పటికిప్పుడు ఈ పొలిటికల్ డెవలప్మెంట్ ఎవరి ఊహకూ అందలేదు. కంటోన్మెంట్ మాదిరిగానే జూబ్లీహిల్స్ లో

విజయంపై గురి తప్పవద్దనే సీఎం సైలెంటుగా తన పని తాను చేసుకు పోతున్నారని విదితమైంది. తన రాజకీయ నిర్ణయాలను అమల్లోకి తెచ్చేదాకా రహస్యంగా ఉంచుతున్నారని తెలుస్తుంది. పోలింగ్ కు 10 రోజుల ముందు తన మంత్రి మండలిలోకి అజారుద్దీన్ ను తీసుకోవడం ఇందుకు కొనసాగింపు. గెలుపోటములను తీక్షణంగా డిసైడ్ చేసే స్థాయిలో మైనారిటీల ఓట్లు జూబ్లీహిల్స్ లో ఉన్నాయి. గుంభనంగా ఉంటూ ఉంటూ ఏకంగా అజారుద్దీన్ ను కేబినెట్ లోకి సమయానుకూలంగా చేర్చుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి రాజకీయ చతురత ప్రదర్శిస్తున్నారు.

ఇప్పటికిప్పుడు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని ఎవరూ అంచనా వేయలేదు. ఎమ్మెల్సీ పదవి అజారుద్దీన్ కు ఆల్రెడీ ప్రతిపాదించారు. తాను ఇక 6 నెలలలోపు ఏదో ఒక చట్ట సభలో సభ్యుడు కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ కు బెర్త్ కోసం ఏఐసీసీ ఆమోదం ఉండకుండా ఉండదు. అంటే.. హైకమాండ్, రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ వ్యూహాల్లో సమన్వయంతోనే ఉన్నట్లు వేరే చెప్పక్కర్లేదు. మూడు ఖాళీలకుగాను అజారుద్దీన్ కు స్థానంతో మంత్రి మండలిలో మైనారిటీలు లేని లోటు తీర్చడం, జూబ్లీహిల్స్ లో వారి మద్దతు కూడగట్టేందుకు ఇంతకుమించిన మంచి సమయం మరొకటి ఉండదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా, సమయస్ఫూర్తితో నిశ్చయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్న దృశ్యాలు మనకు కనిపించిన 24 గంటల్లోనే మంత్రి మండలిలో మైనారిటీకి స్థానం అనే సంచలన సమాచారం దేనికదే అయినప్పటికీ...బీజేపీ, బీఆర్ఎస్ ఎత్తుగడలకు ఏమాత్రం తక్కువ కాకుండా...అన్ని మతాలు, వర్గాల ఓట్ల కోసం రేవంత్ రెడ్డి మామూలుగా గురి పెట్టలేదని మాత్రం తెలుస్తున్నది. నవంబర్ 9 వరకూ స్వయంగా జూబ్లీహిల్స్ ప్రచారంలో లెగ్ వర్క్, ఫీల్డ్ వర్క్ మొదలుపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట కొత్త మంత్రి అజారుద్దీన్ ఉండనుండడం రాజకీయ తెరపై సరికొత్త సన్నివేశం. జూబ్లీహిల్స్ లోనూ తన ఎత్తుగడలు క్లిక్ అయితే, సాధారణ ఎన్నికలకు ఏడాది లేదా రెండేళ్ల ముందు ఇలానే ఎవరికీ అంతుబట్టని అస్త్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయోగిస్తారు.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
వ్యాసకర్త, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
హైదరాబాద్, 9440850384

## కార్మిక పక్షపాతి కామ్రేడ్
# కె.ఎల్.మహేంద్ర


కె.ఎల్.మహేంద్ర గారు

ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, ఏఐటీయూసీ నాయకుడు కె.ఎల్. మహేంద్ర 1922 నవంబర్ 25న ప్రస్తుతం తెలంగాణ రాజధానిగా ఉన్న హైదరాబాద్ లో జన్మించారు, అప్పట్లో నిజాం రాజ్యానికి రాజధానిగా ఉండేది. ఆయన తండ్రి ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ కె.ఎల్ మహేంద్రకు కేవలం రెండు సంవత్సరా ల వయసులో ఉన్నప్పుడే మరణించారు.ముగ్గురు సోదరులు ఒక సోదరితో కె.ఎల్ మహేంద్ర ఉండేవారు.బాల్యం నుండే మహేంద్ర జాతీయోద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు.అతని గురువు శ్రీ చంద్రశేఖర్ శుక్లా స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రేరేపించాడు. తొమ్మిదవ తరగతిలోనే మహేంద్ర గాంధీ పత్రిక 'హరిజన్' చదివి అతని రచనలతో బాగా ప్రభావితమయ్యాడు. అతను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరినప్పుడు నిజాం 'వందే మాతరమ్' పాడటాన్ని నిషేధించాడు. ఉస్మానియాను వదిలి కె.ఎల్. మహేంద్ర శాంతి నికేతన్‌లో చేరిన తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో వాతావరణం చాలా అణచివేతగా మారింది .శాంతి నికేతన్ లో ఆయనకు మార్క్సిస్ట్ సాహిత్యం, కమ్యూనిస్ట్ నాయకులతో పరిచయం ఏర్పడింది. తరువాత ఆయన రాజకీయ కార్యకలాపాల కారణంగా శాంతి నికేతన్‌ను విడిచిపెట్టి బర్ద్వాన్ కళాశాలలో చేరాల్సి వచ్చింది. అక్కడ ఆయన హరేకృష్ణ కోణార్క్ , బెనోయ్ చౌదరిని సంప్రదించి సిపిఐ లో చేరారు. తరువాత బెనోయ్ చౌదరి ఆయనను కార్మిక సంఘాలను నిర్వహించడానికి అసన్ సోల్ కు పంపారు.అక్కడ ఆయన స్టీల్ వర్కర్స్ యూనియన్‌ను నిర్వహించారు. ఆయన జనరల్ సెక్రటరీ ఎన్నికై. చాలా సంవత్సరాలు అదే పదవిలో కొనసాగారు. దీనితో పాటు మహేంద్ర అసన్ సోల్ వచ్చిన ఒక సంవత్సరంలోనే రెండు యూనియన్‌లను నమోదు చేశాడు జూలై 1946లో హైదరాబాద్ కి తిరిగి వచ్చాక కె.ఎల్. మహేంద్ర దాదాపు ప్రతి రోజూ రెండు,మూడు యూనియన్లను స్థాపించేవారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. జాతీయ చర్చలో భూమి సమస్య ప్రముఖంగా హైలైట్ అయినప్పటికీ, సైన్యం 5,000 మందికి పైగా కమ్యూనిస్ట్ సాయుధ కార్యకర్తలను చంపగలిగింది. పెద్ద సంఖ్యలో పోరాట కార్యకర్తల నష్టం చివరకు నాయకత్వం సాయుధ పోరాటాన్ని ముగించడానికి దారితీసింది1946లో జరిగిన హైదరాబాద్ అఖిల భారత సమావేశంలో కె.ఎల్. మహేంద్ర హైదరాబాద్ రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శులలో ఒకరిగా ఎన్నికైన వెంటనే కె.ఎల్. మహేంద్ర 30 కి పైగా యూనియన్లను ఏర్పాటు చేశారు.మహేంద్ర ఎ. పి ఏఐటీయూసీ కార్యదర్శిగా చురుకుగా ఉన్న కాలంలో, రైల్వేలలోని యూనియన్లను బలోపేతం చేశారు. దీనితో పాటు, ఏఐటీయూసీలో 40,000 కంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌లో, బొగ్గు గనుల సంఘాలలో 60,000 కంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న యూనియన్లను వారు నిర్మించారు. 1970 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు శాసన మండలికి ఎన్నికయ్యి 1982 వరకు కొనసాగారు. 1982లో కె.ఎల్. మహేంద్ర సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా,1996 నుంచి 2001 వరకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 1999 లో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా పని చేశారు., దీనితో పాటు మహేంద్ర హోటల్ కార్మికులను వ్యవస్థీకరించి హోటల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడయ్యాడు. దక్షిణాదిన ఉన్న కార్మికులను కలుపుకుని సినిమా వర్కర్స్ యూనియన్ ను కూడా నిర్వహించాడు. 1960లలో అతను కొత్తగా ఉద్భవిస్తున్న ఇంజనీరింగ్ పరిశ్రమలలో కార్మిక సంఘాలను స్థాపించాడు. వైజాగ్‌లో స్టీల్ ప్లాంట్‌ను తెరవడానికి కృషి చేశారు.పారిశ్రామిక వివాద చట్టం ని మార్చడానికి సంజీవ రెడ్డి చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా కూడా ఆయన పోరాటం చేశారు. తన స్నేహితుడు ముఖ్యమంత్రి అంజయ్య ద్వారా ట్రేడ్ యూనియన్లలో ఎన్నికలకు 'రహస్య బ్యాలెట్' వ్యవస్థను గుర్తించడం ద్వారా. భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు చట్ట ప్రకారం రహస్య బ్యాలెట్ ద్వారా జరిగే ఏకైక రాష్ట్రం అప్పటి ఆంధ్రప్రదేశ్ మాత్రమే.

1970 నుండి 1978 వరకు కె.ఎల్ మహేంద్ర పి.డబ్ల్యూ.డి కార్మికులు, మున్సిపల్ కార్మికులు, కనీస వేతన పోరాటం, షాప్ ఎంప్లాయిస్ కార్మికులు అనేక ఇతర యూనియన్ల రాష్ట్రవ్యాప్త సమ్మెలకు నాయకత్వం వహించారు. 1987లో కె.ఎల్ మహేంద్ర ఢిల్లీ ఏఐటీయూసీ కేంద్రానికి మారారు. అప్పటి నుండి సరళీకరణ వల్ల ఏర్పడిన ఉద్యోగ తొలగింపుల కారణంగా కార్మికులపై పడుతున్న ప్రభావానికి వ్యతిరేకంగా కార్మికులను సమీకరించారు. తన పదవీకాలంలో హింద్ మజ్దూర్ సభతో ఐక్యతను తీసుకురావడానికి ప్రయత్నించారు కానీ సాధ్యం కాలేదు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆరు ప్రధాన జాతీయ స్థాయి సమ్మెల నాయకత్వం వహించారు.. 2001 సంవత్సరంలో సింగరేణి బొగ్గు గనుల సమ్మె కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమ్మెల వలన సింగరేణి నష్టాలు వస్తున్నాయని కనుక సమ్మె చేస్తే బొగ్గు గనులు మూసి వేస్తామని చెబితే ఆనాడు కె.ఎల్. మహేంద్ర సంస్థ లాభాలు వస్తే లాభాలలో 10%వాటా కార్మికులకు ఇస్తామని ఒప్పందం చేసుకొని దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థల్లో లేని లాభాల వాటా హక్కు సాధించిన మహనీయుడు.ఈయన చివరకు 2007 ఆగస్టు 12 న తుది శ్వాస వదిలారు.నేడు సింగరేణిలో పని చేస్తూన్న కార్మికులు అనుభవిస్తున్న లాభాల వాటా కె.ఎల్.మహేంద్ర కృషి ఫలితమే అని గమనించాలి.



ఆళవందార్ వేణు మాధవ్
8686051752.హైదరాబాద్

## ప్రకృతి ప్రళయం..!

ప్రకృతి మనిషి పైన పగబట్టిందా
ప్రస్తుత స్వేచ్ఛకై పరుగులు పెడుతూ
భవిష్యత్తును అంధకారం చేస్తున్నాం
పోషించాల్సిన వనరుల సమూహాన్ని
సమూలంగా కరిగించే పనిలో పడ్డాం
దొరికిన కాడికి దోసిళ్ళు నింపుకుంటూ
భావితరం ఒకటుందని మర్చిపోతున్నాం
నింగి వైపు చూపును సారిస్తూ
నేల మనుగడను ఏమార్చుతున్నాం
నీడనిచ్చే చెట్టుకు నిలువు నీడ లేకుండా
వేర్లతో సహా పెకిలిస్తూ
ఆకాశమంత మేడలు కడుతున్నాం
తీర ప్రాంతాల్లో ఆవాసాలను ఆర్భాటంగా
కొనసాగిస్తూనే కాలం గడుపుతున్నాం
అడుగడుగునా తూట్లు పొడుస్తూ
భూమి పటుత్వాన్ని సడలిస్తున్నాం
వాలు ప్రాంతాల్లో వింతలు సృష్టిస్తూ
ఏపెత్తు బరువును ఏకంగా నిలుపుతున్నాం
ఒక పక్క ఎడారితో తడారిపోతున్న వైనం
మరో వైపు అతివృష్టితో మునిగిపోతున్నాం
కాలానికి ఎదురేగే ఉత్సాహానికి
ప్రకృతి వైపరిత్యం పడగలు విప్పుతోంది
చిత్రాతి చిత్రమైన మానవ మనుగడలో
చేతులారా వాతావరణ రూపాన్ని మార్చి
ప్రళయాగ్ని కీలల మధ్య బూడిదౌతున్నాం
శిఖరాగ్రహంతో శిలల కింద నలుగుతున్నాం
ఉపద్రవాల ఉప్పెనతో భయపడుతున్నాం
నవ జీవన విధానంలో మురిసిపోతూ
ప్రకృతి పోషణ మరచిపోయి జీవిస్తున్నాం
రాబోయే విపత్తులను పసిగట్టలేకున్నాం

- నరెడ్డుల రాజారెడ్డి
సెల్ : 9666016636

# మైనార్టీ గురుకులాల్లో దారుణం..

- ఆరుగురు విద్యార్థులపై టీచర్ దాష్టికం
- గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థులు
- వికారాబాద్‌లో విద్యార్థులను గుర్తించిన డ్యూటీ నర్స్
- ఉపాధ్యాయులు తప్పుచేసి మాచే సంజాయిసి పత్రం రాయించుకుండ్రు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణ



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** గురుకులాల్లో దారుణాలు జరిగిపోతున్నాయి. క్రమశిక్షణ పేరుతో గురుకులంలోకి ఎవరికి అనుమతించకపోవడంతో దారుణాలు వెలుగులోకి రావడం లేదు. విద్యార్థులు తప్పించుకొని తల్లిదండ్రులకు తెలియజేస్తే తప్ప అక్కడ జరుగుతున్న బాగోతాలు బయటికి రావడం లేదు. ఇలాంటి సంఘటనలు వికారాబాద్ జిల్లాలో సర్వసాధారణమైపోయాయి. ఆ నోట ఈ నోట వెలుగులోకి వస్తే తప్ప అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించిన దాఖలాలు లేవు. దీంతో గురుకులాల్లో జరిగే దారుణ సంఘటనలు అక్కడే సమాధి అవుతున్నాయి. విద్యార్థులు నరకయాతనను మింగుకొని దారుణ పరిస్థితుల్లో విద్యనభ్యసిస్తున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లాలో మరో సంఘటన వెలుగులోకి ఇచ్చింది.వికారాబాద్‌లో శివ రెడ్డి పేట మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన జరిగింది. మానవత్వాన్ని మరచిన టీచర్ విద్యార్థులపై దౌష్టికానికి పాల్పడ్డాడు. చిన్నపిల్లలు అల్లరి చేస్తున్నారని విద్యార్థులను రాడుతో కొట్టి భయాందోళనకు గురిచేసాడు. భయానికి గురైన ఇద్దరు విద్యార్థులు మైనారిటీ గురుకుల పాఠశాల నుండి పారి పోవడంతో ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇలాంటి సంఘటన మైనారిటీ బాలికల గురుకులంలో కూడా జరిగింది. ఇద్దరు విద్యార్థులు గురుకులం నుంచి పారిపోతే స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారి విచారణలో ఈ బాలికలు మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులుగా తేలింది. దీంతో పోలీసులు వారికి అప్పగించారు. అది మరవకముందే శివారెడ్డిపేట్ సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు బుధవారం రాత్రి డార్మెటరీలో ఆడుకుంటుండగా, పీఈటీ అన్వర్ ఖాన్ వారిని రాడుతో కొట్టి భయాందోళనకు గురిచేశాడు. ఈ సంఘటనతో జీవన్ అనే విద్యార్థితో పాటు మరో విద్యార్థి గురువారం ఉదయం భయంతో పాఠశాల నుంచి పారిపోయారు.విద్యార్థులు తిండి లేక తిప్పలు పడుతూ స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద తిరుగుతుండగా గురుకులం పాఠశాల నర్స్ జమున గుర్తించి వారిని తిరిగి పాఠశాలకు తీసుకువచ్చింది. ఈలోపు విద్యార్థులు గురుకులంలో లేరని ఉపాధ్యాయులు గమనించకపోవడం విశేషం. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, కొట్టిన విషయాన్ని పక్కనబెట్టి "మళ్లీ విద్యార్థులు గురుకులం నుంచి పారిపోతే పాఠశాల బాధ్యత కాదు" అని లేఖ రాయించుకోవడం కోస మెరుపు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించగా వైస్ ప్రిన్సిపల్ రాజేందర్, నర్స్ జమున సంఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు, సెక్యూరిటీ గార్డ్ జహంగీర్ తల్లిదండ్రులతో అసభ్యకరంగా మాట్లాడినట్లు సమాచారం. ప్రిన్సిపల్ ప్రకాష్ సోమవారం మాట్లాడుదాం అంటూ సంఘటనను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.విద్యార్థి సంఘ నాయకులు, తల్లిదండ్రులు పీఈటీ అన్వర్ ఖాన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, అలసత్వం ప్రదర్శించిన వార్డెన్ ఖదీర్, సెక్యూరిటీ గార్డ్ జహంగీర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు భయపడి విద్యార్థులు గురుకులం నుంచి బయటికి పారిపోతే బయట ఏదైనా జరగరానిది జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. ఈ విషయమై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులల్లో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో ఉన్నత అధికారుల తనిఖీలు కొరవడిన కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాంపూర్‌లో ఏర్పాటు చేయాలి

- రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు
- బీఆర్ఎస్ యువ నాయకులు శ్రీశైలం యాదవ్



**తలకొండపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** వరి మొక్కజొన్న పంటలను సాగు చేసిన రైతుల కోసం ప్రభుత్వం రాంపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు.శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రతి ఏటా వరి,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారని,ఈ సీజన్ లో ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.మండలంలో ఒక్క పడకల్ గ్రామంలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,మిగతా పిఎసిఎస్ క్లస్టర్ గ్రామాలలో కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతుల ఆవేదనను అర్థం చేసుకొని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రాంపూర్ గ్రామంలో వరి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.లేని ఎడల రైతులతో కలిసి మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కటికెల యాదయ్య,యువ నాయకులు చిలకం శేఖర్ ముదిరాజ్,రొయ్యల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లోనే అభివృద్ధి కార్యక్రమాలు నిర్మించాలి



**కొడంగల్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ కోసమే కేడీపీ జేఏసీ ఆవిర్భవించిందని కొడంగల్ కేడిపి జెఏసి కో కన్వీనర్స్ గంటి సురేష్ కుమార్, ఎరన్ పల్లి శ్రీనివాస్ అన్నారు. ఉద్యమ కార్యచరణలో భాగంగా శుక్రవారం కేడిపి జెఏసి ఆధ్వర్యంలో మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, సమీకృత గురుకుల పాఠశాలలు అప్పాయిపల్లి,పాత కోడంగల్ లో శంకుస్థాపన చేసిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని మన ఎమ్మెల్యే,రాష్ట్ర ముఖ్యమంత్రి పోస్ట్ కార్డ్ రాసినా కేడిపి జెఏసి నాయకులు, విద్యావంతులు,మేధావులు,ఉపాధ్యాయులు, పట్టణ పుర ప్రముఖులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు స్వచ్ఛందంగా ఎవరికి వారు పోస్ట్ కార్డు వ్రాసి ముఖ్యమంత్రికి పంపడం జరిగింది.ఈ సందర్భంగా కేడిపి జేఏసీ కో కన్వీనర్స్ గంటి సురేష్ కుమార్,ఎరన్ పల్లి శ్రీనివాస్, మాసాని వెంకటయ్య, భీమ్రాజ్, సూర్య నాయక్‌లు మాట్లాడుతూ కొడంగల్‌కు కేటాయించిన మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, సమీకృత గురుకుల పాఠశాలలు శంకుస్థాపన చేసిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని ఈ పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా విన్నవించుకుంటున్నామని ఇప్పటికే కోడంగల్ వెనకబడి ఉందని మాకు కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలను ఇక్కడే నిర్మించాలని పలువురు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేడిపి జెఏసి నాయకులు దొబ్బలి పకిరప్ప, ప్రవీణ్,చిన్నయ్య,తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో వైద్యం అందక మహిళ మృతి

- ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



**మిర్యాలగూడ, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** ఉబ్బసం వ్యాధికి చికిత్స కోసం వచ్చిన మహిళ సకాలంలో వైద్యం అందక మృతి చెందిన సంఘటన శుక్రవారం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో జరిగింది. వైద్యుడి నిర్లక్ష్యం వలన మహిళ మృతి చెందిందంటూ ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిర్యాలగూడ మండలం ములకల కాల్వకు చెందిన నాగిళ్ల ఎంకమ్మ దగ్గు, జ్వరం,ఆయాసం తో చికిత్స నిమిత్తం తన కుమారుడు ప్రదీప్ ని తీసుకొని 8గంటల సమయంలో ఏరియా ఆసుపత్రికి వచ్చిందని, డ్యూటీ డాక్టర్ నెహ్రూ 9:30 గంటలకు డ్యూటీ నుంచి దిగిపోయేంతవరకు ఎంకమ్మకు ట్రీట్మెంట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశాడని ఆరోపించారు. దీంతో ఆమెకు ఆయాసం ఎక్కువైపోయి ఊపిరి ఆడని పరిస్థితుల్లో డ్యూటీకి వచ్చిన డాక్టర్ ఫాతిమా ఆక్సిజన్ పెట్టాలంటూ సిబ్బందికి పురమాయించారని అయినప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడంతో ఆయాసం ఎక్కువయ్యి ఊపిరాడని పరిస్థితుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతుండగా కుమారుడు వెళ్లి డాక్టర్కు పరిస్థితిని వివరించగా హడావుడిగా వచ్చిన డాక్టర్ ఫాతిమా ఆక్సిజన్ ఎందుకు పెట్టలేదు అంటూ సిబ్బందిని మందలించి, అప్పటికప్పుడు ఆక్సిజన్ పెట్టారన్నారు. అప్పటికే పరిస్థితి చేయి జారిపోవడంతో ఆక్సిజన్ పెట్టిన 15 నిమిషాలకే మహిళ చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వైద్యం అందక వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మహిళ మృతి చెందిందని డాక్టర్ పై సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. తల్లి మృతితో ఒంటరైన ప్రదీప్ ను ప్రభుత్వం ఆదుకోవాలని, నిరుపేదైన అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఉచిత చదువులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నియోజకవర్గ అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ, వెంకన్న, రాము, సోమయ్య, ఎల్లమ్మ, బుజ్జి, కవిత,ఏడుకొండలు రాంబాబు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**దోమ, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజను నిర్వహించారు. ఇల్లు లబ్ధిదారుడు కారుకొండ బాలమణి / గోపాల్ లబ్ధిదారుడు మేము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉన్నామని చెప్పారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్తపేట ఆనంద్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొత్తపేట రాఘవేందర్, లక్ష్మణ్, దిసంపల్లి కనకయ్య, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాడ్గులపల్లిలో ఘనంగా 2కే రన్



**మాడ్గులపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** దేశ సమైక్యత కోసం తుదిశ్వాస వరకు ఉక్కు సంకల్పంతో పని చేసిన భారత తొలి ఉప ప్రధాన మంత్రి ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి, సందర్భంగా జరుపుకొనేఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మాడ్గులపల్లి సబ్ సబ్ ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 2 కే రన్ ను ఎస్ఐ కృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించారు.స్థానిక పోలీస్ స్టేషన్ నుండి టోల్ ప్లాజా వరకు కొనసాగిన 2కే రన్‌లో పోలీసు సిబ్బంది నవోదయ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణయ్య మాట్లాడుతూ పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2కే రన్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. శాంతిభద్రతల పరి రక్షణలో కుటుంబాలను భార్యాబిడ్డలను పక్కనపెట్టి శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలను బలిదానంగా అర్పించిన అమర పోలీస్ వీరుల త్యాగాలు మరవ లేనివని ఆయన అన్నారు. మండలంలోశాంతిభద్రతల పరిరక్షణకు మండల ప్రజలు పోలీసు లకు సహ కరించాలన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవి ష్యత్తు ను దృష్టిలో పెట్టుకుని కష్టమైనప్పటికీ ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం విషయంలో వెనకడుగు వేయాలన్నారు. యువకులు విద్యా ర్థులు తెలిసి తెలియని వయసులో మత్తుపదార్థాల బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టే బుళ్ళ ఖదీర్, సూర్యనారాయణ, శ్రీనివాసు వెంకటేశ్వర్లు, పోలీస్ కానిస్టేబులు సైదిరెడ్డి, యూనూస్, శ్రీనివాస్, యాదయ్య ,శ్రీనివాస్, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ మౌనిక, హోమ్ గార్డ్స్ శంకర్ బాలు సురేష్ సైదులు ఉమెన్ హోంగార్డ్ కత్తులకళమ్మతోపాటువిద్యార్థు లు టోల్ ప్లాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ పద్ధతిలో సేంద్రీయ సాగు మేలు



**ఝరాసంగం, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన పంటలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని ఈ పంటలను ఆహారంగా వాడితే ఆరోగ్యం బాగుంటుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్? పి. ప్రావీణ్య అన్నారు. గురువారం ఝరాసంగం మండల పరిధిలోని బిడకన్నె గ్రామ శివారులో గల అరణ్య శాశ్వత వ్యవసాయ కేంద్రం(ఎన్‌జీఓ)లో కృషి సఖీ శిక్షణా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. తమతమ స్వంత పొలాల్లో కొంత భాగం సేంద్రీయ సాగు చేసి అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీదేవి, వ్యవసాయాధికారి ప్రేమలత, జహీరాబాద్ ఆర్‌డీఓ దేవ్‌జా, ఏడీ బిక్షపతి, అరణ్య సీఈఓ పద్మ, ఎల్ఎన్ఎఫ్ఐ నోడల్ అధికారి స్నేహ పాల్గొన్నారు.

## ఈసీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం



**కొడంగల్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** కోడంగల్ పట్టణ కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ఆఫీస్ నందు స్టేట్ సిఆర్పి లు, సాయి లీల డి.మల్లీశ్వరి, రావు లపల్లి గ్రామములో రెండు రోజులు గురువారం.శుక్రవారం మండల మహిళా సమాఖ్యలో వివిధ గ్రామాల ఈసీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచ సూత్రాలు,క్రమం తప్పని సమావేశాలు, క్రమం తప్పని పొదుపులు.క్రమం తప్పని అప్పు మంజూరు.క్రమం తప్పని అన్ని అప్పు వసూళ్లు. శిక్షణ పొందిన బుక్కీ కీపర్ పుస్తకం నిర్వహణ చేయటం.సంఘం కట్టుబాట్లు .జెండర్ కార్యక్రమాలు,సబ్ కమిటీల ఏర్పాటు. బాల్య వివాహాల అరికట్టడం.శాసనాత్మక బాధ్యతల గురించి సీఆర్పి లు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ ఎపిఎం పి.గోపాల్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ,కార్యదర్శి మాసనమ్మ, కోశాధికారి సత్యమ్మ, మాజీ అధ్యక్షురాలు అంజలమ్మ, సిసిలు అరవింద్,రాములు,బసంత్ వెంకటయ్య,వాణి,జి.రాములు ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పూడిక తీత ఆపొద్దు.. నాలాల్లో నీరు నిలవొద్దు

- నాలాలతో పాటు చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్
- వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారాన్నివ్వాలంటూ ఆదేశం
- కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన విద్యార్థినులు



**హైదరాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నాలాల్లో వరద ప్రవాహం తగ్గే అవకాశం ఉంది. ఈ పరిస్థితులను వినియోగించుకుని నాలాల్లో పూడికను పూర్తి స్థాయిలో తొలగించాలని హైడ్రా డీఆర్ ఎఫ్, మెట్ టీమ్‌లకు కమిషనర్ ఏవీ రంగనాథ్ దిశానిర్దేశం చేశారు. నగరవ్యాప్తంగా నాలాల్లో పూడిక తీసే పనులను ముమ్మరం చేయాలని సూచించారు. చాలా వరకు పూడికను తొలగించడంతో ఈ ఏడాది భారీ వర్షాలు పడినా ఎక్కడా వరద ముప్పు ఏర్పడలేదని, వచ్చే ఏడాది అస్సలు ఈ సమస్య తలెత్తే అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల మేరకు నగరంలోని నాలాలను, చెరువులను పరిశీలిస్తూ వస్తున్న హైడ్రా కమిషనర్ శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్, బోరబండ ప్రాంతాలలో నాలాల్లో పూడిక తీత పనులను పర్యవేక్షించారు. నాలాల్లో పూడికతీత పనులకు, వరద ప్రవాహానికి ఆటంకాలను తొలగించేందుకు ఇదే సరైన సమయంగా భావించాలని హితవుపలికారు. అలాగే ప్రాంతాల వారీ వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. అలాగే హరిహరపురంలోని కాప్రాయి చెరువుతో పాటు.. శంషాబాద్, పెద్దగోల్కొడలోని నరసింహ చెరువు, బాలాపూర్ మండలంలోని కోమటి కుంటను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వర్షాకాలం ఏ ప్రాంతాల్లో వరద నీరు నిలిచిందనేది ఇప్పటికే తెలిసింది కనుక.. వచ్చే ఏడాది అలాంటి అవకాశం లేకుండా జాగ్రత్త పడాలన్నారు.

### చెరువులతో వరదలకు అడ్డుకట్ట

నగరంలో చెరువులను అభివృద్ధి చేసి వరదలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చెరువులను తగిన మొత్తంలో ఖాళీ చేయించి, వరద నీరు నిలిచేలా చూడాలన్నారు.

### కమిషనర్‌కు విద్యార్థినుల వినతిపత్రం

శంషాబాద్ మండలం చిన్నగోల్కొండ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగురోడ్డు అండర్ పాస్‌లు వరద నీటిలో మునుగుతున్నాయని తాము పాఠశాలకు వర్షాకాలం వెళ్లలేకపోతున్నామని విద్యార్థినులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు.

### అలుగుపైన రహదారితో..

శంషాబాద్‌లోని నరసింహ చెరువు అలుగు ఎత్తును పెంచి రహదారిగా మార్చడంతో చెరువు విస్తీర్ణం పెరిగి పైన ఉన్న పంటపొలాలు, లేఔట్‌లు, నివాస ప్రాంతాలు నీట మునుగుతున్నాయనే ఫిర్యాదును కూడా హైడ్రా కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 15 వద్ద చెరువు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, హైడ్రా ఏసీపీలు తిరుమల్, ఉమామహేశ్వర రావుతో పాటు పలువురు అధికారులు కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యటనలో ఉన్నారు.

# విద్యార్థులు సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేయాలి

- పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- జిల్లా పాలనాధికారి సిక్తా పట్నాయక్



**మక్తల్, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** విద్యార్థులు తమ సామర్థ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలోని ఉట్కూరు మండలం కేంద్రంలోని మండల ప్రాథమిక సిపిఎస్ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వివరాలను హెచ్ఎం ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అందులో భాగంగా నాలుగో తరగతి విద్యార్థుల తరగతి గదిలో ఉపాధ్యాయురాలుగా మారి విద్యార్థులచే గణితం ప్రశ్నలను బోర్డుపై ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. అక్కడ ఉన్న విద్యార్థులు లెక్కలను ఎంతో చాకచక్యంగా చేయడంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. రెండో తరగతి విద్యార్థులకు జాలిఫానిక్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా ఆంగ్ల విషయంలో నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు సౌండ్ ఆధారంగా ఆంగ్ల పదాలను చదివారు. జిల్లాలో యంగ్ ఓలేటర్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పిక్చర్ రీడింగ్ ద్వారా షోకేస్ నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అనుపస్థితి పట్ల ఆసనం వ్యక్తం చేస్తూ హాజరు శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలని హెచ్ ఎం ను ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నాణ్యత పాటించాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలకు రాని తోటి స్నేహితులను ఇంటి దగ్గరికి వెళ్లి వాళ్లను కూడా పాఠశాలను తీసుకురావాలని ఆమె సూచించారు. విద్యార్థులు పాఠశాలకు వస్తేనే విద్యార్థుల నైపుణ్యం మెరుగు అవుతుందన్నారు. విద్యార్థులకు యూనిఫార్మ్ వచ్చాయా లేదా ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూల్ యూనిఫామ్‌ను ఇవ్వాలన్నారు. తర్వాత పాఠశాల ఆవరణలోనే ఉన్న అంగన్వాడీ 4, 12 సెంటర్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్ వాడీ టీచర్ ఆలస్యంగా రావడంపై వివరణ కోరగా మీటింగ్ కు వెళ్ళి రావడం వల్ల ఆలస్యం అయిందని టీచర్ సంజాయిషీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, సి ఎం ఓ రాజేంద్రకుమార్, మండల విద్యాశాఖ అధికారి మాధవి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కుసుమ పాఠశాల హెచ్ ఎం తదితరులు పాల్గొన్నారు.

**పత్తి మిల్లును సందర్శించిన కలెక్టర్**

ఉట్కూర్ మండలం తిప్రాస్ పల్లి గ్రామ సమీపంలో లో గల విజయ్ కాటన్ మీల్ ను శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. మిల్లు లో ఉన్న రైతులతో మాట్లాడి పత్తిని అమ్మడానికి ఎలా తీసుకువచ్చారని వాకబు చేయగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని మిల్ కు తీసుకొచ్చామని ఆ రైతు తెలిపారు. అనంతరం కలెక్టర్ మిల్లులో పత్తి తుకాలు, కంప్యూటర్ లో కొనుగోళ్ల వివరాలను పరిశీలించారు. పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను వినియోగించుకుని పత్తిని మద్దతు ధరకు విక్రయించి లాభ పడాలని ఆమె కోరారు. తహసిల్దార్ చింత రవి, ఏవో గణేష్ రెడ్డి తదితరులున్నారు.

## 2కే రన్‌ను ప్రారంభించిన ఎస్పీ, అదనపు కలెక్టర్




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** రాష్ట్రీయ ఏకతా దివాస్ (రాష్ట్ర ఐక్యతా దినోత్సవం), సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ 2కే రన్" ను ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయము నుండి ఐబీ వరకు 'రన్ ఫర్ యూనిటీ" 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ... సర్ధార్ వల్లభాయ్ పటేల్ గారి జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31ని రాష్ట్రీయ ఏక్తా దివాస్ గా పిలుస్తాం అన్నారు. వల్లభాయ్ పటేల్ పోరాట పఠిమ ద్వారా భారత దేశ చరిత్రలోనే ప్రఖ్యాత వ్యక్తిగా గుర్తింపు పొందారని, వల్లభాయ్ పటేల్ రాష్ట్ర ఐక్యతకు చేసిన కృషి, నాయకత్వ లక్షణాలను మెచ్చి మహాత్మా గాంధీ ఆయనకు "సర్ధార్" బిరుదును ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్, సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, ఎఆర్ డిఎస్పీ నరేందర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళ్యాణి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్.బి ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్స్ సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావ్, ఆర్.ఐ.లు రామారావ్, రాజశేఖర్, డానియోల్, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మొద్దు

- రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తుంది
- పత్తి గనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మేలసంగం లోని కాటన్ మిల్ లో కాటన్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (సీసీఐ) అద్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో కలసి ప్రారంభించారు. ఈ సందర్బంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ .. పత్తి రైతుల దళారుల బారిన పడి మోసపోవద్దన్నారు . రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు . రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పి ) ను కల్పించాలని సీసీఐ అధికారులను మంత్రి కోరారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా సదాశివ పేట , రాయికోడ్ , నారాయణ ఖేడ్ , జోగిపేట , వట్పల్లి మండలాల పత్తి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పత్తి రైతులు కనీస మద్దతు ధర (ఎంఎస్పి) కోసం 'కపాస్ కిసాన్ 'మొబైల్ యాప్ ను డౌన్ లోన్ చేసుకోవాలని సీసీఐ అధికారులు కోరారు. గత వర్షాకాలం (2024-25)లో 3 లక్షల 80 వేల క్వింటాళ్ల పత్తిని కోనుగోలు చేసి రైతులకు 280 కోట్ల రూపాయలను చెల్లించామని సీసీఐ అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహా కు వివరించారు. పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్బంగా రైతులకు జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఐ సీనియర్ కమర్షియల్ ఆఫీసర్ వరుణ్, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# పేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ దస్త్రాల గురించి ఆరా తీశారు. అలాగే స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్లు, సాదా బైనామా దరఖాస్తులతో పాటు భూ భారతి దరఖాస్తుల గురించి తహసిల్దార్ అమరేంద్ర కృష్ణను అడిగి తెలుసుకున్నారు. నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సేకరణ ఎంతవరకు వచ్చిందని, ఇంకా ఎంత మంది రైతులతో భూమిని సేకరించాల్సి ఉందని అడిగారు.రైతులతో విల్లింగ్ తీసుకుని భూ సేకరణ ను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. అయితే తహసిల్దార్ కార్యాలయంలో ఒక వైపు నిల్వ చేసిన ఫైళ్ళ మూటలను చూసి వాటిని తీసేయాలని తహసిల్దార్ కు సూచించగా అవి తమ కార్యాలయానికి చెందిన ఫైల్స్ కాదని, విద్యాశాఖ కు చెందినవని తహసిల్దార్ తెలపడంతో వాళ్ళ ఫైల్స్ వాళ్ళ కార్యాలయంలోనే పెట్టుకోవాలని, ఇక్కడ ఎందుకు వేశారని అసహనం వ్యక్తం చేస్తూ విద్యా శాఖ కార్యాలయ ఉద్యోగిని పిలిపించి ఆ ఫైల్స్ ను తీసుకెళ్లాలని ఆదేశించారు.అలాగే తహసిల్దార్ కార్యాలయంలో తాళం వేసిన గదిలోనూ కొన్ని ఫైల్స్ ఉన్నాయని, వాటిని కూడా తీసుకువెళ్లాలని సూచించగా తమ కార్యాలయంలో స్థలం లేకపోవడంతో వాటిని ఇక్కడ పెట్టామని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ తెలపగా, అవన్నీ ఏమీ చెప్పవద్దని, వెంటనే వాటిని తీసుకువెళ్ళాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఇలా ఉంటే ఎలా అని, కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న స్థలం ఎవరిదని? ప్రభుత్వానిదే అయితే అక్కడ కొత్త భవనాలను నిర్మించుకోవచ్చు అని తహసిల్దార్ కు తెలిపారు.

## యువతకు అవకాశాలే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం




**మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు (పర్సన్ ఇన్‌చార్జ్)గా గోనెల శ్రీనివాస్ నేడు అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష పదవిని స్వీకరించిన గోనెల శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందిస్తూ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇస్తుంది అన్నారు. సీనియర్ నాయకులు ఉన్నా కూడా యువతను ప్రోత్సహించాలనే దృక్పథంతో గోనెల శ్రీనివాస్‌కి ఈ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నిజాయితీతో, చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడు గోనెల శ్రీనివాస్ అని ఎమ్మెల్యే ప్రశంసించారు. అలాగే, మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరేలా సంఘం చురుకుగా పనిచేయాలని సూచించారు. చెరువులపై ఆధారపడిన మత్స్యకారుల ఆదాయవృద్ధి, మార్కెట్ విస్తరణ, ఉపాధి సృష్టిలో సంఘం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామాల వరకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడంలో నాయకులు, సంఘ ప్రతినిధులు ముందుండాలి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి. మహేందర్, మైత్రి యాదయ్య, శరత్, ప్రవీణ్ కుమార్, రామకృష్ణ ముదిరాజ్, స్వరూప, రంజిత్ కుమార్, లింగం నాయక్, తుప్పలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిదే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు విధానాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా ? లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పదవ తరగతి విద్యార్థుల హాజరు శాతం పెంచి, శత శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు కలెక్టర్ తెలిపారు. మనబడి కార్యక్రమంలో నిర్మించిన మధ్యాహ్న భోజన పథకం, షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల వాతావరణం బాగుందని ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజన అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ డి ఎస్ సి కార్పొరేషన్ మండల ప్రత్యేక అధికారి రామాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** ప్రభుత్వం ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఎస్ఐ వెంకట్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. వెంకట్ రెడ్డి ఎస్ఐ -1984 లో పోలీస్ కానిస్టేబుల్స్ గా జిల్లా పోలీసు శాఖలో నియామకమై గడిచిన 42 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో సాధారణ విధులను నిర్వహిస్తూ, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో సైతం సమర్ధవంతంగా విధులను నిర్వహించడం జరిగిందని, తనకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచలంచాలుగా పదోన్నతులు పొందుతూ.. సబ్-ఇన్స్పెక్టర్స్‌గా పదోన్నతి పొందడం జరిగింది అన్నారు. వెంకట్ రెడ్డి పోలీసు శాఖకు అందించిన సేవలు మారువలేనివని వారి సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నాను అన్నారు. పోలీస్ శాఖ తరపున అతనికి, అతని కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందింస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఆఫీస్ ఇన్స్పెక్టర్స్ కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావ్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, ఆర్.ఐ. రామారావ్, డానియెల్, మరియు రిటైర్డ్ అవుతున్న వెంకట్ రెడ్డి ఎస్ఐ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాకు గురైన భూమిని కాపాడాలి



**ఉప్పునుంతల, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** మండల పరిధిలోని వెల్టూర్ స్టేజి వద్ద శ్రీశైలం హైదారాబాద్ హైవే సమీపంలో ఉన్న 213 సర్వే నంబర్ గల 39 గుంటల భూమి కాపాడాలని వెల్టూరు గ్రామ ప్రజలు తాసిల్దార్ అద్దంకి సునీత కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వెల్టూర్ గ్రామానికి చెందిన పుణ్యమూర్తి సత్తమ్మా కు చెందిన ఈ భూమి ఆమెకు వారసులు లేని కారణంగా ఆమె చనిపోయిన అనంతరం అట్టి భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు కన్నేసి అట్టి భూమిని కబ్జా చేసి అమ్ముకుంటూన్నారని తాసిల్దార్ దృష్టికి తీసుకపోవడం జరిగిందని వారన్నారు అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా సంత కోనసాగుతున్న అట్టి భూమి గ్రామ పంచాయితీకీ కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, నాయకులు వెంకటేష్, బాలరాజు, నాగార్జున, గోస్కకే బాలరాజు, శ్రీను, ప్రహ్లాద్ నాగరాజు, జంగయ్య, అంజి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ యూనిటీ 2కె రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్‌చెరు, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** భారతదేశ మొదటి ఉప ప్రధాని, ఉక్కుమనిషి శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ లో భాగంగా పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటుచేసిన 2 కి.మీ. రన్ ను శుక్రవారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఐక్యతకు ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. స్వాతంత్ర్యానంతరం అనేక దేశీయ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన మహెూన్నత వ్యక్తి పటేల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సీఐ వినాయక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గూడెం మధుసూదన్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, వివిధ సంఘాల అధ్యక్షులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పట్టణ పుర ప్రముఖులు, విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తును పునరుద్ధరించాలి

- గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించి నమోదు
- నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం



**అచ్చంపేట, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** మండల పరిధిలోని శుక్రవారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అమరేందర్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి నష్టనివారణ చర్యలను పరిశీలించారు. మొంథా తుఫాను కారణంగా తీవ్ర వర్షాలు కురవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నక్కలగండి రిజర్వాయర్ పరిధిలోని మార్లపాడు తండా పూర్తిగా జలమయమైంది. సుమారు 350 కుటుంబాలు, 638 మంది జనాభా ఉన్న ఈ గ్రామం వరద జలాల చుట్టుముట్టడంతో ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నెల 28న రాత్రి నుంచి 29వ తేదీ మధ్యాహ్నం వరకు కురిసిన అతి భారీ వర్షానికి జల దిగ్బంధంలో గ్రామం చిక్కుకొని గ్రామస్తులను సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించి భోజన వసతి వైద్య సదుపాయాన్ని కల్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నక్కలగండి రిజర్వాయర్ పరిధిలోని మార్లపాడు పర్యటనలో అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, పంట నష్టం, గృహ నష్టం, ప్రజల అవసరాలపై వివరాలు సేకరించారు. ముంపు నీరు తగ్గిన అనంతరం పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని డ్రైనేజీలలో పూడికతీత, చెత్త తొలగింపు, బ్లీచింగ్ చల్లడం, దోమల మందు పిచికారి వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే పనులు ప్రారంభించారు. పంట నష్టాలపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపి, బాధితులకు సహాయం అందిస్తామని అదనపు కలెక్టర్లు హామీ ఇచ్చారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఆహారం, నీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వచ్చే రెండు మూడు రోజులు కూడా భోజన వసతి కొనసాగించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు భయపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా తోడుగా ఉంటుందని అధికారులు భరోసా ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, వాటిని తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, విద్యుత్, రెవిన్యూ, పంచాయితీరాజ్ శాఖల అధికారులు తాహసిల్దార్ సైదులు, ఎంపీడీవో, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతాంగానికి

# ఎకరానికి 25వేలు నష్టపరిహారమివ్వాలి


- తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి డిమాండ్



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 31 (జనం సాక్షి):** మెంథా తుఫాను వల్ల పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 25వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుచ్చకాయ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని లక్ష్మం పురం నాచినాపల్లి చాపలబండ గ్రామాల్లోని పత్తి మిరప అరటి తోటలను పరిశీలించి నష్టం విలువలను అంచనా వేశారు. జిల్లాలో వేలాది ఎకరాల పంట నష్టం జరిగిందని పాలకులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో రైతాంగం దివాళి తీసే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పంట చేతికందే దశలో తుఫాన్ తీవ్రత వలన పంట చేతికి రాకుండా పోయిందని అవేదన వెలిబుచ్చారు. అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చుకోని అనేక వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి కుటుంబ సభ్యులు మొత్తం భూమిలో శ్రమచేసి ఫల సాయం అనుభవిస్తామని ఆశతో ఉన్న రైతాంగం పై మెంత తుఫాన్ తీవ్రమైన దెబ్బ కొట్టింది వరి, అరటి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి ఈ పరిస్థితులలో రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకొని భరోసా కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారము చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చల్ల నరసింహారెడ్డి, కొంగర నరసింహస్వామి, అక్క పెల్లి సుధాకర్, కోడెం రమేష్, గొర్రె సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విడతల వారీగా డబ్బు చెల్లించాలి

- వివో గ్రూప్ లలో నిల్వ ఉన్న మొత్తం చెల్లించుటకు మార్చి 31 గడువు
- జనంసాక్షి ప్రచురణకు స్పందించిన అధికారులు


మహిళా సంఘాలలో సిపి చేతివాటం

**ములుగు/వెంకటాపూర్, అక్టోబర్ 31 (జనంసాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామం లో జరిగిన మహిళా సంఘాలలో సిఏ చేతివాటంపై మహిళా సంఘం మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఏపీఎం స్పందించారు. వివో ఆద్వర్యం లో ఉన్న గ్రూప్ లలో 22 లక్షలు పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు.దీనికి అధికారులు,మహిళా సంఘాలు సమీక్ష సమావేశం నిర్వహించి తీర్మాణం చేశారని, తీర్మాణం లో ప్రతి గ్రూప్ సభ్యులు మార్చి 31 2026 నాటికి విడతల వారిగా డబ్బులు చెల్లించుటకు అవకాశం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ మొత్తం డబ్బును మహిళా సంఘాలు మీద ఉన్నట్లు మండల సమాఖ్య అధ్యక్షురాలు మరియు ఏపీఎం లు పరిశీలించి డబ్బులను వసూలు చేస్తాం అని ఒకే సారి మహిళా సంఘాలు అంత అమౌంట్ కట్టాలంటే భారం అవుతుందని అందుకే అన్ని సంఘాల వారికి కొంత సమయం ను ఇవ్వడం జరిగిందని దీనిపై తీర్మాణం చేయడం జరిగిందని జనం సాక్షికి తెలిపారు.ఏమైనా అవకతకలు ఉంటే జనంసాక్షి ప్రత్యేక దృష్టి ఉంటుందని తెలిపారు.

# మనిషి ప్రశాంతతకు కౌన్సెలింగ్ అవసరం

- కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రం



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 31(జనంసాక్షి):** వరంగల్ లోని శివ హాస్పిటల్ సమీపంలో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ రాధా లోకేష్ ఏర్పాటు చేసిన సరోజినీ సెంటర్ ఫర్ కౌన్సిలింగ్ సెంటర్ ను శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మనిషి ఒత్తిడికి గురి కాకుండా సరైన విధంగా కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల ఎంతో ప్రశాంతత కలుగుతుందని అన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండగలుగుతారని తెలిపారు. మనిషి ప్రశాంతతకు కౌన్సిలింగ్ ఎంతో అవసరం అన్నారు. క్షణికావేశంలో ఎవరైనా ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా ఇలాంటి కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా తగిన విధంగా కౌన్సిలింగ్ తీసుకుంటే ఏ సమస్యలు ఉండవని కేయూ రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధా లోకేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వైద్యులు కే ఎస్ ఎస్ వరలక్ష్మి శివకుమార్, బచ్చురాధాకృష్ణ, వేణుమాధవ్, నరేంద్రరావు, బుజేందర్రెడ్డి, రామ్ చందర్ తో పాటు ఆస్ట్రో గురు సుమన్ శర్మ, గోల్డెన్ ఓక్ ఇన్స్టిట్యూట్స్ చైర్మన్ గంట రవికుమార్, స్థానిక కార్పొరేటర్ తేజస్విని శిరీష్, తదితరులు పాల్గొన్నారు.

# రిమాండ్‌లో ఉన్న నిందితుడు పరారీ

**బోథ్, అక్టోబర్ 31(జనంసాక్షి) :** పోలీసుల కళ్లుగప్పి రిమాండ్లో ఉన్న నిందితుడు పారిపోయిన ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల పోలీస్ స్టేషన్ లో చోటు చేసుకుంది. సొనల మండలం కోట కే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న గుత్తేదారు సత్యనారాయణ లబ్ధిదారు దీక్ష భర్త మారుతిని డబ్బులు చెల్లించాలని రెండు రోజుల క్రితం నడిరోడ్డుపై చేతులు కట్టేసిన ఘటన తీవ్ర అలజడి రేపింది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా తీవ్రంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. బోథ్ పోలీసులు కేసు నమోదు చేసి గుత్తేదారు ను అరెస్టు చేసి కస్టడీలో ఉంచగా గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం మూత్ర విసర్జనకు వెళ్ళొస్తా అని చెప్పి పోలీస్ స్టేషన్ వెనక నుండి పరారైయ్యాడు. నిందితుడు మహారాష్ట్ర వైపు పారిపోయినట్టు తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపడుతు న్నారు. పరారీలో ఉన్న గుత్తేదారు గతంలో దళిత బంధు పథకంలో భాగంగా లబ్ధిదారుల నుండి లక్షల డబ్బులు వసూలు చేసిన ఘటన గతంలో తీవ్ర కలకలం రేపింది.




# జాతీయ సమైక్యతకు నిదర్శనం సర్దార్ వల్లభభాయ్ పటేల్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** దేశ ప్రజలందరినీ ఏకతాటి పైకి తీసుకువచ్చి జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలిచిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ 2కె రన్ కార్యక్రమాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ. సి. పి. ప్రకాష్, జిల్లా క్రీడా యువజన సర్వీసుల అధికారి హనుమంతరావు లతో కలిసి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రజలందరినీ ఐక్యం చేస్తూ జాతీయ సమైక్యతకు కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని అన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ, సాంస్కృతిక విభేదాలు లేకుండా ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చారని, భారతదేశ మొదటి ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. దాదాపు 530 రాష్ట్రాలను భారతదేశంలో విలీనం చేశారని, పౌర హక్కులు, రైతు ప్రయోజనాల కోసం కృషి చేశారని తెలిపారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగితే రాష్ట్రం, దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని, దేశభక్తి, సమైక్యత భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని తెలిపారు. ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను యువత సమిష్టిగా ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఒవైసీ బ్లాక్మెయిల్‌తో అజారుద్దీన్‌కు మంత్రి పదవి

- బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్31 (జనంసాక్షి) :** ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ బ్లాక్మెయిల్ రాజకీయాలతోనే అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు టికెట్ ఇప్పించింది ఆయనేనని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోమ్ నగరం తగల పడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లు ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందన్నారు. మొంథా తుఫాన్ రాష్ట్రాన్ని ముంచితే, సీఎం పెండ్లిండ్లు, పేరంటాలు, సల్మాన్ ఖాన్లు అంటూ తిరు గుతున్నారని విమర్శించారు. ఏపీ సీఎం చంద్ర బాబును చూసి నేర్చువాలని హితువు పలికారు. వరికి ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశ ద్రోహానికి పాల్పడిన అజారుద్దీన్ కు గవర్నర్ కోట కింద ఎమ్మెల్సీ ఇస్తారా? అని ప్రశ్నించిన ఆయన ఓవైసీతో కలిసి రేవంత్ రెడ్డి మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, అక్టోబర్ 31 (జనం సాక్షి):** పరకాల నియోజకవర్గం గీసుగొండ,సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీట మునిగిన ప్రాంతాలను శుక్రవారం రోజున అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లోని వివిధ ప్రాంతాలను సందర్శించి, నీటి నిల్వల పరిస్థితిని సమీక్షించారు. అకాల వర్షాలకు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో కోతకు గురైన రోడ్లను పరిశీలించారు. టెక్స్టైల్ పార్క్ రోడ్లపై రైతులు ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసిన రైతులను ఎమ్మెల్యే పరామర్శించారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు నమోదు చేయాలని, పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.



# బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే లోగా ఇల్లు లూటీ

**దస్తురాబాద్, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని రేవోజిపేట్ గ్రామానికి చెందిన ముప్పిడి రాధా భర్త కిష్టయ్య అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారని స్థానిక ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముప్పిడి రాధ, తన కూతురు స్వాతి కలిసి తేది: 27.10.2025 రోజున ఉదయం: 06:30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి వారి తల్లిగారింటికి కరీంనగర్‌కు వెల్లారని తెలిపారు. వారు వెళ్లే సమయంలో సెల్స్ కాబార్డ్ నందు బంగారు, వెండి ఆభరణాలు పెట్టినామని తెలిపారు. మేము తిరిగి తేది: 30.10.2025 రోజున రాత్రి: 09:00 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి తలుపు తీసి ఉందని, అలాగే ఇంటి లోపలికి వెళ్ళి చూడగా సెల్ఫ్ లోని చీరలు పడవేసి అందులో గల, తులం కమ్మలు, అర్ధ తులం చైన్, అర్ధతులం బుట్టాలు, కమ్మలు మరియు 5 తూలల వెండి పట్టీలు ఎవరో గుర్తు లేలియని వ్యక్తులు తాము ఇంటి వద్ద లేని సమయంలో ఇంటికి అక్రమంగా ప్రవేశించి దొంగతనం చేసినారు. వెండి మరియు బంగారు అభరణాల మొత్తం విలువ. 52000/- రూపాయాలు ఉండొచ్చు అని అన్నారు. బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

# బొలెరో, డీసీఎం ఢీ

- ముగ్గురు మృతి




**భీమదేవరపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** వివాహ వేడుక తర్వాత తిరుగు ప్రయాణంలో విషాదం చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామ శివారులో నిలిపి ఉంచిన బొలెరో వాహనాన్ని వెనుకనుంచి వచ్చిన బోర్‌వెల్ డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా,మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన భాస్కర్‌కు కురవి మండలం సుదనపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మితో ఈ నెల 29న వివాహం జరిగింది. నిన్న మారుపెళ్లి కోసం ఇరువురు కుటుంబ సభ్యులు బంధువులు బొలెరో వాహనంలో వెంకటాపురం వెళ్లారు. రాత్రి 8 గంటల సమయంలో తిరిగి సుదనపల్లి వెళ్తుండగా దుర్ఘటన చోటుచేసుకుంది. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో రోడ్డుపక్కన వాహనాన్ని నిలిపి మూత్రవిసర్జన కోసం ఆగి ఉన్నారు. ఈ సమయంలో ఎల్కతుర్తి వైపు వెళ్తున్న బోర్‌వెల్ డీసీఎం లారీ అతివేగంగా వచ్చి బొలెరోను బలంగా ఢీకొట్టింది. అతివేగం.. అజాగ్రత్తే ప్రమాదానికి కారణమైంది. ఈ ప్రమాదంలో రెడ్డబోయిన స్వప్న (16), శ్రీనాథ్ (6), కలమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. అనసూయ, అక్షయ,మారుతి, రమాదేవి,దేవేందర్, నవలోక్,రిత్విక్, సరోజన,కార్తిక్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ శ్రీరామ్ రాజు గార్డెన్ హాస్పిటల్‌లకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై వెంకటాపురం గ్రామానికి చెందిన రెడ్డబోయిన శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డీసీఎం డ్రైవర్ గడ్డం నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లుఎస్సై రాజు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ధాన్యం కొనుగోలులో సమస్యలుంటే టోల్ ఫ్రీ నెం. 9347416178కు ఫిర్యాదు చేయండి



**ములుగు బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి):** శుక్రవారం గోవిందరావు పేట మండలం లోని బుసాపూర్లో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చల్వాయిలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్. మహేందర్ జి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ లతో కలిసి ప్రారంభించినారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ఎక్యూ నార్మ్స్ ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలనీ, వచ్చిన ధాన్యాన్ని ఎఫ్ఎక్యూ నార్మ్స్ ప్రకారం ఉన్నదా లేదా ప్రతి పిపిసి సెంటర్ వద్ద వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో పిపిసి ఇంచార్జెస్ చెక్ చేసి మిల్లులోకి తరలించాల్సింది గా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడినచో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా క్యాన్సల్ చేయబడునని,ఎలాంటి సమస్య ఉన్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూము టోల్ ఫ్రీ నెంబర్ 9347416178 నందు ఫిర్యాదు చేయవలసినదిగా, రైతులు కూడా ఎఫ్ఎక్యూ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా పైసల్ హుస్సేన్, డిఆర్ లడిఓ శ్రీనివాస్ రావు,పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి,డిసిఓ సర్దార్ సింగ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఏరియా ఆసుపత్రికి పూర్వవైభవం తెస్తా

- సింగరేణి సీఎంఓ కిరణ్ రాజ్



**బెల్లంపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి పూర్వవైభవం తెస్తానని సింగరేణి సీఎంవో కిరణ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన ఆయనకు బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి డివైసీఎం పాండు రంగచారి, వైద్యులు స్వాగతం పలికారు. డీవైసీఎం ఛాంబర్ లో వైద్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల కొరత, వైద్య నైపుణ్యల సేవలపై సీఎంవోకు విన్నవించారు. ఈసందర్భంగా సీఎంఓ మాట్లాడుతూ బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానన్నారు. వైద్య సేవలను తెలుసుకునేందుకు ఆస్పత్రిని విజిట్ చేసినట్లు తెలిపారు. వైద్య నిపుణుల కొరతను దశల వారీగా తీర్చి, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ మధ్య కాలంలో నూతన వైద్యుల రిక్రూట్మెంట్ జరుగుతోందని, 32 మంది వైద్యులు కొత్తగా వస్తున్నారని, అందులో నుంచి ఇద్దరు వైద్యులను బెల్లంపల్లి ఆస్పత్రికి కేటాయిస్తానని అన్నారు. జనరల్ సర్జన్, ఫిజిషియన్ వైద్య నిపుణుల అవసరం బెల్లంపల్లిలో ఉందని వివరించారు. అప్పటివరకు కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పర్మినెంట్ వైద్యులు వచ్చే వరకూ డిప్యూటేషన్ పై అవసరమైన వైద్య సదుపాయాలకి కృషి చేస్తానన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వారానికోసారి కన్సల్టింగ్ వైద్య నిపుణులను రప్పిస్తానన్నారు. ఏరకంగానూ కార్మిక కుటుంబాలకు వైద్య సేవలు లోటు లేకుండా అందించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రిపై పట్టింపు తక్కువ ఉండేదని, ఇప్పుడు అలా కాదని స్పష్టం చేశారు. కచ్చితంగా కార్మిక కుటుంబాలకు యజమాన్యం అన్ని విధాలుగా వైద్య సేవలను అందిస్తుందన్నారు. అందుకు సింగరేణి సీఎండీ బలరాం, సింగరేణి డైరెక్టర్లు వైద్య సంక్షేమానికి తగిన చేయూతని అందిస్తున్నారన్నారు. ఆయన వెంట బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి డివైసీఎం పాండు రంగచారి, వైద్యులు ఉన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీ యాదవ్ బిడ్డ గెలుపు ఖాయం

- జిల్లా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్

**కామేపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును ఆకాంక్షిస్తూ శుక్రవారం ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు,డిసిసిబి డైరెక్టర్ కామేపల్లి మండలం మాజీ జడ్పిటిసి సభ్యుడు మేకల మల్లి బాబు యాదవ్ జూబ్లీహిల్స్ పరిధిలోని పుట్ వ్యాపారుల షాపులతోపాటు, బోరబండ, నందానగర్, ఎర్రగడ్డ, యూసుఫ్ గూడ,రహమత్ నగర్,శ్రీ నగర్ కాలనీలోని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న.అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని, నవీన్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. అంతకుముందు ఖమ్మం జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు,పశు సంవర్ధక శాఖ మాత్యులు వాకాటి శ్రీహరి,ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రచారం చేసే నాయకులకు దిశానిర్దేశం సూచించారు.



ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపు సునాయాసమని,ఇక్కడ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు,వారి తండ్రిగారైన చిన్న శ్రీశైలం కి ఉన్న సత్సంబంధాలు వల్ల గెలుపు నల్లేరుపై నడక లాగా ఉందని తెలిపారు. నవీన్ యాదవ్ ఎలాగైనా గెలుస్తారని ఊహించిన ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేక సిట్టింగ్ స్థానాన్ని ఎక్కడ చేజార్చుకుంటామేమో అని అనవసరపు అబద్ధపు ఆరోపణలతో ఒక బీసీ యాదవ బిడ్డను రౌడీగా ప్రచారం చేస్తున్నారు. పార్టీలపరంగా అభివృద్ధి పరంగా ఎదుర్కోవడం చేతకాక బీసీలను, యాదవులను కావాలని దురుద్దేశంతో అవమానించడం ఇది ప్రతిపక్షాల అహంకారాలకు నిదర్శనమని,చాలా దురదృష్టమని వ్యాఖ్యానించారు. వివిధ పార్టీలలో ఉన్న యాదవులు రాజకీయాలను పక్కకు పెట్టి ఐకమత్యంతో నవీన్ యాదవ్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని, ప్రతిపక్షాల పార్టీలలో ఉన్న యాదవ బిడ్డలు నవీన్ యాదవ్ ను దూషించే ప్రయత్నాలను అడ్డగించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి యశ్వంత్ చారి,హేమంత్ అజ్జు, మెరియా,దేగల రాజు యాదవ్, సోషల్ మీడియా ఇంచార్జి నక్క మహేష్, తేలు పద్మ, ఇల్లందు నియోజకవర్గ అఖిలభారత యాదవ మహాసభ జిల్లా నాయకులు పుట్ట ఉపేందర్, జన్నారం మండల అఖిల భారత యాదవ మహాసభ నాయకులు వరదబోయిన నరసింహారావు, చిలకల వెంకటేశ్వర్లు యాదవ్, మల్లికార్జున రావు యాదవ్, రామకృష్ణ, బన్నీ యాదవ్, చెన్ను వెంకటరమణ, పల్లెబోయిన శ్రీనివాస్ యాదవ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి




**కామేపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** కామేపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామపంచాయతీ నివాసి అయిన ఖమ్మం జిల్లా బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శీను యాదవ్.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొంటూ విలేకరులతో చరవాణిలో మాట్లాడుతూ ఆయన ఈ విధంగా తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమాన్ని హైదరాబాద్ రాజధానిలో కార్యక్రమాన్ని హైదరాబాద్ రాజధానిలో రాష్ట్ర బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జాలే శ్రీను యాదవ్ హస్తినాపురం డివిజన్ నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

## సరైన తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** సరైన తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ దాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలను ఆదేశించారు.శుక్రవారం చివ్వెంల మండలంలోని ఐలాపురం, సూర్య తండాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.మొంథా తుఫాన్ కారణంగా ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం వర్షాలు ఆగినందున ఎండలకు ధాన్యాన్ని ఆరబెట్టి నిర్దేశించిన ప్రకారం 17 శాతం తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఆయా కొనుగోలు కేంద్రాలకు పంపించిన టార్పాలిన్లను రైతులకు అందజేయాలని ఆదేశించారు. ఐలాపురం ఐకెపి కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన టార్పాలిన్లను తనిఖీ చేశారు.ఎన్ని టార్పాలిన్లు పంపించారని, ప్యాడీ క్లీనర్లు ఎక్కడున్నాయని అడిగి తెలుసుకున్నారు.రోడ్డుపై ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని తేమ కొలిచే యంత్రం ద్వారా పరిశీలించి చూశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ఎకరాకు ఎంత ధాన్యం వస్తుందని, కోతకోయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు.ఐలాపురం కొనుగోలు కేంద్రం నుండి శనివారం కనీసం ఒక లారీ ధాన్యాన్ని మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలని సెంటర్ ఇంఛార్జీని ఆదేశించారు. సెంటర్ మిల్ ట్యాగింగ్ ను ఆన్ లైన్ ట్యాబ్ ద్వారా పరిశీలించడమే కాకుండా ట్యాబ్ ఎంట్రీ ,హమాలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.మిల్లు ట్యాగింగ్ విషయమై పౌరసరఫరాల జిల్లా అధికారులతో ఫోన్ లో మాట్లాడారు.సూర్య తండాలో కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాలను ఆరైవల్ రిజిస్టర్ లో పరిశీలించారు.అంతేకాక కేంద్రంలో ఉన్న వరి ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించారు. వెంటనే కాంటావేసి మిల్లులకు పంపించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.ధాన్యానికి సంబంధించిన రిజిస్టర్లు, లెక్కలు ఎప్పటికప్పుడు కరెక్ట్‌గా రాయాలని సెంటర్ ఇన్చార్జీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపిఎం వెంకయ్య, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, కొనుగోలు కేంద్రం ఇన్చార్జీలు శ్రీనివాసులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## యస్‌బిఐటికి ప్రతిష్టాత్మక ఐబిఎమ్ ఎక్సలెన్స్ అవార్డు



**ఖమ్మం, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** ఖమ్మం యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక ఐ.బి.ఎమ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన ఐ.బి.ఎమ్. సి.యస్.ఆర్. యాన్యువల్ సమ్మిట్ 2025 పేరిట ఐ.బి. యమ్. సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు అధికారులతో పాటు కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ అవార్డుకు కేవలం 4 కళాశాలలను మాత్రమే ఎంపిక చేయగా తెలంగాణా నుంచి ఎస్.బి.ఐ.టి. కళాశాల ఒక్కటే ఎంపికైనట్లు, ఇది తమ కళాశాలకే కాక తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అభిప్రాయపడ్డారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.యస్.ఆర్) లో భాగంగా ఐ.బి.యమ్. సంస్థ గత మార్చి నెలలో తమ కళాశాలలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీ పై 60, ఏడబ్ల్యుయస్ క్లౌడ్ టెక్నాలజీ పై 60 మంది విద్యార్థులకు శిక్షణను దిగ్విజయంగా నిర్వహించినందుకు గాను గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలలో 46 మంది విద్యార్థులు సైబర్ సెక్యూరిటీలో, 50 మంది విద్యార్థులు ఏడబ్ల్యుయస్ క్లౌడ్ టెక్నాలజీలో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికేట్లు పొందారని తెలిపారు.ఐసీటి అకాడమీ వారి సౌజన్యంతో తమ కళాశాల ఎన్నో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిందని, అందులో భాగంగానే ఈ ఐ.బి. యమ్. సియస్ఆర్ పూర్తి చేయగలిగామని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గాను ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ తో పాటు డేటా ఎనలిటిక్స్ పై శిక్షణా కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవార్డు అందుకున్న వారిలో కళాశాల జాయింట్ సెక్రటరీ గుండాల కవిత కూడా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాబిబి ఎ.వి.వి. శివ ప్రసాద్, డాబిబి జె. రవీంద్రబాబు, టి. పి. ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డాబిబి జి. ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**సూర్యాపేట ప్రతినిది, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** సూర్యాపేట పట్టణ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంతరెడ్డి అన్నారు.స్వచ్ఛ సూర్యాపేట కార్యక్రమం కింద శుక్రవారం ఉదయం 25వ వార్డులో పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా పాల్గొని వీధి పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు.ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కల్పించేందుకు అధికారులందరినీ ప్రజలతో కలిసి పనిచేయాలని సూచించారు.పట్టణం శుభ్రంగా ఉండాలంటే ప్రజలు కూడా చురుకుగా ముందుకు రావాలని,ప్రతి ఇంటి ముందే పరిశుభ్రత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.చెత్తను రోడ్లపై వేయకుండా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడం ద్వారా పట్టణం అందంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు.పట్టణంలోని ప్రతి వార్డులో స్వచ్ఛత, పచ్చదనం, నీటి పరిరక్షణ వంటి అంశాలపై మున్సిపల్ శాఖ క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి.సోమయ్య , సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ , ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, టీఎంసీ శ్వేత సిబ్బంది, వార్డు అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు భవన సమస్యలను వెలుగులోకి తెచ్చిన జనంసాక్షి

- జనంసాక్షి కథనంతో స్పందించిన జిల్లా న్యాయ శాఖ అధికారులు
- సమస్యలను పరిశీలించిన ఇన్చార్జి జిల్లా జడ్జి సంపూర్ణ ఆనంద్
- అన్ని సౌకర్యాలు కల్గి, అనుకూలమైన భవన పరిశీలన




**దేవరకొండ, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** దేవరకొండ ప్రజలకు న్యాయ సేవలు అందించే న్యాయస్థానం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, వర్షాకాలంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పడరాని అవస్థలు పడుతుండడంతో జనం సాక్షి దినపత్రికలో 'నిండుకుండలా దేవరకొండ కోర్టు' అనే కథనం ప్రచురించిన విషయం అందరికీ విదితమే.. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా ఇన్చార్జి జడ్జి సంపూర్ణ ఆనంద్ విచ్చేసి,సీనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ కే అనిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కెవిఎస్ హరీష్ బాబు తో కలిసి స్థానిక న్యాయస్థాన భవనం సందర్శించి పరిశీలించారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పడుతున్న అసౌకర్యాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు శిథిలావస్థకు చేరిన ఇరుకైన కోర్టు భవనంలో మూడు కోర్టు హాల్లు నడపటం, వర్షం పడిన సమయంలో నీరు కారడం, విలువైన పత్రాలు తడవడం పరిశీలించిన జిల్లా ఇంచార్జ్ జడ్జి వెంటనే న్యాయశాఖ భవనంను మరో భవనంలోకి మార్చుటకు పట్టణంలోని కోర్టు కొరకు అనుకూలమైనా పలు భవనాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు వనం జగదీశ్వర్,మాడెం రాములు, వస్కులా శ్రీను శ్రీకాంత్, ఎర్ర కృష్ణ జాంభవ్, గోలే సాయి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**హాలియా, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** వర్షాలు తగ్గినందున కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రైతులు వారి ధాన్యాన్ని ఆరబెట్టుకుని సిద్ధంగా ఉన్నట్లయితే కాంటాలు వేసి మిల్లులు పంపిస్తామని చెప్పారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, అనుముల (హలియా) మండలం, రామడుగులో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం కుప్పలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షం తగ్గినందున ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, 17శాతం తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలని, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తాసిల్దార్ రఘు ఎంపీడీవో సుజాత ఐకెపి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బాగా చదివి ఉన్నతస్థానాలు సాధించండి

**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 31 (జనంసాక్షి) :** బాగా చదువుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలను పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని ఆమె అన్నారు.శుక్రవారం ఆమె తిరుమలగిరి (సాగర్) మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్, ఉపాధ్యాయుల హాజరు వివరాలు పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ యాప్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా ఆన్లైన్ హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, విద్యార్థినులను ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత, ఆరోగ్య సదుపాయాలపై శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్‌కు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం 9వ తరగతి విద్యార్థినులతో వివిధ సబ్జెక్టులపై, జనరల్ నాలెడ్జ్ అంశాలపై ప్రశ్నలు అడిగారు. కలెక్టర్ మాట్లాడుతూ బాగా చదివితే మంచి స్థానాలు సాధించవచ్చు, ఆర్థికంగా స్వావలంబిగా మారవచ్చని పేర్కొన్నారు. ఈమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ



అమిత్, ఇన్చార్జి తహసిల్దార్ అనిల్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీవో భిక్షం రాజు తదితరులు ఉన్నారు.

## మణుగూరు ఏరియాలో 73 శాతం బొగ్గు ఉత్పత్తి




**మణుగూరు, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** వర్షా ప్రభావం వల్ల బొగ్గు ఉత్పత్తి తగ్గిందని జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర అన్నారు. శుక్రవారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ...అక్టోబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల 36 వేల 500 టన్నులకు గాను 7 లక్షల 52 వేల 484 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. అక్టోబర్ నెలలో సాధించిన బొగ్గు ఉత్పత్తి 73 శాతం. అలాగే 01 ఏప్రిల్ 2025 నుండి 31 అక్టోబర్ 2025 వరకు ప్రొగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 62 లక్షల 11 వేల టన్నుల లక్ష్యానికి గాను 59 లక్షల 31 వేల 117 టన్నులు సాధించడం జరిగింది అనగా 95 శాతం సాధించడం జరిగింది.అక్టోబర్ నెలలో మణుగూరు ఏరియా 6 లక్షల 74 వేల 84 టన్నుల బొగ్గును రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 31 అక్టోబర్ 2025 వరకు ప్రోగ్రెస్సివ్ గా 58 లక్షల 39 వేల 525 టన్నులు రవాణా చేశారు.అక్టోబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 15 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 64 శాతం తో 9 లక్షల 54 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే పదవి విరమణ మెడికల్ ఉద్యోగులకు ఇతర చెల్లింపులు చేయటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి , ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి వెంకటరామరావు, ఎం ఎన్ జి ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఈ. శ్రీనివాస్, ఏజిఎం(ఐఈడి) సిహెచ్ రాంబాబు, డిజిఎం(పర్సనల్) ఎస్. రమేశ్, డిజిఎం (ఫైనాన్స్) ఎం. అనురాధా, డివై.సిఎంఓ జ్యోతిర్మై, పర్యావరణ అధికారి జే. శ్రీనివాస రావు. ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, డివై. ఎస్ఈ డివిఎస్ఎన్ ప్రవీణ్ , సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

- మహిళ కడుపులో నుంచి 5 కిలోల కణితి తొలగింపు
- సిహెచ్‌సి సూపర్డెంట్ డాక్టర్ రమేష్

**కల్లూరు, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** స్థానిక ఆసుపత్రి భవనంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం ,వైద్య సిబ్బంది శుక్రవారం అరుదైన ఆపరేషన్ చేసి ఓ మహిళ కడుపులో నుంచి 5 కిలోల పైగా ఉన్న కనితిని తొలగించారు. ఇది కల్లూరు చరిత్రలోనే శుభ పరిణామం. తల్లాడ మండల పరిధిలోని రంగం బంజర గ్రామానికి చెందిన జానకి (40) అనే మహిళ గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఇటీవల ప్రవేట్ ఆసుపత్రిలో డాక్టర్లను సంప్రదించగా స్కానింగ్ చేసి కడుపులో పెద్ద సైజు గడ్డ ఉందని ఆపరేషన్ క్రిటికల్ కాబట్టి హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. అదేవిధంగా సత్తుపల్లిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సంప్రదించి అన్ని రకాలటెస్టులు చేయగా ప్రవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న విషయమని హైదరాబాదులో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకోవాలని సూచించినట్లు బాదిరాలు జానకి తెలిపింది. దీంతో గత రెండు రోజుల క్రితం కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్ రమేష్ ని అన్ని రిపోర్టులు తీసుకొని సంప్రదించగా ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని అన్ని పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేసేందుకు సరైన సౌకర్యాలు లేకపోయినప్పటికీ వారి బాధ ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకొని అన్ని తానై సిహెచ్ సి వైద్యాధికారి సూపర్డెంట్ రమేష్ డెలివరీ చేసే రూమును ఆపరేషన్ థియేటర్ గా మార్చి ఆపరేషన్కు అన్ని పరికరాలు సమకూర్చి ఖమ్మం ప్రధాన ఆస్పత్రి వైద్యులు డీసీఎంఓ డాక్టర్ రాజశేఖర్ తోకలిసి యనస్తీషియా వైద్యులు అశోక్, సహకారంతో ఆసుపత్రి సిబ్బంది అంతా సమన్వయంతో వైద్య సేవలు అందిస్తూ ఆపరేషన్ చేసి మహిళ కడుపు నుంచి కనితిని తొలగించారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న క్రిటికల్ ఆపరేషన్ను ఉచితంగా చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులకు రోగి బంధువులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కల్లూరు చరిత్రలోనే అరుదైన ఆపరేషన్



చేయడం జరిగిందని ఎంతో ఖర్చుతో కూడుకున్న క్రిటికల్‌గా ఉన్న మహిళా గర్భంలోని కనితిని ఆపరేషన్ ద్వారా తొలగించినట్లు తెలిపారు. పేషంట్ క్షేమంగా ఆరోగ్యంగా ఉందన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ఇకనుండి అన్ని రకాల ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీసీఎంఓ రాజశేఖర్ గౌడ్ వైద్యులు డాక్టర్ రమేష్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు.




# ఇది స్టార్టప్‌ల కాలం

## లింక్డ్‌ఇన్ లిస్ట్‌లో 2025లో హైదరాబాద్ టాప్ కంపెనీలు

**హైదరాబాద్:** అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్‌ఇన్ హైదరాబాద్‌లో 2025 గానూ టాప్ స్టార్టప్‌ల జాబితాను విడుదల చేసింది. కెరీర్‌లు వృద్ధి చెందగల, అభివృద్ధి చెందుతున్న కంపెనీల వార్షిక ర్యాంకింగ్ ఇది. ఉద్యోగుల ఎదుగుదల, అనుసంధానిత ఆసక్తి, ఉద్యోగ ఆసక్తి , అగ్రశ్రేణి ప్రతిభావంతుల ఆకర్షణపై ప్రత్యేకమైన లింక్డ్‌ఇన్ డేటా ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఏరోస్పేస్ మార్గదర్శి స్కైరూట్ ఏరోస్పేస్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా ఆ తరువాత రీసైక్లింగ్ ప్లాట్‌ఫామ్ రీసైకల్, సాస్ సంస్థ స్వైప్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ టాప్ 10 జాబితాలో ఈసారి ఏడు సంస్థలు కొత్తగా ప్రవేశించాయి. వైవిధ్యమైన ఆవిష్కరణ కేంద్రంగా హైదరాబాద్ ఎంత వేగంగా ఎదుగుతోందో ఈ జాబితాను బట్టి తెలుస్తోంది. లింక్డ్‌ఇన్ లిస్ట్‌లోని టాప్ స్టార్టప్ కంపెనీలలో ఉద్యోగం ఎలా పొందాలో లింక్డ్‌ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్ , లింక్డ్‌ఇన్ ఇండియా న్యూస్ సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నీరాజిత బెనర్జీ అందిస్తోన్న కొన్ని చిట్కాలు..ఏ కంపెనీలు ఉద్యోగాలిస్తున్నాయని మాత్రమే కాకుండా.. స్టార్టప్‌ల విస్తరణను కూడా ట్రాక్ చేయాలి. ఎందుకంటే రెండేళ్లలోనే 14 కొత్త సంస్థలు జాతీయ స్థాయికి ఎదిగాయి. దీన్ని ఉద్యోగ బోర్డులలో చూడలేరు. ముందుగానే ఊపును గుర్తించడానికి నిధులు, ఉత్పత్తి ఆవిష్కరణలు, మార్కెట్



విస్తరణను గమనించాలి. భవిష్యత్ ఎంట్రాప్రెన్యూర్షిష్‌కు అవకాశాలను అంచనా వేయాలి. అధిక-వృద్ధి చెందుతున్న స్టార్టప్‌లలో నాయకత్వం మీ వృద్ధిని టైటిల్ కంటే ఎక్కువగా నిర్దేశిస్తుంది. ఎంట్రాప్రెన్యూర్‌లు టీమ్స్‌ను ఎలా నిర్మిస్తారు.. కమ్యూనికేట్ చేస్తారు.. ప్రతిభను నిలుపుకుంటారు అని చూడటానికి లింక్డ్‌ఇన్‌ని ఉపయోగించండి. హైప్ కంటే నమ్మకం, స్పష్టత ముఖ్యమైనవి. కేవలం ఆవిష్కరణలతో కాకుండా క్రమశిక్షణతో కూడిన వ్యాపార నమూనాల కోసం చూడాలి. ఈ సంవత్సరం అగ్రశ్రేణి స్టార్టప్‌లు ఆవిష్కరణలను అమలుతో జత చేయడం ద్వారా విజయాన్ని అందుకుంటున్నాయి. క్విక్ కామర్స్ కొత్త వర్గాలలోకి ప్రవేశిస్తోంది. ఏఐ మౌలిక సదుపాయాలు విస్తరిస్తున్నాయి. ఫిన్‌టెక్ రంగం మరింత అభివృద్ధి చెందుతోంది. సమస్యా పరిష్కారాలకు ప్రాధాన్యత ఉన్న రంగాలు, సంస్థల దృష్టి సారించాలి. ఈ సంవత్సరం అగ్రశ్రేణి స్టార్టప్‌లు ప్రాబ్లమ్ సొల్యూషన్స్‌పైనే దృష్టి సారించి ముందుకెళ్తున్నాయి. ఆ కంపెనీలు నిమగ్నమై ఉన్న సమస్యను మీరు అర్థం చేసుకుంటే, ఎల్లప్పుడూ రిలేటెడ్‌గా ఉండేందుకు అవకాశం ఉంటుంది.



## పసిడి ధరలు రివర్స్..

### 22 క్యారెట్ల బంగారం ఏకంగా..

పసిడి ధరలు గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గుదలతో ఊగిసలాడుతున్నాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గురువారంతో పోలిస్తే శుక్రవారం బంగారం ధరలు ఒక్కసారిగా రివర్స్ అయ్యాయి. మరో వైపు వెండి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి.


## నష్టాల్లో ముగిసిన సూచీలు..

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పెట్టుబడిదారులు అమెరికా ఫెడ్ రిజర్వ్ రేట్లపై అప్రమత్తత పాటించడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ తదితర అంశాలు.. దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపించాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు తర్వాతి గంటల్లో ఒత్తిడికి లోనై పడిపోయాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, మెటల్, పవర్ రంగాల్లో నష్టాలు నమోదయ్యాయి. సెన్సెక్స్ 460 పాయింట్ల మేర క్షీణించగా.. నిఫ్టీ 150 పాయింట్లకు పైగా తగ్గింది. సెన్సెక్స్ ఈ ఉదయం 84,379.79 పాయింట్ల (క్రితం ముగింపు 84,404.46) వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 84,712.79 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 465.75 పాయింట్ల నష్టంతో 83,938.71 వద్ద స్థిర పడింది. నిఫ్టీ కూడా 155.75 పాయింట్లు నష్టపోయి 25,722.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో ఎటెర్నల్, ఎన్‌టీపీసీ, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, ఎల్అండ్‌టీ, టీసీఎస్, ఐటీసీ, ఎస్‌బీఐఎన్ లాభపడ్డాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 88.77గా ఉంది.



## ఆ బ్యాంకు భళా.. ఈ బ్యాంకు డీలా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ.4,774 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 4,015 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,721 కోట్ల నుంచి రూ. 38,598 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం మాత్రం రూ. 9,315 కోట్ల నుంచి రూ. 9,141 కోట్లకు స్వల్పంగా నీరసించింది. నికర వడ్డీ మార్జిన్లు 2.88 శాతం నుంచి 2.52 శాతానికి బలహీనపడ్డాయి. అయితే స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.73 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.98 శాతం నుంచి 0.54 శాతానికి దిగివచ్చాయి. మొండి రుణాలకు ప్రొవిజన్లు రూ. 2,587 కోట్ల నుంచి రూ. 1,504 కోట్లకు భారీగా తగ్గాయి. ప్రస్తుత స్థాయిలో వృద్ధిని కొనసాగించేందుకు అవసరమైన పెట్టుబడులను కలిగి ఉన్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో కె.సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. దీంతో అదనపు పెట్టుబడుల ఆవశ్యకత లేనట్లు తెలియజేశారు. ప్రభుత్వ రంగ దిగ్గజం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 10 శాతం క్షీణించి రూ. 4,249 కోట్లకు పరిమితమైంది. కీలక వడ్డీ





ఆదాయంతోపాటు, రిటెనాఫ్ ఖాతాల నుంచి రికవరీలు తగ్గడం ప్రభావం చూపింది. నికర వడ్డీ ఆదాయం 3 శాతం నీరసించి రూ. 8,812 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 2.9 శాతం నుంచి 2.67 శాతానికి బలహీనపడ్డాయి. పెట్టుబడుల విక్రయ లాభం 70 శాతం పడిపోయి రూ. 192 కోట్లకు పరిమితంకాగా.. రిటెన్ ఆఫ్ ఖాతాల నుంచి రికవరీ 36 శాతం క్షీణించి రూ. 913 కోట్లను తాకింది. దీంతో ఇతర ఆదాయం 6 శాతం తక్కువగా రూ. 4,996 కోట్లకు చేరింది. స్థూల స్లిప్పేజీలు వార్షికంగా రూ. 5,219 కోట్ల నుంచి రూ. 2,151 కోట్లకు భారీగా తగ్గాయి. దీంతో మొత్తం ప్రొవిజన్లు రూ. 3,393 కోట్ల నుంచి రూ. 2,565 కోట్లకు క్షీణించాయి. కనీస మూలధన నిష్పత్తి 17.07 శాతంగా నమోదైంది.

### దేశంలో డేటా సెంటర్ల దూకుడు..

## త్వరలోనే డబుల్..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకుంటే దేశీయంగా డేటా సెంటర్ల (డీసీ) సామర్థ్యం 2027 నాటికి రెట్టింపు కానుంది. ప్రాజెక్టులను వేగవంతం చేస్తే 2030 నాటికి అయిదు రెట్లకు పెరగనుంది. డేటా లోకలైజేషన్ చట్టాలు, సానుకూల నియంత్రణ విధానాలు, ప్రభుత్వాల నుంచి సబ్సిడీలు, క్లౌడ్ వినియోగం పెరుగుతుండటం మొదలైన అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. మెక్వారీ ఈక్విటీ రీసెర్చ్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం భారత్‌లో 1.4 గిగావాట్ల డీసీ సామర్థ్యం ఉండగా, 1.4 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 5 గిగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయి. టెక్ దిగ్గజం గూగుల్ వచ్చే అయిదేళ్లలో భారత్‌లో 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీనికి తోడు టీసీఎస్ సైతం 6.5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుండగా, మెటా-గూగుల్ భాగస్వాములుగా జామ్‌నగర్‌లో సమగ్ర ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జియో ఇటీవల ప్రకటించింది. అలాగే ఏడబ్ల్యూఎస్ భారత్‌లో క్లౌడ్ కెపాసిటీని 2030 నాటికి 13 బిలియన్ డాలర్స్ పెట్టుబడులు పెట్టనుంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.70 | ₹ 5.72 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,11,350 (22 క్యారెట్లు) | ₹ 1,23,280 (24 క్యారెట్లు) |
|---|---|


### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,65,000

# ఇంతకాలం కలల్ని అమ్ముకున్నారు.. ఇప్పుడు స్థానం లేదంటారా?

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా ఉపాధ్యక్షుడు, ఆంధ్రా అల్లుడు జేడీ వాన్స్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని భారతీయ మూలాలున్న ఓ యువతి వాన్స్ ముఖం మీదే ఎండగట్టింది. అంతేకాదు.. ఆయన వ్యక్తిగత జీవితంపైనా ఆమె వేసిన ఓ ప్రశ్నతో ఆయన ఇబ్బందిపడినట్లు కనిపించారు. అమెరికాలోని మిసిసిప్పీ విశ్వవిద్యాలయంలో టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ %ఐబతీఅఱఅవ్రూశీఅత్ ఖూూ% అనే ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వాన్స్ ప్రసంగిస్తూ.. అమెరికాలో కఠినమైన వీసా పరిశీలన విధానానికి మద్దతు ప్రకటించారు. అమెరికాలోకి చట్టబద్ధంగా వచ్చే వలసదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో..భారతీయ సంతతికి చెందిన ఓ యువతి మైక్ అందుకుంది. ఆయన్ని ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసింది. "మీరు ఇంతకాలం అమెరికా కలల్ని మాకు అమ్మారు, మా యవ్వనాన్ని, సంపదను ఖర్చు పెట్టించారు. అలాంటిది ఇప్పుడేమో ఎక్కువ మంది వస్తున్నారు.. వాళ్లను వెనక్కి పంపాలి అంటారా?.. మాకు ఇక్కడ స్థానం లేదంటారా?. మేము చట్టబద్ధంగా వచ్చాం, మీ నిబంధనలు పాటించాం. ఇప్పుడు మమ్మల్ని ఇక్కడికి చెందనివాళ్లమంటారా?" అని వాన్స్‌ను నిలదీశారు. ఆ సమయంలో..కొందరు చప్పట్లు చరుస్తూ ఆమెను అభినందించడం గమనార్హం. అయితే వాళ్లను వారిస్తూ ఆమె ఈ ప్రశ్నతో గొడవ చేయాలన్నది తన ఉద్దేశం కాదంటూ స్పష్టం చేశారు. దానికి వాన్స్ సమాధానం ఇవ్వలేదు. బదులుగా.. అత్యధిక ఇమ్మిగ్రేషన్ అమెరికా సామాజిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని.. కొంతమంది అక్రమ వలసదారులు దేశానికి మేలు చేశారని.. అంతమాత్రాన అందువల్ల లక్షల మందిని అనుమతించాల్సిన అవసరం లేదు అని అభిప్రాయపడ్డారు. ఆ వెంటనే..ఆ యువతి.. అమెరికాను ప్రేమించాలంటే క్రిస్టియన్ కావాల్సిందేనా? అని అడిగింది. దానికి వాన్స్ స్పందిస్తూ తాను మత బోధనను విశ్వసిస్తానని.. తన భార్య కూడా భవిష్యత్తులో అదే విశ్వాసాన్ని కలిగి ఉంటుందని ఆశిస్తున్నానని చెప్పారు. అయితే, ఆమెకు స్వేచ్ఛ ఉందని, అది తనకు సమస్య కాదని అన్నారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర





విమర్శలకు దారితీశాయి. వాన్స్ వైఖరిపై ఇండో అమెరికన్లు మండిపడుతున్నారు. హిందూ భార్యను కలిగి ఉండి, మతపరమైన మార్పును ఆశించడం ద్వంద్వ వైఖరేనంటూ పలువురు వ్యాఖ్యానించారు. వాన్స్ వివాహం వేద హిందూ సంప్రదాయంలో జరిగినదని కూడా కొందరు గుర్తు చేశారు. వాన్స్‌ను ప్రశ్నించిన ఆమె ఎవరన్నదానిపై ఇంకా స్పష్ట త రావాల్సి ఉంది.




# యూపీఐ లావాదేవీల్లో గుత్తాధిపత్యం!

- రెండు సంస్థల చేతుల్లోనే 80 శాతం వాటా
- దీన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి
- ఆర్థిక శాఖ, ఆర్‌బీఐని కోరిన ఐఎఫ్ఎఫ్

న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీల్లో 80 శాతాన్ని కేవ లం 2 సంస్థలు (ఫోన్‌పే, జీపే) నియంత్రిస్తున్నాయంటూ.. ఈ ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు చ ర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ, ఆర్‌బీఐని ఇండి యా ఫిన్‌టెక్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) కోరింది. ఫిన్ టెక్ పరిశ్రమకు స్వీయ నియంత్రణ మండలిగా వ్యవహరిస్తున్న ఐఎఫ్ఎఫ్.. ఇందుకు సంబంధించి వి ధాపరమైన సూచనలు చేసింది. ఐఎఫ్ఎఫ్‌లో భాగమైన ఫిన్‌టెక్ సంస్థలతో విస్తృతమైన సంప్రదింపుల అనంతరం వీటిని రూపొందించినట్టు తెలిపింది. యూపీఐపై 30 థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు (టీపీఏపీలు) ఉండగా.. 80 శాతానికిపైగా లావాదేవీలు రెండు సంస్థల నియంత్రణల్లోనే ఉన్నాయి. ఈ రెండు సంస్థలు దోపిడీ ధరలతో (భారీ తగ్గింపులు, క్యాష్ బ్యాక్ ఆఫర్లు)తమ ఆధిపత్యాన్ని కాపాడుకుంటాయి. ముఖ్యంగా చిన్న సంస్థలు, దేశీ పోటీదారులను పోటీపడకుండా చేస్తాయి. ప్రభుత్వానికి చెందిన భీమ్ ప్లాట్‌ఫామ్ సైతం ఈ ద్వందాధిపత్యం దెబ్బకు మార్కెట్ వాటాను కోల్పోయింది. యూపీఐ లావాదేవీలను నగదుగా మార్చుకునే అవకాశం (ఎండీఆర్ చార్జీలు) లేకపోవడం, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలకు ఉన్న నిధుల వెసులుబాటు.. కొత్త సంస్థలు, చిన్న సంస్థల ప్రవేశానికి గట్టి అవరోధంగా నిలుస్తాయి. పోటీని అణచివేస్తాయి. ఒక సంస్థ గరిష్టంగా 30 శాతం లావాదేవీలకే సేవలు అందించాలన్న పరిమితిని అమలు చేయడంలో ఎన్‌పీసీఐ జాప్యం చేస్తుండడం నిర్వహణపరమైన సవాళ్లను, ఏకాగ్రత రిస్క్‌ను తెలియజేస్తుంది. ఎన్‌పీసీఐ ఈ పరిమితి అమలు చేయడానికి ముందుగానే ఈ సంస్థలు మరింత పెద్దవిగా అవతరించేందుకు అనుమతించడం.. వ్యూహాత్మకమే అనిపిస్తోంది. ఈ ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు బడా రెండు యూపీఐ సంస్థలు (టీపీఏపీలు) కాకుండా మిగిలిన వాటికి యూపీఐ ప్రోత్సాహకాల్లో అధిక వాటా అందుకునేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే సదరు రెండు అతిపెద్ద టీపీఏపీలు ప్రోత్సాహకాల్లో అధిక భాగాన్ని పొందుతాయి. ఒక టీపీఏపీకి ప్రోత్సాహకాల్లో 10 శాతం గరిష్ట పరిమితి విధించాలి.

## భారత్- అమెరికాల మధ్య కీలక రక్షణ ఒప్పందం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్- అమెరికా ల మధ్య సంబంధాలు మరింత బలపడనున్నాయి. ఇరుదేశాల మధ్య శుక్రవారం కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. 10 ఏళ్ల పాటు ఉండే ఈ ఒప్పందం ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, భద్రతా సహకారాన్ని బలోపేతం చేయనుంది మలేసియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఇక్కడ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్‌లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ ఒప్పందంపై ఇరువురు సంతకాలు చేశారు. 10 ఏళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందని హెగ్సెత్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది ఇరుదేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్తుందన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని పెంచుకుంటామన్నారు.



# 'పో బయటకు..'

## సోదరుడికి షాకిచ్చిన బ్రిటన్ రాజు

బ్రిటన్‌రాజు కింగ్ చార్లెస్ తన సోదరుడు ప్రిన్స్ ఆండ్రూకి భారీ షాకిచ్చారు. రాయల్ టైటిల్స్‌ను వదులుకోవడంతో పాటు తక్షణమే అధికారిక మహల్ ఖాళీ చేయాలని ఆదేశించారు. అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం కేసు పత్రాలలో బ్రిటన్ యువరాజు ఆండ్రూ పేరు కూడా ఇటీవల బయటకువచ్చింది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే కింగ్ చార్లెస్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. డ్యూక్ ఆఫ్ యార్క్ సహా అన్ని రాచరిక హక్కులను, ఆ హోదాల్లో అన్ని రకాల వసతులను వదులుకోవడంతో పాటు 30 గదుల విండ్‌సోర్ రెసిడెన్సీని ఖాళీ చేయాలని బ్రిటన్‌రాజు కింగ్ చార్లెస్ 3 తన సోదరుడు ప్రిన్స్ ఆండ్రూని ఆదేశించారు. ఈ మేరకు బకింగ్‌హమ్ ప్యాలెస్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆండ్రూ ఈ ఆరోపణలను తిరస్కరించినా.. ఈ చర్యలు నైతికంగా అవసరమైనవేనని బ్రిటన్ బకింగ్‌హమ్ ప్యాలెస్ ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంలో బాధితులకు రాజు చార్లెస్, రాణి కామిల్లా మద్దతు ఎప్పటికీ ఉంటుందని తెలిపింది. వర్జీనియా జియూఫ్రే అనే మహిళ 17 ఏళ్ల వయసులో తనపై ప్రిన్స్ ఆండ్రూ లైంగిక దాడి చేశారని ఆరోపిస్తూ 2022లో పౌర న్యాయస్థానంలో కేసు వేశారు. అయితే.. ఆమెతో అనైతిక ఒప్పందం కుదుర్చుకుని ఆ కేసును ఆయన ముగించారు. ఆ సమయంలో ఆమెను అసలు తాను ఎన్నడూ కలవలేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈలోపు..ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రిన్స్‌ఆండ్రూ పేరు రావడం సంచలనంగా మారి తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఆ వెంటనే తన అన్న.. బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ ఒత్తిడి మేరకు ప్రిన్స్ ఆండ్రూ తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకునేందుకు సిద్ధపడ్డారనే ప్రచారమూ జరిగింది. దానికి కొనసాగింపుగా తన బిరుదును, తనకు లభించే గౌరవాలను ఉపయోగించనంటూ ప్రిన్స్ ఆండ్రూ స్వయంగా సోషల్ మీడియా వేదికగా





వెల్లడించారు. ఇదిలా ఉంటే.. అక్టోబర్ 27వ తేదీన లిచ్‌ఫీల్డ్ క్యాథడ్రల్ వద్ద రాజు చార్లెస్‌ను ఒక వ్యక్తి ప్రశ్నిస్తూ.. ఆండ్రూ-ఎప్‌స్టీన్ సంబంధాల గురించి ఎంతకాలంగా తెలుసు?" అని నిలదీశాడు. పోలీసులకు ఆండ్రూ విషయంలో కవర్‌అప్ చేయమని చెప్పారా? అని కూడా ప్రశ్నించాడు. అయితే చార్లెస్ అదేం పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో కూడా వైరల్ అయ్యింది. అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం కేసు పత్రాలలో దేశ మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ సహా దాదాపు 200 మంది ధనవంతులు, శక్తిమంతుల పేర్లు ఉన్నాయి. పేద, మధ్యతరగతి బాలికలు, యువతులకు భారీ మొత్తం ఆశ చూపించి ఫ్లోరిడా, న్యూయార్క్, వర్జిన్ ఐలాండ్స్, మెక్సికోల్లోని నివాసాలకు పిలిపించి అఘాయిత్యాలకు పాల్పడేవాడనేది ప్రధాన ఆరోపణ. ఈ కుంభకోణానికి సంబంధించిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్‌పై ఆరోపణలు చేసిన జొహన్నా సోబెర్గ్ ఇచ్చిన వాంగ్మూలంలో ప్రిన్స్ ఆండ్రూపైనా సంచలన ఆరోపణలు చేశారు. 2001లో తాను న్యూయార్క్ వెళ్లినప్పుడు ఎప్‌స్టీన్ నివాసంలో ఓ గ్రూప్ ఫొటో దిగామని, అప్పుడు ప్రిన్స్ తనని అసభ్యంగా తాకాడని పేర్కొన్నారు. ఇదే వాంగ్మూలంలో క్లింటన్, ట్రంప్ పేర్లను కూడా ఆమె ప్రస్తావించడం గమనార్హం.

### అమెజాన్‌లో రూ. 2 లక్షల ఫోన్ ఆర్డర్..

## పార్సిల్ చూసి టెకీ షాక్..

**బెంగళూరు:**ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసే అలవాటున్న వారికి షాకింగ్ న్యూస్. దీపావళి సందర్భంగా బెంగళూరు టెక్నీషియన్‌కు ఎదురైన అనుభవం గురించి తెలుసుకుంటే అవాక్కవ్వాల్సిందే. దాదాపు రెండు లక్షల రూపాయల స్మార్ట్ ఫోన్ ఆర్డర్ చేస్తే రాయి ( టైల్స్) వచ్చింది. పూర్తి వివరాలు ఇలా



ఉన్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ద్వారా రూ.1.87 లక్షల విలువచేసే తనకెంతో ఇష్టమైన శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్‌ను ఆర్డర్ చేశాడు బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రేమానంద్. దీపావళి నాటికి ఫోన్ తన చేతిలో ఉండేలా అక్టోబర్ 14న అమెజాన్ యాప్‌లో స్మార్ట్‌ఫోన్ కోసం ఆర్డర్ ఆర్డర్ పెట్టాడు. క్రెడిట్ కార్డ్ ద్వారా పూర్తి మొత్తాన్ని చెల్లించాడు. ఇక ఎపుడు డెలివరీ అవుతుందా అని ఆతృతగా ఎదురు చూశాడు. తనకిష్టమైన ఫోన్‌రాలేదు సరికదా రాయి వెక్కిరించింది. అయితే అదృష్టం ఏమిటంటే అక్టోబర్ 19న డెలివరీ అయిన సీల్డ్ ప్యాకేజీని అన్‌బాక్స్ చేస్తున్న వీడియోను అతను రికార్డ్ చేశాడు. దీంతో అమెజాన్ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించింది. అలాగే దీనిపై నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేశాడు మరియు తరువాత అధికారిక ఫిర్యాదు నమోదు చేయడానికి కుమారస్వామి లేఅవుట్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాడు. నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. "నేను రూ. 1.87 లక్షల విలువైన ఫోన్‌ను ర్డర్ చేశాను, కానీ నాకు షాక్ ఇచ్చేలా, దీపావళికి ఒక రోజు ముందు ఫోన్‌కు బదులుగా పాలరాయి రాయి వచ్చింది. దీంతో నా పండుగ ఉత్సాహం అంతా నాశనమైపోయింది. ఆన్‌లైన్‌లో, ముఖ్యంగా అమెజాన్‌లో షాపింగ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. ఈ అనుభవం తీవ్ర నిరాశపరిచింది" అని ప్రేమానంద్ తన అనుభవాన్ని షేర్ చేశాడు.

# తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టం



- ఆడపిల్లలను వేధిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి
- సమస్యపై నిమిషాల్లోనే స్పందించి, నిందితుడుపై చర్యలు తీసుకునేలా చేశాం
- విద్యార్థులను వేధించిన ఘటనలో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర, అక్టోబర్ 31 (జనంసాక్షి):** ఆడపిల్లలను వేధిస్తే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హెచ్చరించారు. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను వేధించిన ఘటనలో శుక్రవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో ఉన్న సమస్యల గురించి తనకు సమాచారం ఇవ్వాలని, పెద్దన్నలా అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. పాఠశాలలో విద్యార్థులను వేధించిన ఘటనలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి నిమిషాల్లోనే నిందితుడైన అటెండర్ను, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్ఎంను సస్పెండ్ చేయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థులపై ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, మార్కెట్ సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, తాసిల్దార్ అంబటి రజిత,ఎండివో రామ్, ఎంఈఓ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య,పడాల రాజన్న, సాగి అజయ్ రావు,బుర్గు గంగన్న ,దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ ,రోమాల రమేష్, పడితపల్లి కిషన్, రాచమల్ల భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి,కర్ర బాపు రెడ్డి, నగేష్, మహేష్,ఆనంద్,ముచ్చ శంకరయ్య,మంత్రి మహేందర్, గంగాధర ప్రవీణ్,మ్యాక వినోద్ ,రాజు, తదితరులు పాల్గొన్నారు.



- లక్షలు అప్పు చేసి కోతకు సిద్ధమైన పంట... రెండు రోజుల్లో నీట మునిగి నాశనం
- 'ఇంటికి రావాల్సిన ధాన్యం... ఇప్పుడు కంట నీళ్లే మిగిలాయి'
- అధికారులు ఇంకా రాలేదు... ప్రభుత్వమే ఆసరా అని ఆర్తనాదం
- కౌలు రైతు తిరుపతిరావు దంపతుల ఆవేదన

# అప్పుల భారం మీద నీళ్ల దెబ్బ... 15 ఎకరాల వరి పంట మొలకెత్తి కన్నీళ్లు

**చిగురుమామిడి, అక్టోబర్ 31 (జనంసాక్షి):** "అప్పులు చేసి... రాత్రింబవళు కష్టపడి... కోతకు రెండు రోజుల ముందు వర్షం... ఇప్పుడు 15 ఎకరాల పంట మొలకెత్తి కన్నీళ్లు పుట్టిస్తోంది..." అంటూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన కౌలు రైతు పేరాల తిరుపతిరావు గొంతు పూడుకుపోతోంది. భారీ అకాల వర్షాలకు పూర్తిగా నేలవలసిన పంటలు చూస్తూ ఆయన భార్య కూడా కన్నీటి గొట్టంగా మారింది. "లక్షల రూపాయల అప్పు.. పిల్లల భవిష్యత్తు... ఇంటికి రావాల్సిన ధాన్యం.. అన్నీ నీటిలో మునిగాయి. ఇప్పుడు మా ముందు ఏం మిగిలింది?" అంటూ ఆవేదనతో నిండిన గొంతుతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తం 25 ఎకరాల్లో వరి పంట వేసిన తిరుపతిరావు... ఇందులో 15 ఎకరాలు పూర్తిగా నాశనమయ్యాయి. "ఎన్నడూ లేని విధంగా వర్షం... పంటలు కోతకు సిద్ధంగా ఉన్నాయి... ఇప్పుడు మొలకెత్తి కుళ్లిపోతున్నాయి. మా కష్టం ఎవరికి కనిపించడం లేదు" అంటూ రైతు దంపతులు కన్నీరు మున్నీరుగా కారుస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా సర్వేకు రాలేదని, ప్రభుత్వమే తమ ఆసరా అని ఆర్తనాదం చేస్తున్నారు. చిగురుమామిడి మండలంలోని సీతారాంపూర్, ఇందుర్తి గ్రామాల్లోనూ వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 7,562 ఎకరాల్లో పంటలు నష్టపోయాయని, 29,797 మంది రైతులు ప్రభావితమయ్యారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించి సహాయ హామీ ఇచ్చినా... ఇంకా అధికారులు రాలేదని రైతులు ఆవేదన పడుతున్నారు. "ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోకపోతే... మా జీవితాలు అంధకారమే" అంటూ తిరుపతిరావు దంపతులు కన్నీటి ఆర్తి వెలిబుచ్చారు.

## రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ'

**వేములవాడ రూరల్, అక్టోబర్ 31 (జనంసాక్షి):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేములవాడ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో మర్రిపల్లి గ్రామం కస్తూరిభా విద్యాలయం నుంచి మర్రిపల్లి బస్టాండ్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వెంకట్రాజం మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శనమన్నారు. "రన్ ఫర్ యూనిటీ" వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ మండల విద్యాధికారి కిషన్, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్ లు రాజశేఖర్, సతీష్, రమేష్,ఆరిఫ్, దేవరాజు, వినయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

## సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్



**గంగాధర, అక్టోబర్ 31 (జనంసాక్షి):** న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన చాలా అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్ అన్నారు. నేడు గంగాధర మండలంలోని కురిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడినారు. అనంతరం ఏర్పాటు చేసిన "న్యాయ విజ్ఞాన సదస్సు" లో వెంకటేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం అని అన్నారు. ప్రతి పౌరుడు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉంటే తమ హక్కులను, బాధ్యతలను తెలుసుకుంటారని అన్నారు. ఈ సదస్సులో బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధం, ర్యాగింగ్ నిరోధక చట్టాలు మరియు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా రక్షణ చట్టాలు, లైంగిక వేధింపుల నిరోధక చట్టాలతో పాటు, %ూుాజుూ% (పోక్సో) చట్టం గురించి అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలు, పేద మరియు బలహీన వర్గాల ప్రజలు ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి, న్యాయ సేవలు ఎక్కడ అందుబాటులో ఉంటాయో వివరంగా తెలిపారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు మరియు విధులను గురించి తెలియజేశారు. చట్టాలపై అవగాహన ఒకరిని నేరాల బారిన పడకుండా కాపాడుతుందని, అదే విధంగా న్యాయం కోసం పోరాడటానికి సహాయపడుతుందని అన్నారు. న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తుందని ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో గంగాధర పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. వంశీ క్రిష్ణ, జిల్లా న్యాయ సేవధికార సంస్థ, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, సభ్యులు ఏ. కిరణ్ కుమార్, మండల విద్యాధికారి ఏ. ప్రభాకర్ రావు ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఐక్యత పరుగుతో దేశభక్తి స్ఫూర్తి

## ఎస్పీ పచ్చజెండా ఊపి ప్రారంభం

- విద్యార్థులు, యువత ఉత్సాహంగా పటేల్ విగ్రహానికి నివాళులు
- జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు

**కామారెడ్డి, అక్టోబర్ 31 (జనంసాక్షి):** జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ' 2కే రన్ ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి డీఎస్పీ కార్యాలయం నుంచి జీవధాన్ స్కూల్ సమీపంలోని పటేల్ విగ్రహం వరకు సాగిన ఐక్యత పరుగులో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపులో ఎస్పీ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఇలాంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్పీ, దేశాన్ని ఒకే తాటిపైకి తెచ్చిన మహానుభావుడు పటేల్ స్ఫూర్తితో సమాజంలో ఐక్యత, సామరస్యం నెలకొల్పాలని, ప్రతి పౌరుడు దేశ సమగ్రత కాపాడే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో దేశభక్తి, జాతీయతాభావం పెంపొందించడం మా లక్ష్యమని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు జాతీయ స్ఫూర్తిని పెంచడంలో పోలీస్ శాఖ ముందుంటుందని తెలిపారు. పాల్గొన్నవారందరికీ అభినందాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నరసింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది, కాలేజీల సీఈఓలు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ యం.జైపాల్‌రెడ్డి, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యం కొనుగోలుకు కలెక్టర్ హామీ

**మేడిపల్లి, అక్టోబర్ 31 :** మిగ్జామ్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు జగిత్యాల జిల్లాలో నేలకొరిగిన వరి పంటలు, తడిసిన ధాన్యం, మొక్కజొన్న కల్లాలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. భీమారం మండల కేంద్రంలోని నేలవాలిన వరి పంటలను ప్రత్యక్షంగా చూసి, దేశాయిపేట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ తుఫాను ప్రభావంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం, కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా సందర్శించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, మొలకలు వచ్చినా, రంగు మారినా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో కప్పాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే ఆరబెట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కోరుట్ల ఆర్‌డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి భాస్కర్, డీఎస్‌ఓ జితేందర్ రెడ్డి, ఎంఆర్వో మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ-2 ఏరియాలో ఘనంగా ఏఐటీయూసీ

# 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 31 (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో ఘనంగా ఏఐటీయూసీ106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. శుక్రవారం ఆర్జీ-2 ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో, వివిధ గనుల్లో, డిపార్టుమెంట్లలో జెండా ఆవిష్కరించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... కార్మికుల, రైతుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి, ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపనలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఏఐటీయూసీ అనుబంధంగా కామ్రేడ్ దేవురి శేషగిరిరావు అధ్యక్షతన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏర్పడిందని గుర్తు చేశారు. అనేక మంది అమరుల త్యాగాలతో కార్మికుల కోసం పలు హక్కులను సాధించిందని, ప్రైవేట్ కాం ట్రాక్టర్ల ఆధీనంలో నడిచిన సింగరేణిని ప్రభుత్వ రంగ సంస్థగా మార్చడంలో ఈ యూనియన్ కీలకపాత్ర పోషించిందన్నారు. వేతన సవరణలు, వేజ్ బోర్డు, 44 కార్మిక చట్టాలు, 8 గంటల పని విధానం, దీపావళి బోనస్, లాభాల వాటా, పెన్షన్ వంటి హక్కులు సాధించడం ఏఐటీయూసీ సాధించిన విశిష్ట విజయాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చి, స్వాతంత్ర్యానికి ముందు ఉన్న వెట్టి చాకిరి విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తోందని



విమర్శించారు. కార్మిక వర్గం ఏకతా సాధించి ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, ఎల్. ప్రకాశ్, కందుకూరి రాజరత్నం, బీ. శ్యాంసన్, గంధం సాంబశివరావు, బీ. అన్నారావు, రవికుమార్, మహేందర్, సంపత్, శంకర్, మహేందర్, రాజు, రాజిరెడ్డి, తాళ్లపల్లి నారాయణ, చిట్టంపల్లి మహేందర్, కుమారస్వామి, రాజసాగర్, లచ్చన్న, నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం

**గంభీరావుపేట అక్టోబర్ 31 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండల కేంద్రం లో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఆదేశాలతో రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో భాగంగా గంభీరావుపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను సీఐ శ్రీనివాస్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇందులో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక కేజీ టు పీజీ విద్యాలయం నుండి ప్రారంభమైన రన్ గాంధీ చౌక్ అమరవీరుల స్థూపం వద్ద వరకు సాగింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ సమగ్రతకు నిలువెత్తు రూపమన్నారు.

స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ గౌడ్ తో పాటు గంభీరావుపేట పోలీస్ సిబ్బంది, స్థానికులు ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి

- ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గరీబీ హటావో నినాదంతో దేశంలో ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండాలని ఆనాడే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ పథకం కొనసాగుతుందని అన్నారు. దేశ సమైక్యత కోసం పాటు పడిన ఇందిరాగాంధీ కొన్ని దుష్ట శక్తులకు బలి కావలసి వచ్చిందని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్దులమై పని చేయాలని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో



కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, చర్ల పద్మ, ఎండి చాంద్, బొబ్బిలి విక్టర్, దండి రవీందర్, అహ్మద్ అలీ, అష్రాఫ్, వంగల విద్యా సాగర్, చింతల కిషన్, రాజిరెడ్డి, షబానా మహమ్మద్, జ్యోతిరెడ్డి, బషీర్, భారీ, హసీనా, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

- తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్

**మంథని, (జనంసాక్షి) :** భారీ వర్షాలు వరదలతో ఈ ప్రాంత రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలను మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ధ్వజమెత్తారు. మంథని పట్టణంలో స్వర్గీయ గిట్ల జనార్దన్ రెడ్డి స్మారక వ్యవసాయ మార్కెట్ కమిటి లో దాదాపు 15 రోజుల క్రితం రైతులు ధాన్యాన్ని విక్రయం తీసుకు వచ్చినప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం చేయక పోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. స్థానిక ఏఎంసీ మార్కెట్ యార్డులో తడిచిన వరి ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యేకంగా మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల కష్టాలపై కనీస అవగాహన లేని వ్యక్తులకు ఓటు ద్వారా మనం అధికారం కట్టబెడితే ఇలాంటి నష్టాలనే చూడాల్సిన పరిస్థితులుంటాయి. మంథని నియోజకవర్గ ప్రజల ఓట్ల ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న ఎమ్మెల్యే మంత్రిగా అధికారాన్ని అనుభవిస్తూ తను, తన కుటుంబ సభ్యుల లాభం కోసమే పని చేస్తున్నాడే తప్ప ఏనాడు ఈ ప్రాంత ప్రజల కష్టాలపై ఆలోచన చేసిన పాపాన పోలేదని, ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన ఎమ్మెల్యే ఎవరైనా ఉన్నారంటే అది కేవలం మంథని ఎమ్మెల్యేకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనం మంథని ఏఎంసీ మార్కెట్



యార్డేనన్నారు. రైతులు ఇక్కడ వరి ధాన్యం పోసి 15 రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదన్నారు. కనీసం రైతులకు వరి ధాన్యం తడవకుండా ఉండేలా టార్పాలిన్లు కూడ అందించక పోవడం బాధకరమన్నారు. కొంత మంది రైతులకు చిరిగి పోయి, చిల్లులున్న టార్పాలిన్లు అందించారని ఇది వరకు సమంజసమని ప్రశ్నించారు. ఏఎంసీ మార్కెట్ యార్డులో దాదాపు నెల రోజుల క్రితం పాడి డ్రైయర్ మిషన్ తీసుకు వచ్చి ఇంకా వినియోగం లోకి తేలేదు అంటే వీళ్లకు రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో అనే విషయం స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. ఇప్పటికైనా పాలకవర్గం సభ్యులు, అధికారులు స్పందించి వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, తడిచిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము తీవ్ర ఆందోళన కార్యక్రమాలను చేసేందుకు కూడ వెనుకాడబోమని స్పష్టం చేశారు.

## "కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో"

# నూతన కార్యాలయాలు ప్రారంభించిన సీపీ

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనంలో నూతనంగా తీర్చిదిద్దిన ఏసీపీ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్) కార్యాలయం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, ఏసీపీ రైటర్ కార్యాలయాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం రోజు అధికారికంగా ప్రారంభించారు. ఇంతకు ముందు కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఏసీపీ కార్యాలయాన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనంలోకి మార్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ రైటర్ కార్యాలయాల కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి, వాటిని ఆధునీకరించారు. సీపీ గౌష్ ఆలం పూజా కార్యక్రమాలు నిర్వహించి, లాంఛనంగా నూతన కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నూతన కార్యాలయ భవనం ద్వారా ట్రాఫిక్ పోలీసు అధికారులకు మెరుగైన పని వాతావరణం లభిస్తుందని, తద్వారా వారు ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్డు నియమాలను అమలు చేయడంలో, అత్యవసర పరిస్థితుల్లో, రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు, క్షేత్ర స్థాయిలో అందుబాటులో



ఉంటూ పోలీస్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తారని వారు అన్నారు. ట్రాఫిక్ పోలీసుల సేవలు విజిబుల్ పోలీసింగ్‌లో అత్యంత ముఖ్యమైనవని సీపీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకట రమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరి స్వామి, వేణుగోపాల్, శ్రీనివాస్ జి లతో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఖరీముల్లా ఖాన్, రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజిలెన్స్‌లో కృత్రిమ మేథా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

- హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్
- విజిలెన్స్ శిక్షించే వ్యవస్థగా కాదు-సంస్కరించే వ్యవస్థగా రూపుదిద్దుకోవాలి
- జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరావు
- సింగరేణి విజిలెన్స్ వారోత్సవాల్లో ప్రముఖుల సందేశాలు
- 10 రాష్ట్రాల్లో సింగరేణి కార్యకలాపాలు: సీఎండీ ఎన్.బలరామ్



**గోదావరిఖని, జనంసాక్షి :** అవినీతి అక్రమాలు, నేరాలను నియంత్రించే క్రమంలో విజిలెన్స్ శాఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తే పారదర్శకత,ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ఐదోరోజు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు.ఈ సమావేశానికి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ అధ్యక్షత వహించారు.సజ్జనార్ మాట్లాడుతూ 'అవినీతి, అక్రమాలు తగ్గాలంటే వ్యవస్థల్లో మౌలిక మార్పులు అవసరం.లోపభూయిష్టమైన విధానాలు అక్రమాలకు దారితీస్తాయి. కాబట్టి వ్యవస్థను పటిష్టపరచి, మంచి అలవాట్లు, పద్ధతులను అమల్లోకి తేవాలి,'అని పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.సింగరేణి సంస్థతో తనకు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు.నేడు దేశ జీడీపీ పెరుగుదలలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ యువ సీఎండీ శ్రీ ఎన్ బలరామ్ సారథ్యంలో పలు వ్యాపార విస్తరణ చర్యల ద్వారా గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ దిశగా మరింత వేగంగా ఎదగాలి అని ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే, మార్పు స్వీకరించడంలో వెనుకబడ్డ అనేక కంపెనీలు మూతపడ్డాయని గుర్తుచేసి, సింగరేణి ఉద్యోగులు సవాళ్లను స్వీకరించి, తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. విజిలెన్స్ విభాగం ఇతర సంస్థల్లో అమలు చేస్తున్న మంచి పద్ధతులను స్వీకరించడం ద్వారా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. విజిలెన్స్ అంటే శిక్షించే శాఖ కాదు-సంస్కరించే శాఖగా రూపుదిద్దుకోవాలి జి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కమిషనర్, జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి ఆధునిక పరిస్థితుల్లో విజిలెన్స్ శాఖ అంటే శిక్షించే వ్యవస్థగా కాకుండా సంస్కరించే శాఖగా రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి చేయాల్సిన ప్రతీ కార్యకలాపాన్ని స్థిరంగా మరియు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఎలా నిర్వహించాలో తెలిపే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసీజర్ను రూపొందించాలని సూచించారు. దీనివల్ల పొరపాట్లు జరగడానికి అవకాశం ఉండదని, అలాగే అవినీతిని నిరోధించవచ్చని పేర్కొన్నారు. విజిలెన్స్ శాఖ అవినీతి అక్రమాలను అడ్డుకునే క్రమంలో అత్యుత్సాహం తో నిజాయతీగా పనిచేసే అధికారులను మాత్రం భయపెట్టకూడదని అభిప్రాయపడ్డారు. దీనివల్ల విజిలెన్స్ అసలు లక్ష్యం పక్కదారి పడుతుందన్నారు.బాగా పనిచేసే అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసలు అవసరమని, ఇవి వారు మరింత బాగా పనిచేయటానికి ఉపయోగపడతాయన్నారు. ఉద్యోగులకు తెలియకుండా పొరపాట్లు జరిగినప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించాలన్నారు. తాము పనిచేస్తున్న పనికి జీతం తప్ప వేరే ఇంకా ఏమీ ఆశించని స్థాయికి ఉద్యోగులు తమ ఆలోచనలు మార్చుకోవాలని,అప్పుడు విజిలెన్స్ శాఖ అవసరం ఉండదు అన్నారు.ప్రతీ ఉద్యోగి ప్రశాంతంగా తమ బాధ్యతలు నిర్వహించాలని, ప్రలోభాలకులోను కాకూడదని పేర్కొన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ చేపడుతున్న వ్యాపార విస్తరణ చర్యలను వివరించారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ తీసుకురావడం కోసం, పని గంటల సద్వినియోగం కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నామని, వ్యవస్థలను మరింత పటిష్ట పరిచేందుకు ఈసారి విజిలెన్స్ వారోత్సవాలలో ప్రముఖులను ఆహ్వానించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించేలా, అలాగే అంతర్జాతీయంగా ఖనిజ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్..చీఫ్ విజిలెన్స్ఆఫీసర్ బి.వెంకన్న, జీఎం(కో-ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.



# సిఐటియు జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్**

**జమ్మికుంట, అక్టోబర్ 31 (జనం సాక్షి):** నవంబర్ 9, 10 తేదీలలో కరీంనగర్ లో జరిగే సిఐటియు 11వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు.అనంతరం జమ్మికుంటలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల మాట్లాడుతూ 1970 నుండి నేటి వరకు సిఐటియు కార్మిక వర్గాన్ని ఒకే వర్గంగా ఏకం చేస్తూ కార్మికుల హక్కులకై ఐక్య పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా కార్పొరేట్ సంస్థలు పారిశ్రామిక వ్యక్తులు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారని చిన్న మధ్యతరగతి వేలాది మంది అసంఘటిత కార్మికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కార్డు తెచ్చిందని, కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పెట్టుబడిదారులకు చౌకగా అమ్మి వేస్తుందని, కార్మిక చట్టాల రక్షణ కోసం కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం గ్రామస్థాయి నుండి అఖిల భారత స్థాయిలో సిఐటియు పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో జరగబోయే పోరాటాలకు ప్రభుత్వాలు కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించేందుకు రానున్న రోజుల్లో ఐక్య ఉద్యమాలు నిర్మించేందుకు ఈ మహాసభలు తోడ్పడతాయని ఈ మహాసభలు జయప్రదానికి అన్ని రంగాల కార్మికులు ప్రజలు తోడ్పాటునందించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జక్కుల రమేష్ యాదవ్,సాగర్ల కుమార్ పటేల్, మధునయ్య, నరేష్, కిరణ్, రజాక్, మహేందర్ సది, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# కబ్జాలకు గురైన రాజీవ్ గృహకల్ప ఇండ్లను సీజ్ చేసిన అధికారులు

**నిజాంపేట్ అక్టోబర్ 30 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో గతంలో 18 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రి హయాంలో పేదలకు ఇండ్లను నిర్మించాలనే లక్ష్యంతో రాజీవ్ గృహకల్ప పేరుతో 103 బ్లాక్లులు నిర్మాణాలు చేపట్టి నిర్మాణాలు ఒక్కో బ్లాక్ లో 32 కుటుంబాలు నివసించే విధంగా మొత్తంగా 3,296 ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. అందులో దాదాపు 100 ఇండ్లు అలాట్మెంట్ కానివి ఉన్నాయి .గత ప్రభుత్వంలో కొంతమంది నాయకుల ప్రోద్బలంతో కొన్ని ఇండ్లు, మరికొన్ని అధికారుల ద్వారా దాదాపు 50 ఇండ్లు కలెక్టర్ ద్వారా కొంతమంది ప్రజలు లబ్ధి దారులుగా మారారు. మిగత ఆ ఇండ్లు అలాట్మెంట్ కానివి హౌసింగ్ బోర్డు ఆధీనంలో ఉండగా, ఇటీవల మళ్ళీ కాంగ్రెస్ అధికారం లోకి రావడంతో అలాట్మెంట్ కానీ ఇంకా 43 ఇండ్లపై కన్నేసిన కొందరు కబ్జా చేసేందుకు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తూ బ్లాక్ లోని కాళీ ఉన్న పక్క ఫ్లాట్ వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ కబ్జాలకు పాల్పడుచుండడం తో చాలాకాలంగా స్థానిక ప్రజలు హౌసింగ్ బోర్డ్ అధికారులకు, కలెక్టర్ కు ఫిర్యాదులు చేయడంతో ఎట్టకేలకు స్పందించిన హౌసింగ్ బోర్డు అధికారులు గురువారం 43 ఇండ్ల కు గాను 20 ఇండ్లకు సీజ్ చేయడం జరిగింది చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు మిగతా అలాట్మెంట్ కానీ ఖాళీగా ఉన్న ఇండ్ల ను సీజ్ చేసి, అలాగే గతంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఇప్పటివరకు కబ్జాలకు పాల్పడి ఆక్ పై చేసుకున్న వారి పై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.

## సంక్షేమ పథకాల ఆద్యురాలు
# ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

- ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు
- తలకొండపల్లి సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి



**తలకొండపల్లి అక్టోబర్ 31(జనంసాక్షి):** దేశంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదరిక నిర్మూలనకు కృషిచేసిన గొప్ప నాయకురాలు దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని తలకొండపల్లి సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు.శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనం గా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ..భారతదేశ మొదటి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె దేశానికి అనేక సేవలు చేశారని గుర్తు చేశారు. దేశాభి వృద్ధి కోసం, బడుగు బలహీన వర్గాల ప్రజలకోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదయ్య, సురేందర్ రెడ్డి, జంగయ్య, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

# సమైక్యతా సౌరభౌముడు సర్దార్

- వల్లభాయ్ పటేల్‌కు జోహర్లతో నివాళులు
- కోట్ పల్లిలో ఉత్సహంగా రన్ ఫర్ యూనిటీ

**కోట్ పల్లి అక్టోబర్ 31(జనంసాక్షి):** దేశ సమైక్యతకు పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను సౌరభౌముడుగా కీర్తించారు. శుక్రవారం స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని, హొమ్ మంత్రి, బార్డోలీ వీరుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కోట్ పల్లి పోలీసు శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు రన్ చేశారు . ఈ ర్యాలీలో ఎస్ఐ శైలజ తో పాటు కోట్ పల్లి చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. ర్యాలీలో సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఐ శైలజ మాట్లాడుతూ..... స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న సంస్థానాలను దేశంలో విలీనం కావడానికి గట్టిగా కృషి చేశారు. స్వతంత్రంగా ఉండాలనుకునే 526 సంస్థానాలను దేశంలో విలీనం చేసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఉక్కుమనిషిగా ఆయన కృషి వల్ల దేశం సమైక్యతగా మారిందని అన్నారు. అందుకే ఆయన సమైక్యతా సౌరభౌముడుగా నిలుస్తున్నారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- డ్రగ్స్ వద్దు మన భవిష్యత్తు ముద్దు
- మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు పాపిశెట్టి రాము



**తలకొండపల్లి(ఆమనగల్) అక్టోబర్ 31(జనంసాక్షి):** విద్యార్థులు,యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మెడికల్ షాప్ అసోసి యేషన్ అధ్యక్షులు పాపిశెట్టి రాము అన్నారు. టిఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ఈ నెల12,న ఆమనగల్ పట్టణంలో నిర్వహిస్తున్నటువంటి డ్రగ్స్ వద్దు మన భవిష్యత్తు ముద్దు అనే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులతో కలిసి శనివారం పాపిశెట్టి రాము విడుదల చేశారు.ఈ సందర్భంగా పాపి శెట్టి రాము మాట్లాడుతూ.. విద్యార్థులు,యువత తాము అనుకున్న లక్ష్యాల వైపు ప్రయాణించి గమ్యం చేరుకోవాలని, కానీ కొంతమంది యువకులు విద్యార్థులు మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు బానిసలుగా మారి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ సభ్యులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమాని కి పెద్ద ఎత్తున విద్యార్థులు యువత రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఫిలిం డాన్సర్ ప్రభుశంకర్,టిఎస్ఎస్ఓ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ మీసాల చిక్కి(బాల వర్షిత్), బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుమ్మకొండ రాజు, నాయకులు వస్పుల సురేష్, మీసాల గోపాల్, వస్పుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్-బిజాపూర్ జాతీయ రహదారి
# రోడ్డు విస్తరణకు గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు

- రోడ్డు పనులు వేగవంతంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- కోర్టులో కేసు అనుకులంగా రావడం హర్షణీయం ఎమ్మెల్యేలు రామోహన్ రెడ్డి, యాదయ్య



**చేవెళ్ల, అక్టోబరు 31 (జనంసాక్షి) :** హైదరాబాద్-బిజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణకు గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు అనుకులంగా రావడం హర్షనీయమని పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు, రాంమ్మోహన్ రెడ్డి, యాదయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణా పోలీస్ అకాడమీ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి ఎన్ఏచ్ 163 నాలుగు లైన్ల రోడ్లు విస్తరణ పనులకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు (చెన్నైయ్)లో శుక్రవారం ఉదయం విచారణపై తుది వాదనలు పూర్తయ్యాయిని చెప్పారు. ఎన్టీటీ భారత జాతీయ రహదారుల అథారిటీ సమర్పించిన ప్రతిపాదనను ఆమోదించిందన్నారు. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు స్టే ఆర్డర్ను రద్దు చేసిందన్నారు. రోడ్డు విస్తరణ పనులు వెంటనే కొనసాగించవచ్చని ఆదేశించిందని స్పష్టం చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టుతీర్పును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కోర్టులో కేసు వేసిన, ప్రణయ్ రావు, తేజ, బాలాంత్రపులతో ప్రభుత్వం చర్చలు జరపడంతోనే కేసును విత్ డ్రా చేసుకున్నారని తెలిపారు. హై దరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డుపై ఇప్పటి వరకు 250 మంది చనిపోయగా, మరో 600 మంది గాయపడ్డారని గుర్తు చేశారు. కోర్టు తీర్పురావడంతో రోడ్డు పనులు వేగవంతంగా కొనసాగించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత గుత్తెదారును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయని చెప్పారు. రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్లు మంజూరు చేసిందన్నారు. రోడ్డు పనులు పూర్తి అయితే రాజేంద్రనగర్, చేవెళ్ల, పరిగి, తాండూర్, వికారాబాద్, కొండగల్ నియోజకవర్గాలతో పాటు కర్నాటక రాష్ట్రానికి వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిర్విరామంగా రోడ్డు పనులు ఈ రోజు నుండి నిర్విరామంగా రోడ్డు పనులు సాగుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యావాధాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సమావేశం లో పీఏపీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి, మైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి,మాజీ సర్పంచ్ లు దావల్గారి గోపాల్ రెడ్డి, మధుసూదనుప్తా, పడాల ప్రభాకర్ మున్సిపాల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నర్సింలు, ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్, మహేందర్, తాజోద్దీన్, నాయకులుతదితరులు ఉన్నారు.

## దేశంలో కార్మిక వర్గ హక్కుల సాధనలో
# ఏఐటీయూసీది ఎనలేని కృషి

- కార్మికుల ఎజెండానే ఏఐటియుసి జెండా



**గోదావరిఖని, జనంసాక్షి :** దేశంలో కార్మిక వర్గ హక్కుల సాధనలో ఏఐటియుసిది ఎనలేని కృషి ఉందని, కార్మికుల ఎజెండానే ఏఐటియుసి జండా అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్ పేర్కొన్నారు.శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మద్దీ ఎల్లాగౌడ్ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ బొంబాయి నగరంలో 1920 అక్టోబర్ 31న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఏర్పడిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికవర్గ హక్కుల కోసమే గాక దేశ స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు.ఆ తర్వాత ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అద్వితీయమైన కృషి చేసి, అసాధారణ త్యాగాలు, బలిదానాలు, పోలీసు దాష్టీకాలు,పెట్టుబడుదార్ల గూండాల దాడులు, యావత్ జీవిత శిక్షలు, మరణ దండనలతో ఏఐటియుసి చరిత్ర యావత్తు ఎరుపెక్కిందన్నారు.కోట్లాది మంది కార్మికవర్గ గొంతుకగా వారి గుండెల్లో స్థానం సంపాదించుకుందని,ఏఐటియుసి ఒకానొక చారిత్రక నేపథ్యంలో ఏర్పడిందని వారు కొనియాడారు.గత 105 సంవత్సరాలుగా కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి అనేక హక్కులను సాధించుకో వడం జరిగిందని వారు పేర్కొన్నారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తీసుకు వస్తున్నారని వాటిని ఎదుర్కోవాలంటే పోరాటం వల్లనే సాధ్యమవుతుందని వారు అన్నారు.నేడు సింగరేణిలో కార్మిక వర్గం అనుభవిస్తున్న ప్రతి హక్కు ఎఐటియుసి చేసిన పోరాటాలేనని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడం కోసం మరిన్ని పోరాటాలు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

ఏఐటియుసి ఆర్జీ-వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్ళపెల్లి మల్లయ్య, నాయకులు నాయిని శంకర్, లెనిన్, నవీన్, పొన్నం రంజిత్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐక్యత..సమగ్రతకు ప్రతిఒక్కరు కృషి చేయాలి


- సమైక్యతకు అవగాహన కల్పించడమే లక్ష్యం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**గోదావరిఖని, జనంసాక్షి :** జాతీయ ఐక్యత దినోత్సవం 'రన్ ఫర్ యూనిటీలో' భాగంగా దేశ ఐక్యత సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అలాగే ప్రజలందరూ ఐక్యతగా, బంధు భావన కలిగి ఉండాలని, ప్రజల్లో జాతీయ ఐక్యత, సామరస్యం, దేశభక్తి, సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.భారత ఐక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయి పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని గోదావరిఖని 1టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనరెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవ పరుగు రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు.ముందుగా జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరుగు కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు.రామగుండంపోలీస్ కమీషనరేట్ నుండి రామగుండం మున్సిపల్ టి-జంక్షన్ వరకు తిరిగి రామగుండం పోలీస్ కమీషనరేట్ గ్రౌండ్ వరకు పరుగు కొనసాగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ సేవలు, దేశాన్ని ఏక్త బంధంతో కట్టిపడేసిన ఆయన నాయకత్వం ప్రతి ఒక్కరికీ ప్రేరణ అని మనమందరం ఐక్యతతో, స్ఫూర్తితో ముందుకు సాగితేనే దేశ అభివృద్ధి మరింత సాధిస్తుందని అన్నారు.రజాకార్లను విచిన్నం చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఏకం చేసిన స్వేచ్ఛ వాయువులు పీల్చుకునేల కృషి చేసిన సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు రుణపడి ఉండాలని సినీ నటులు సాగర్ అన్నారు.పటేల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని, అందుకు పోలీసుల సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని సిపి అంబర్ కిషోర్ ఝా తెలిపారు.యువత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా దేశభక్తి, సమైక్యతా భావం ప్రతి ఒక్కరికి చేరేలా తమ వంతు సహకారం అందించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, శేఖర్, మల్లేశం, సంపత్, సినీ నటుడు సాగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రిజర్వేషన్ సాధన కోసం బీసీ ఉద్యమం

- మంత్రి వాకిటి శ్రీహరి
- రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమం ఆగదు : ఆర్.కృష్ణయ్య





**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం బీసీ ప్రజలతో భారీ ఉద్యమాన్ని చేపట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీలో చట్ట సభలలో బీసీ ల రిజర్వేషన్ ల సాధనకు ధర్మ దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్, డాక్టర్ దేశగాని సాంబశివ గౌడ్ బాధ్యత వహించారు. ఈ దీక్ష ను రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పూల దండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు బీసీ రిజర్వేషన్ లు సాధించే వరకు ఉద్యమం ఆగదని అన్నారు యూనివర్సిటీ ల విద్యార్థుల తో భారీ ఉద్యమం ను నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీ హరి హాజరై మాట్లాడుతూ రాహుల్ గాంధీ చట్ట సభలలో బీసీ లకు 42% రిజర్వేషన్ లు ఇవ్వాలని భారత దేశం మొత్తం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని బీసి ల చట్ట సభ లలో రిజర్వేషన్ లు ఇవ్వాలని నిర్ణయం జరిగిందని, అందుకే కాంగ్రెస్ రిజర్వేషన్ లు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేంద్రం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్ లో చేర్చాలని రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో ఆమోదం తెలిపిందని కోర్టు లో రిజర్వేషన్ కేస్ వేసి అడ్డు కోవడం సిగ్గు చెటని అన్నారు 42% రిజర్వేషన్ లు సాధించే కాంగ్రెస్ కట్టు బడి ఉంది అవసరం అయితే బీసీ ప్రజలతో భారీ ఉద్యమం కు సిద్దంగా ఉన్నామని అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరై మాట్లాడుతు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చేసే పోరాటం న్యాయం ఉందని అందుకే మేము కాలేజీ కి వచ్చామని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ లకు 42% రిజర్వేషన్ ల కోసం మాట ఇచ్చాము కట్టు బడి ఉన్నామని అన్నారు బీసీ జాతీయ సంక్షేమ సంగం అధ్యక్షులు మాట్లాడు తు బీసీ ల రిజర్వేషన్ ల కోసం భారీ ఎత్తున కార్యాచరణ ఉందని అన్నారు రాష్ట్రం లో కాంగ్రెస్, కేంద్రం లో బీజేపీ రెండు ప్రభుత్వం లు బీసీ లై ప్రేమ ఉంటే వెంటనే ఇవ్వాలని లేకపోతే ఉద్యమం లు చేస్తామని అన్నారు. గౌరవ అతిథులుగా జస్టిస్ ఈ శ్వరయ్య మాట్లాడుతూ మొదటి నుండి నేను రిజర్వేషన్ లను రాజ్యాంగం లో 9 వ షెడ్యూల్ లో చేర్చాలని అన్నారు. చిరంజీవులు హాజరై మాట్లాడుతూ రాజకీయ నాయకులను నమ్మ లేము విద్యార్థులుగా రిజర్వేషన్ లకోసం ఉద్యమం చేయాలనీ అన్నారు. డాక్టర్ విశారదన్ హాజరై మాట్లాడు తు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని మనం రాష్ట్ర ప్రభుత్వం పై ఉద్యమం చేయాలనీ విద్యార్థులు యూనివర్సిటీ లలో తెలంగాణ కోసం కొట్లాడారు ఇప్పుడు మన హక్కుల కోసం పోరాడాలని అన్నారు. టీజెస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడుతూ 42% బీసీ రిజర్వేషన్ ల కోసం అందరం కలిసి కొట్లాడాలని కేంద్రం వెంటనే 9వ షెడ్యూల్ లో చేర్చాలని అన్నారు. మాజీ రాజ్య సభ సభ్యులు హన్మంత్ రావ్ మాట్లాడుతు రాష్ట్రంలో ఉద్యమంలు కాదు త్వరలో ఢిల్లీ లో భారీ ఉద్యమం చేద్దామని మనం అందరం ఢిల్లీ కి వెళదామని అన్నారు బీసీ రిజర్వేషన్ లు సాధించే వరకు ఊరుకోమని అన్నారు. ఈ దీక్ష కు ప్రొఫెసర్ రామయ్య శాపర్డ్ మద్దత్తు తెలిపారు. ధర్మ దీక్షను చేస్తున్న విద్యార్థుల కు నిమ్మ రసం ఇచ్చి విరమింపజేశారు. బీసీ కళామండలి జాతీయ అధ్యక్షులు రామలింగంకళాబృందంతో పాటలో ఊర్రుతలుంగించారు. దీక్ష లో పాల్గొన్న విద్యార్థి నాయకులు వట్టి కూటి రామారావు గౌడ్ అల్లుడు జగన్ ముదిరాజ్, మాలిగ లింగ స్వామి,శివరాత్రి ప్రశాంత్,రెడ్డి శ్రీనివాస్ బొల్లెపల్లి స్వామి గౌడ్, మాసం పల్లి అరుణ్ కుమార్, నక్క శ్రీశైలం యాదవ్,బైరు నాగరాజు గౌడ్, అవార్ వేణు, బొమ్మ హన్మంత్రావ్ కేతురి వెంకటేష్, రాస వెంకట్ ముదిరాజ్, ఆర్ఎల్ మూర్తి పార్ట్ టైమ్ ఏసీలు జులు నగేష్, కృష్ణ కిషోర్, సోమేశ్, ఎస్.నాగేశ్వరావు, జంపాలా రాజేష్, జన సేన విద్యార్థి సంగం అధ్యక్షులు సంపత్ నాయక్, ఆర్ఎల్ శంకర్, పల్స అంజనీయులు కొమ్మనబోయిన సైదులు యాదవ్,రమేష్ యాదవ్ బీమ్ రావు నాయక్ వెంకట్ నాయి, రాజు యాదవ్, మద్దత్తుగా టీపీసీసీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదు సత్యం గౌడ్,ఐయిల్ వెంకన్న, ఒడ్డెర సంగం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్, కోలా జనార్దన్, దుర్గయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సమాచారశాఖ డిడి ప్రసాదరావు పదవీవిరమణ

**హైదరాబాద్, అక్టోబర్31 (జనంసాక్షి) :** సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్న జి ప్రసాదరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు వివిధ హోదాల్లో దాదాపు 41 సంవత్సరాల సర్వీసు అనంతరం నేడు ప్రసాదరావు పదవి విరమణ కార్యక్రమాన్ని సమాచార భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ప్రసాదా రావు సేవలను ఈ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన సీనియర్ అధికారులు కొనియాడారు. ఈ పదవి విరమణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డీ.ఎస్ జగన్, డి శ్రీనివాస్, కే వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు హాష్మి, వై వెంకటేశ్వర్లు, సురేష్, ఆర్.ఐ.ఈ జయరాం మూర్తి, తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి లతోపాటు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, డిడి ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, అక్టోబర్31 (జనంసాక్షి) :** భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. అక్టోబర్ 17వ తేదీన సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ శుక్రవారం సస్పెండ్ చేసింది. నాగారం సర్వే నంబర్ 194, 195ల్లోని బ్యూరోక్రాట్స్ భూములను నిషేధిత జాబితాలో ఉంచాలంటూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో బ్యూరోక్రాట్స్ ఆపిల్ చేశారు. ఈ నేపథ్యంలో ఆధారాలను పరిశీలించిన తర్వాత డివిజన్ బెంచ్ తీర్పు వెల్లడించింది. అవి భూదాన్ భూములు కానప్పుడు నిషేధిత జాబితాలో ఎందుకు ఉండాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఐఏఎస్, ఐపీఎస్‌లకు సర్వే నంబర్ 194,195 భూమి పట్టా భూములేనని జిల్లా కలెక్టర్ రిపోర్ట్ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181,182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై విచారణ జరపాలంటూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు 50వేల పరిహారం ఇవ్వాలి
- కల్వల మత్తడిని పరిశీలించిన కవిత



**కరీంనగర్, అక్టోబర్31 (జనంసాక్షి) :** తెలంగాణలో భారీ వర్షాలకు పంటనష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు కాకుండా.. ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో కొట్టుకుపోయిన కల్వల మత్తడిని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కల్వల మత్తడి కొట్టుకుపోయి 3 ఏళ్ళు అవుతోందని.. దీని రిపేర్ కోసం గత ప్రభుత్వమే రూ. 70 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని, కానీ తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు జరగటం లేదన్నారు. ఈ మత్తడిని రిపేర్ చేయించాలని హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్ట్‌పై వందలాది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన రూ. 70 కోట్ల జీవో ను పాస్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా రైతుల బాగు కోసం మత్తడి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదు అనే మాటను నిజం చేయాలంటే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో కట్ట తెగినప్పుడు అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించి తొందరగా దీన్ని పూర్తి చేశారని.. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా మత్తడిని పునరుద్ధరించాలని కోరారు. మొంథా తుపాను కారణంగా తెలంగాణ మొత్తం రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్, ఖమ్మం రైతులకు మాత్రమే ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్నట్లుగా విన్నామని చెప్పారు. శంకరపట్నంలో కూడా వరి రైతులు నష్టపోయారని.. వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఎకరాకు రూ. 10 వేలు కాకుండా ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు చేతికొచ్చిన పంటను రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇప్పుడు పంట కోసిన కూడా 25 శాతం వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రభుత్వం రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి అధికారులను ఫీల్డ్ కు పంపించి పంట నష్టం లెక్కలు తీయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కేంద్రం తరఫున రైతులకు పంట నష్టం పరిహారం ఇప్పించాలని కోరారు. కల్వల మత్తడి రిపేర్ కోసం ముఖ్యమంత్రితో ఎంపీ మాట్లాడాలన్నారు. అటు ఈ ప్రాజెక్ట్ మీదనే దాదాపు 180 ముదిరాజ్ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని.. వారికి ఇదే జీవనాధారమని చెప్పారు. వెంటనే మత్తడి బాగు చేయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# అమితాబ్‌కు బెదిరింపులు

**భారీగా భద్రత పెంచిన కేంద్రం**



**ముంబై, అక్టోబర్31 (జనంసాక్షి) :** బాలీవుడ్ బిగ్ బీ అమితా బచ్చన్ కు కేంద్ర భారీగా భద్రత పెంచనుంది. ఇటీవల పంజాబీ సింగర్, నటుడు దిల్జిత్ దోసాంజ్ ' కౌన్ బనేగా కోరోడ్ పతి' ఎపిసోడ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బిగ్ బీ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నా డు. ఇది వివాదానికి దారి తీసింది. ఈ క్రమంలో అమితాబ్ కు బెదిరింపులు వచ్చాయి. బిగ్ బీ కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకోవడాన్ని ఖలిస్తానీ సంస్థ 'సిఖ్స్ ఫర్ జస్టిస్' తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సంస్థ అధిపతి గురుపత్వంత్ సింగ్ పన్నూ, అమితాబ్‌ను గౌరవించడం అనేది 1984 సిక్కు వ్యతిరేక హింసలో చనిపోయిన వారిని అవమానించడమేనని ఆరోపించారు. అంతేకాకుండా, 1984 అల్లర్లను రెచ్చగొట్టడంలో అమితాబ్ కీలకపాత్ర పోషించారని, ఆయన అప్పుడు 'ఖూన్ కా బద్లా ఖూన్' అనే నినాదాన్ని ఇచ్చారని ఆరోపిస్తోంది. అయితే, బిగ్ బీ గతంలోనే ఈ ఆరోపణలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో,ఖలిస్తాన్ చీఫ్ పన్నూ, నవంబర్ 1న ఆస్ట్రేలియాలో జరగనున్న దిల్జిత్ దోసాంజ్ మ్యూజిక్ కచేరీని అడ్డుకుంటామని బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశాడు. ఈ బెదిరింపులు దిల్జిత్ అభిమానుల్లో, అలాగే చిత్ర పరిశ్రమలో ఆందోళన కలిగించాయి. ఉగ్రవాద సంస్థ నుంచి వచ్చిన ఈ బెదిరింపులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వివాదాస్పద ఆరోపణలు, బెదిరింపుల నేపథ్యంలో అమితాబ్ బచ్చన్ భద్రతను కట్టుదిట్టం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం అమితాబ్‌కు ఏ స్థాయిలో భద్రత ఉంది, దాన్ని ఏ స్థాయికి పెంచబోతున్నారు అనే వివరాలు తెలియాల్సి ఉంది. దేశంలో సీనియర్ నటుడిగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన వ్యక్తిగా బిగ్ బీ భద్రతను కట్టుదిట్టం చేయనుంది.

# బెల్టుషాపుల వల్లే కర్నూలు బస్సు ప్రమాదం

**వైకాపా నేతల దుష్ప్రచారంపై పోలీసుల కేసు**

**27మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు**

**కర్నూలు, అక్టోబర్31 (జనంసాక్షి) :** కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సమీపంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు అందడంతో కర్నూలు తాలుకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా 27 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ జాబితాలో ఆరే శ్యామల, సీవీ రెడ్డి, కందుకూరి గోపికృష్ణతోపాటు వైసీపీ అధికార ఎక్స్ పేజీ నిర్వాహకులు ఉన్నారు. ఈ కర్నూలు బస్సు ప్రమాదం బెల్టు షాపులు, కల్తీ మద్యం కారణంగానే జరిగిందంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఆ క్రమంలో కర్నూలు మండలం బి. తాండ్రపాడుకు చెందిన పేరపోగు వెనుములయ్య పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్టోబర్ 24వ తేదీ తెల్లవారుజామున చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు మరణించారు.



## శ్రీశైలం జలాశయానికి వరదపోటు

- గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

**శ్రీశైలం, అక్టోబర్31 (జనంసాక్షి) :** ఎగువ రాష్ట్రాలతో పాటు.. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది భారీ వర్షాలు కురిశాయి.. ప్రాజెక్టులు, నదులు, చెరువులు, కుంటలు ఇలా కొన్ని ప్రాంతాలను మినహాయిస్తే అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి.. ఇక, పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో రైతన్నలు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి.. అయితే, ఏడాదిలో మరోసారి నీటిపారుదల శాఖ అధికారులు శ్రీశైలం జలాయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు .. శ్రీశైలం జలాశయానికి మరోసారి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఎగువనున్న జూరాల, సుంకేసుల, హంద్రీ నుండి వరద నీరు రావడంతో శ్రీశైలం జలాశయం నుండి ఈ ఏడాది ఏడోవ సారి రేడియల్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు అధికారులు.. శ్రీశైలం జలాశయం ఒక గేటు 10 అడుగుల మేర ఎత్తి.. దిగువకు నీరు విడుదల చేశారు అధికారులు.. ఇక, జలాశయం ఇన్‌ఫ్లోలో 68,691 క్యూసెక్కులుగా ఉండగా.. ఔట్ ఫ్లోలో 90,293 క్యూసెక్కులుగా ఉంది.. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.60 అడుగులుగాఉంది.. పూర్తిస్థాయి నీటి నిలువ 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 213.4011 టీఎంసీలుగా ఉంది.. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది..

# కలకలం రేపుతున్న గొర్రెల బాగోతం!

- చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌లో దసరా మామూళ్ల పేరిట 8 గొర్రెలు తీసుకొచ్చి 2 కోసుకు తిన్నారట...
- గాంధీ జయంతి రోజునే జీవహింసకు పాల్పడ్డారనే ఆరోపణలు...
- మిగతా 6 గొర్రెలు మాయం చేసి అమ్ముకోవడం పట్ల తీవ్ర విమర్శలు...
- ఇంటలిజెన్స్, ఎస్ బి ద్వారా అన్ని ఆధారాలతో జిల్లా పెద్దసారు దృష్టికి గొర్రెల బాగోతం..
- గ్రామాల్లో, తండాలలో కొనసాగుతున్న విచారణ...



చెన్నారావుపేట, అక్టోబర్ 31 (జనం సాక్షి): పోలీస్ శాఖలో గొర్రెల బాగోతం రోజురోజుకు కలకలం రేపుతోంది. అంతేకాదు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో దసరా మామూళ్ల పేరిట తీసుకువచ్చిన గొర్రెల వ్యవహారం పై రోజురోజుకు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో ఆసక్తి రేపుతుంది. దసరా పండుగ ముందు రోజు ఎస్సై ఆదేశాలతో ఓ సీనియర్ కానిస్టేబుల్ గ్రామాలు, తండాలలో తిరిగి దసరా మామూళ్ల పేరిట 8 గొర్రెలను తీసుకువచ్చి అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజునే రెండు గొర్రెలను పోలీస్ స్టేషన్ లోనే కోసి జీవహింసకు పాల్పడ్డారనే ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. కోసిన గొర్రెల మాంసాన్ని తలా పాపం... తిలా పిరికెడు... అన్నట్లుగా పోగులు వేసుకొని పంచుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. అంతేకాక మిగతా 6 గొర్రెలను మాయం చేసి అమ్ముకోవడం పట్ల అదేవిధంగా మండలంలో ఉన్న మూడు వైన్ షాపుల పేరిట పెద్ద ఎత్తున మద్యం బాటిల్లు తీసుకువెళ్లి పంపకాల విషయం దగ్గర తేడాలు రావడంతో పోలీసులకు పోలీసులకే వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు ప్రచారమైంది. అంతేకాక గ్రామాలలోని మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులకు రెండు రోజుల ముందు ఫోన్ చేసి దసరా పండుగ వస్తుంది.. మమ్మల్ని కూడా చూసుకోండి... మా సీనియర్ కానిస్టేబుల్ ను పంపిస్తున్న అని ఎస్సై నేరుగా ఫోన్ చేశాడని మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు బాటంగా ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో కూడా పెద్ద సారుకు కొంతమంది ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయం పోలీస్ శాఖలో కలకలం రేపుతోంది. ఆ నోట...ఈ నోట... ఇంటలిజెన్సీ, ఎస్ బి పోలీసు వర్గాల ద్వారా ఈ విషయం జిల్లా పెద్దసారు దృష్టికి వెళ్లినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో పెద్ద సారు చాలా సీరియస్ గా ఉన్నట్లు సమాచారం. వెంటనే గొర్రెల బాగోతం, మద్యం బాటిల్ల పై విచారణ జరిపి నివేదిక అందించాలని కోరినట్లు ఇంటలిజెన్సీ, ఎస్ బి వర్గాల ద్వారా తెలిసింది.

### గ్రామాలు, తండాలలో కొనసాగుతున్న విచారణ...

8 గొర్రెలను గ్రామాలు, తండాలలో ఎవరెవరి వద్ద తీసుకువచ్చారని ఇంటెలిజెన్సీ, ఎస్ బి అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఎవరెవరి వద్ద దసరా మామూళ్ల పేరిట తీసుకువచ్చారో పూర్తి ఆధారాలతో నివేదికను జిల్లా పెద్ద సార్ కు అందించినట్లు సమాచారం. అదేవిధంగా మూడు వైన్ షాపుల వద్దకు వెళ్లి ఎన్ని మద్యం బాటిల్లు తీసుకువెళ్లారు... ఎవరు వచ్చి తీసుకెళ్లారు అనే విషయాన్ని కూడా విచారించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో పెద్ద సారు చాలా సీరియస్ గా ఉన్నట్లు ప్రచారం అవుతుంది. ఏది ఏమైనా ఇంత బహిరంగమై సోషల్ మీడియాలో పోలీసుల గొర్రెల బాగోతం పై చక్కర్లు కొడుతున్న విషయంలో పోలీసుల ప్రతిష్టను అభాసుపాలు చేస్తున్నందుకు గాను అందుకు బాధ్యులైన వారి పై శాఖ పరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది.

### పోలీస్ స్టేషన్ కు కలిసిరాని మేకలు, గొర్రెలు...

చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు మేకలు, గొర్రెలు కలిసి రావడం లేదు. 2011 వ సంవత్సరం జూలై నెలలో 9 మేకలను పర్వతగిరి మండలం దౌలత్ నగర్ వద్ద కొందరు వ్యక్తులు దొంగతనం చేసుకొని ఆటోలో తీసుకు వస్తుండగా అప్పటి ఎస్సై మోహన్ పోలీస్ స్టేషన్ ముందు వాహనాలు తనిఖీ చేస్తుండగా 9 మేకలు, ఆటోను పట్టుకున్నారు. విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకొని మేకల దొంగతనం జరిగిన బాధితుడికి న్యాయం చేయకుండా ఆటోను పోలీస్ స్టేషన్ లో పెట్టి 9 మేకలను ఓ తండాలో ఒకరి వద్ద ఉంచి ఎస్సై తన ఇంట్లో శుభకార్యం ఉండడంతో 9 మేకలను తీసుకువెళ్లి వాటిని కోసి శుభకార్యం నిర్వహిస్తాడు. ఆ వ్యవహారంలో బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అదే ఏడాది ఆగస్టు నెలలో ఎస్సై మోహన్ ను అప్పటి జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. ఈ సంఘటన పోలీస్ శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. మళ్లీ సరిగ్గా 14 సంవత్సరాలకు 8 గొర్రెల బాగోతం చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో మళ్లీ చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో 8 గొర్రెల బాగోతం అని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటే చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు మేకలు, గొర్రెలు కలిసి రావడంలేదని పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఈ విషయంలో అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటారా... లేకుంటే వదిలేస్తారా... అని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విచారణలో లోపం లేకుండా పోలీసులపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370